

ఒంగోలులోని ఎలైట్ స్టోర్ వద్ద బారులు తీరిన మందుబాబులు

ప్రచారానికి తెర

- ఆద్యంతం ఆధిక్యం ప్రదర్శించిన టీడీపీ అభ్యర్థులు
- నాలుగు సభలకు హాజరైన చంద్రబాబు
- లోకేష్ యువగళం నిర్వహణ
- గిద్దలూరులో పవన్ రోడ్‌షో
- రెండుచోట్ల బాలకృష్ణ హాజరు
- రేపు పోలింగ్.. ఏర్పాట్లలో యంత్రాంగం
- నేడు సిబ్బందికి సామగ్రి
- మద్యం దుకాణాలు బంద్
- బాటిళ్ల కోసం బారులు తీరిన మందుబాబులు



దర్శిలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ లక్ష్మితో కలిసి రోడ్‌షోలో పాల్గొన్న సినీ నటుడు శివాజీ

సాధారణ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడింది. పోటీలో ఉన్న అభ్యర్థులకు ప్రధాన ఘట్టమైన బహిరంగ ప్రచారం శనివారంతో ముగిసింది. ఎన్నికల షెడ్యూల్ మార్చి 16న విడుదల కాగా ఇంచుమించు అప్పటి నుంచి అభ్యర్థులు, పార్టీశ్రేణులు ప్రచారాన్ని చేపట్టాయి. అలా దాదాపు 55రోజులపాటు సాగిన ప్రచారం శనివారం సాయంత్రం ఆరు గంటలతో పరిసమాప్తమైంది. నిత్యం మార్మోగిన మైకులు, డీజే సౌండ్స్ మూగబోయాయి. పోటీచేసే వైసీపీ అభ్యర్థుల కన్నా టీడీపీ అభ్యర్థులపై ముందుగానే స్పష్టత వచ్చింది. దీంతో వారు తదనుగుణంగా క్యాంపెయిన్ ప్రారంభించి ముందు నిలిచారు.

ఒంగోలు, మే 11 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల సమరం తుది దశకు చేరుకొంది. శనివారం సాయంత్రం ఆరు గంటలతో ప్రచారానికి తెరపడింది. మొత్తంగా టీడీపీ అభ్యర్థులు క్యాంపెయిన్‌లో దూసుకుపోయారు. నామినేషన్ల సందర్భంగా భారీ ర్యాలీలు నిర్వహించిన వారు అంతకు ముందు, తర్వాత కూడా వీలైనంత ఎక్కువ సంఖ్యలో కుటుంబాలను కలిసి ఓట్లు అభ్యర్థించేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే కొంతమంది సమయం సరిపోక రోడ్‌షోలు, గ్రూపు మీటింగ్‌లు నిర్వహించారు. రంగంలో ఉన్న అభ్యర్థుల కుటుంబ సభ్యులు, ద్వితీయ, తృతీయశ్రేణి నేతలు గ్రామాలు, పట్టణాల్లో వార్డులను చుట్టేశారు. అలా దాదాపు నెలన్నరపాటు జిల్లాలో ఏప్రాంతంలో చూసినా పసుపుసైన్యం, వారికి మద్దతుగా జనసేన, బీజేపీ శ్రేణులు నిత్యం ఎన్నికల ప్రచారంలో ప్రజల మధ్యనే కనిపించారు. అదేసమయంలో ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థులు చాలాచోట్ల ఈ విషయంలో వెనుకబడిపోయారు. అభ్యర్థుల ఎంపికలో గందరగోళం నెలకొంది. స్థానికేతరులను పోటీకి నిలపడంతో క్షేత్రస్థాయి పరిస్థితులను అర్థంచేసుకోవడానికి, వైసీపీ స్థానిక నేతలను సమన్వయం చేసుకోవడానికి వారు అవస్థలు పడాల్సి వచ్చింది. దీంతో ఎన్నికల ప్రచారంలో చాలాచోట్ల వెనుకబడిపోయారు

జిల్లాను చుట్టేసిన అగ్రనేతలు

జిల్లాలో టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా కూటమి అగ్రనేతలు ప్రచారంలో పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాలుగుచోట్ల సభలకు హాజరయ్యారు. అనూహ్యంగా మార్కాపురం నియోజకవర్గంలోని మార్కాపురం, పొదిలి రెండు సభలకు హాజరుకావడమే కాక పొదిలి పక్కనే ఉన్న దర్శిలో మరుసటిరోజే పర్యటించారు. అన్నిచోట్లా భారీ స్పందన లభించగా ప్రచారం ముగింపునకు ఒక రోజు ముందు శుక్రవారం రాత్రి ఒంగోలులో రోడ్‌షోలో పాల్గొని కేడర్‌ను ఉత్సాహపరిచారు. ఇక పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రాష్ట్రవ్యాప్త యువగళం కార్యక్రమాన్ని తొలుత ఒంగోలు నుంచే ప్రారంభించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ గిద్దలూరు సభలో పాల్గొన్నారు. అలాగే సినీ హీరో, టీడీపీ నేత నందమూరి బాలకృష్ణ కొండపి నియోజకవర్గం మర్రిపూడి, నియోజకవర్గ కేంద్రమైన ఎస్ఎన్‌పాడులో జరిగిన సభలకు హాజరయ్యారు. మిగతా ప్రచారం అంతా పోటీలో ఉన్న అభ్యర్థులే ప్రధానంగా కొనసాగించారు. టీడీపీ కేడర్‌తోపాటు జనసేన, బీజేపీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నాయి.



ఒంగోలు ప్రచారంలో విజయ సూచికగా పూల విల్లును ఎక్కుపెడుతున్న జనార్దన్, పక్కన మాగుంట

ఆఖరిరోజు అదిరింది!

- భారీ ర్యాలీలు, ప్రచారంలో తూర్పుప్రాంత టీడీపీ అభ్యర్థులు
- గ్రామస్థాయి నేతలతో పశ్చిమ అభ్యర్థులు బిజీబిజీ

సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారంతో ముగిసింది. చివరి రోజు కూడా జిల్లాలో పోటీలో ఉన్న టీడీపీ అభ్యర్థుల జోరు కొనసాగింది. తూర్పు ప్రాంత అభ్యర్థులు ఉదయం నుంచి నిర్దేశిత సమయం ముగిసే వరకు భారీ ర్యాలీలు, ఇతర రూపాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. పశ్చిమప్రాంత అభ్యర్థులు ఆ ప్రక్రియను అంతకు ముందే పూర్తిచేసి చివరిరోజున గ్రామస్థాయి నాయకులతో పోలింగ్ నిర్వహణకు సంబంధించి మంతనాలలో బిజీబిజీగా గడిపారు. టీడీపీ ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ శుక్రవారం రాత్రి నగరంలో బస చేసిన పార్టీ అధినేత చంద్రబాబుకు శనివారం వీడ్కోలు పలికిన అనంతరం రూరల్ మండలంలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. సాయంత్రం ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, దామచర్ల కలిసి ఒంగోలులోని గాంధీరోడ్డులో భారీ ర్యాలీ నిర్వహించారు. కొండపి అభ్యర్థి డాక్టర్ స్వామి పొన్నలూరు మండలంలో విస్తృతంగా పర్యటించగా మాగుంట తనయుడు రాఘవరెడ్డి పాల్గొన్నారు. ఎస్ఎన్‌పాడు టీడీపీ అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్ ఉదయం చీమకుర్తి మండలంలో, సాయంత్రం ఎన్‌జీపాడు మండలం పోతవరంలో ప్రచారం నిర్వహించారు. దర్శి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ముండ్లమూరు మండలంలో ప్రచారం చేపట్టగా సినీ హీరో శివాజీ పాల్గొని సంఘీభావం తెలిపారు. సాయంత్రం దర్శిలో ర్యాలీ నిర్వహించి ప్రచారం ముగించారు. ఇక ఇప్పటికే ప్రచార కార్యక్రమాలను ముగించిన పశ్చిమప్రాంతంలోని కనిగిరి అభ్యర్థి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, వైపాలెం అభ్యర్థి ఎరిక్షన్‌బాబు, మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి, గిద్దలూరు అభ్యర్థి అశోక్‌రెడ్డి సోమవారం జరగనున్న పోలింగ్‌పై దృష్టి సారించారు. అందుకోసం వివిధ గ్రామాల నేతలతో మంతనాలు చేస్తూ బిజీబిజీగా కనిపించారు.

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం జరగనుండటంతో అందుకు సంబంధించిన ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. పోలింగ్ ఉదయం 7గంటలకు ప్రారంభం కానుంది.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

దీంతో ఆదివారం సాయంత్రానికే ఆయా కేంద్రాలకు సిబ్బందిని, పోలింగ్ సామగ్రిని చేర్చాలని నిర్ణయించారు. వారి కోసం ప్రత్యేక బస్సులను కూడా ఏర్పాటు చేశారు. మరోవైపు ఎన్నికల కమిషన్ ఆదేశాలతో మద్యం దుకాణాలను బంద్ చేశారు. రెండురోజుల పాటు మద్యం అందుబాటులో ఉండే అవకాశం లేదన్న విషయాన్ని గుర్తించిన మందుబాబులు శనివారం బాటిళ్ల కోసం దుకాణాల ముందు బారులు తీరారు. మండుతున్న ఎండల్లో సైతం వారు కొనుగోలుకు క్యూ కట్టారు. అధికశాతం షాపులలో మధ్యాహ్నానికే అమ్మకాలు నిలిచిపోయాయి. అలాగే పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు, ఇతరత్రా చర్యలను అధికారులు చేపట్టారు.

బృందావనంలో బాబు సందడి

- అధినేతను కలిసిన టీడీపీ నాయకులు

ఒంగోలు (కార్పొరేషన్), మే 11 : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఒంగోలులోని బృందావనం ఫంక్షన్ హాలులో సందడి చేశారు. శుక్రవారం నగరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయన రాత్రికి సమీపంలోని బృందావనం ఫంక్షన్ హాలులో బస చేశారు. శనివారం ఉదయం 11.10 గంటలకు ఇక్కడి నుంచి బయల్దేరి ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు నంద్యాల జిల్లాకు వెళ్లారు. అంతకుముందు టీడీపీ కూటమి అభ్యర్థులు దామచర్ల జనార్దన్, డాక్టర్ స్వామి, బీఎన్ విజయ్‌కుమార్, ఎరిక్షన్‌బాబుతో పాటు దామచర్ల సత్య, పలువురు ముఖ్యనాయకులు, పార్టీ శ్రేణులు చంద్రబాబును కలిశారు.



ఒంగోలు నుంచి బయల్దేరి వెళ్తున్న చంద్రబాబు

రసవత్తర పోటీ





- ఒంగోలు లోక్‌సభలో ప్రధాన పార్టీల అభ్యర్థులపై విస్తృత చర్చ
- సేవా కార్యక్రమాలు, మంచితనం మాగుంటకు వరం
- రాజకీయ, వ్యక్తిగత జీవితంపై ఆరోపణలు చెవిరెడ్డికి ప్రతిబంధకాలు
- ప్రచారంలో దూసుకుపోయిన సిటింగ్ ఎంపీ
- ప్రలోభాలకు ప్రాధాన్యం ఇచ్చిన వైసీపీ అభ్యర్థి
- టీడీపీ కూటమికి అసెంబ్లీ స్థానాల్లో దీటైన అభ్యర్థులు
- వైసీపీకి స్థానికేతరులు, కొత్తవారే అధికం

(ఆంధ్రజ్యోతి ఒంగోలు) ఒంగోలు లోక్‌సభ స్థానంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య పోటీ రసవత్తరంగా మారింది. టీడీపీ కూటమి అభ్యర్థి, స్థానిక ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిల భిన్న మనస్తత్వాలపై ప్రజల్లో జోరుగా చర్చ సాగుతోంది. మంచితనం, సేవా కార్యక్రమాలు, విస్తృత పరిచయాలు ఎంపీకి వరంగా కనిపిస్తున్నాయి. వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి స్థానికేతరుడు కావడం.. ఆయన రాజకీయ, వ్యక్తిగత జీవితంపై తీవ్ర ఆరోపణలు ఉండటం ప్రతిబంధకాలుగా కనిపిస్తున్నాయి. 1991 నుంచి మాగుంట కుటుంబం ఇక్కడ రంగంలోకి వచ్చిన నాటి నుంచి ఎనిమిది సార్లు ఎన్నికలు జరగ్గా ఆరుసార్లు వారే గెలుపొందారు. అందులో ప్రస్తుత టీడీపీ అభ్యర్థి శ్రీనివాసులరెడ్డి నాలుగు సార్లు విజయం సాధించారు. వివిధ రకాల అంశాలు ప్రస్తుతం టీడీపీ కూటమికి అనుకూలంగా మారగా వైసీపీ ఎదురీదాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

విభిన్న మనస్తత్వాలపై చర్చ

తాజా పరిస్థితులను పరిశీలిస్తే ప్రధాన పోటీ అభ్యర్థులైన మాగుంట, చెవిరెడ్డి విభిన్న మనస్తత్వాలపై ప్రజల్లో విస్తృత చర్చ సాగుతోంది. అందులో అనేక అంశాలలో మాగుంట పట్ల సాకూలత ప్రజల్లో వ్యక్తమవుతోంది. గెలుపోటములకు అతీతంగా 33ఏళ్లుగా ఆ కుటుంబం ఒంగోలు లోక్‌సభను అంటిపెట్టుకొని రాజకీయం చేయడం అందులో ప్రధానాంశం. ఇక వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి విషయానికొస్తే ప్రజలతో, శ్రేణులతో కనీస పరిచయాలు లేవు. జగన్ ఎక్కడుంటే అక్కడ ఉంటానని చెబుతున్నారే తప్ప స్థానికంగా ఉంటానని చెప్పలేకపోయారు. వ్యాపార అంశాలను పక్కనబెడితే రాజకీయంగా, వ్యక్తిగతంగా మాగుంట ఎలాంటి ఆరోపణలు లేవు. అదే చెవిరెడ్డి విషయానికొస్తే ఆయన రాజకీయ, వ్యక్తిగత జీవితం అనేక ఆరోపణలతో నిండిపోయింది. ఎర్రచందనం స్మగ్లరనే ప్రచారం ప్రజల్లో బలంగాఉంది.

ప్రచారంలోనూ తేడా

ఎన్నికల ప్రచారంలోనూ చెవిరెడ్డి అసెంబ్లీ అభ్యర్థులపైనే ఆధారపడ్డారు. మాగుంట వైపు నుంచి చూస్తే ఆయన కుటుంబసభ్యులు, అన్ని నియోజకవర్గాలను జల్లెడపట్టారు. ఇంకా ఆయన కుమారుడు రాఘవరెడ్డి ముందు నుంచి వ్యూహాత్మకంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. అటు శ్రేణులను సమన్వయం చేసుకోవడంలోనూ మాగుంట సఫలీకృతులయ్యారు. చెవిరెడ్డి విషయానికొస్తే సీఎం జగన్ పాల్గొన్న సభల్లో కనిపించడం, అడపాదడపా పార్టీ శ్రేణుల పరిచయ సమావేశాలకే పరిమితమయ్యారు. అంతకుమించి ఆయన వ్యక్తిగత సిబ్బంది పోకడలు గ్రామాల్లో, ప్రజల్లో వ్యతిరేకతకు కారణమయ్యాయి. ఓటర్లను ప్రభావితం చేసేందుకు హవాలా మాదిరిగా బియ్యం, వలంటీర్లకు నగదు పంపిణీ, చివరికి జర్నలిస్టులకు గిఫ్టుల పంపిణీలాంటి కార్యక్రమాలతో సాధారణ ప్రజల్లో కూడా చెడ్డపేరు తెచ్చుకున్నారు.

ఇటు స్థానికులు.. అటు బయటివారు..

లోక్‌సభ నియోజకవర్గంలో తాజాగా నెలకొన్న పరిస్థితులను పరిశీలిస్తే.. అనేక అంశాలు టీడీపీ కూటమికి సానుకూలంగా, వైసీపీకి ప్రతిబంధకంగా మారాయి. టీడీపీ కూటమి అభ్యర్థులు దర్శిలో మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో స్థానిక ప్రజలతో మమేకమై ముందు నుంచి పనిచేస్తున్న వారే. వైసీపీ విషయానికొస్తే ఒంగోలు, దర్శిలో మాత్రమే స్థానికులతో పరిచయం ఉన్న అభ్యర్థులను రంగంలో దింపింది. కనిగిరిలో స్థానికుడైనప్పటికీ ప్రజాసంబంధాలు లేని భూఆరోపణలు ఉన్న అభ్యర్థిని వైసీపీ పోటీపెట్టింది. కొండపి, వైపాలెం, మార్కాపురం నియోజకవర్గాల్లో స్థానికేతరులను వైసీపీ రంగంలోకి దించింది. మార్కాపురం అభ్యర్థి ప్రస్తుతం స్థానికుడినని అంటున్నారు. నిన్నమొన్నటి వరకు గిద్దలూరు స్థానిక నియోజకవర్గంగా ఆయన చెప్పుకున్నారు. దర్శిలో టీడీపీ అభ్యర్థిగా రంగంలోకి వచ్చింది మహిళ కావడం, డాక్టర్ వృత్తిలో ఉండటం, ప్రజలతో మమేకమయ్యే చొరవ ఉండటంతో ప్రజల్లో దూసుకెళ్తున్నారు. గత ఎన్నికల్లో వైసీపీకి మంచి ఆధిక్యతను ఇచ్చిన పశ్చిమప్రాంతంలో టీడీపీ నుంచి నువ్వానేనా అన్న స్థాయిలో పోటీ నెలకొంది. ఈ దశలో ఎంపీ అభ్యర్థిగా మాగుంట రావడం, ప్రభుత్వ వ్యతిరేకత.. అన్నింటికీ మించి స్థానికంగా జరగని అభివృద్ధి వైసీపీకి శాపంగా మారాయి.

ఎట్టకేలకు బియ్యం దుకాణం సీజ్ | తాతా షాపులో రెండో రోజూ అధికారుల తనిఖీలు

వివరాలు లోపలి పేజీల్లో..

బాబును కలిసిన దామచర్ల కుటుంబం



చంద్రబాబుతో దామచర్ల కుటుంబసభ్యులు

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ కుటుంబం శనివారం కలిశారు. ఒంగోలులో ప్రజాగళం ప్రచారానికి విచ్చేసిన చంద్రబాబు నాయుడు శుక్రవారం రాత్రి నగరంలో బస చేయగా, శనివారం ఉదయం దామచర్ల కుటుంబం కలిశారు. - ఒంగోలు (కార్పొరేషన్)

అభివృద్ధిని గెలిపించండి..

వైసీపీ అరాచకాన్ని ఓడించాలి



మాట్లాడుతున్న సూర్యప్రకాష్‌రెడ్డి

ఒంగోలు(కార్పొరేషన్), మే 11 : ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన దామచర్ల జనార్దన్‌ను ప్రజలు గెలిపించాలని, అక్రమణలు, భూకబ్జాలు, అవినీతికి పాల్పడిన బాలినేని శ్రీనివాసరెడ్డిని చిత్తుగా ఓడించాలని టీడీపీ నేత పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి, ఎద్దు శశికాంత్ భూషణ్, బండారు మదన్ కోరారు. శనివారం ఒంగోలులోని ఎన్టీఆర్‌భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ విజ్ఞులైన ఓటర్లు తమ విలువైన ఓటును అభివృద్ధి చేసే నేత దామచర్లకు వేయాలని కోరారు. 13న జరిగే ఎన్నికలలో ప్రజలు వాస్తవాలు ఒక్కసారి పరిశీనల చేసుకోవాలన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పనిచేసిన బాలినేని ఒంగోలు నియోజకవర్గానికి ఏమి చేశారో గుర్తించాలని సూచించారు. ఒక్కసారి ఎమ్మెల్యేగా పని చేసిన దామచర్ల రూ.2600 కోట్లుతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని, గత ఐదేళ్ళలో బాలినేని గెలిచిన తర్వాత నగరంలో ప్రభుత్వ ఆస్తులు, ప్రజల ఆస్తులు ఆక్రమణలకు గురయ్యాయని విమర్శించారు. బాలినేని తనయుడి అరాచకాలు. దాడులు పెరిగాయని, ప్రజలు ఒక్కసారి ఆలోచించి ఓటు వేయాలని, అవినీతి సొమ్ముతో విచ్చలవిడిగా డబ్బులు, మద్యం, బియ్యం. పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల సొమ్మును దోచుకున్న వైసీపీ నేతలు పంచే బహుమతులు తీసుకున్నా, ప్రజల అభివృద్ధి కోసం పని చేసే టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తెలుగు మహిళల ప్రచారం



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాగసత్యలత

తెలుగుదేశం పార్టీ గెలుపు కోరుతూ టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ గెలుపు కోసం ఆయన సతీమణి నాగసత్యలత శనివారం ముమ్మర ప్రచారం చేశారు. ఎన్నికల ప్రచారం చివరిరోజు కావడంతో నియోజకవర్గ తెలుగు మహిళలతో కలిసి పసుపు రంగు వస్త్రాలు ధరించి, సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కర్నూలురోడ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి అద్దంకి బస్టాండ్, పార్టీ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో తెలుగు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నగరంలో నడిచిన సైకిల్ ర్యాలీ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. వందలాది మంది తెలుగు మహిళలు పసుపు దండుగా కదలడంపై ప్రజలు దామచర్ల గెలుపు ఖాయమని చర్చించుకోవడం కనిపించింది. - ఒంగోలు (కార్పొరేషన్)

దళిత ద్రోహి జగన్‌రెడ్డి

మాలల మద్దతు టీడీపీకే..

మాలమహాసభ అధ్యక్షుడు వెంకట్రావు



మాట్లాడుతున్న మల్లెల వెంకట్రావు

ఒంగోలు (కార్పొరేషన్), మే 11: దళితులను ఘోరంగా మోసం చేసిన సీఎం జగన్మోహన్‌రెడ్డి దళిత ద్రోహి అని మాల మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు ఆరోపించారు. శనివారం ఒంగోలులోని ఎంసీఏభవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాలలను ఓటుబ్యాంకుగా ఉపయోగించుకుని అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి, పదవులన్నీ రెడ్డి సామాజిక వర్గానికి కట్టబెట్టారని విమర్శించారు. ఎస్సీ కార్పొరేషన్‌ను మూడుగా విడగొట్టి పైసా నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారన్నారు. గడచిన ఐదేళ్ళలో దళితులు అన్ని విధాలుగా నష్టపోయారని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అమలు చేసిన అంబేడ్కర్ విదేశీ విద్య పథకాని కి జగన్ విదేశీ విద్య అని పేరు పెట్టుకోవడం దుర్మార్గమన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను దారిమళ్ళించి, తన సొంత పథకాలకు వాడుకున్నారని విమర్శించారు. దళితుల పట్ల వివక్ష చూపుతున్న జగన్‌రెడ్డిని ఓడించడానికి రాష్ట్రంలోని మాలలందరూ సిద్ధం కావాలన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మాల, మాదిగల సంక్షేమం సాధ్యప డిందని పేర్కొన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌ను అత్యధిక నిధులు కేటాయించడంతో పాటు, రుణాలు అందజేశారని, ఇన్నోవా కార్లు, వృత్తి పరికరాలు, వ్యాపారాలు చేసుకునేందుకు, దళితులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం కోసం నిధులు కేటాయించి అండగా నిలిచిన చంద్రబాబు మరలా ముఖ్యమంత్రి కావాలని కోరారు. టీడీపీ హయాంలో మాల, మాదిగలు ఆర్థికపురోభివృద్ధి సాధించారన్నారు. అలాగే విద్యార్థులకు ఫీజు రీయంబర్సుమెంట్ నేరు గా కాలేజీలకే వేయడం ద్వారా ఎలాంటి ఆర్థిక భారాలు లేకుండా విద్యార్థులు చదువులు పూర్తి చే సుకున్నారని తెలిపారు. దళితులకు సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని, ఎన్నికల్లో మాలలు కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

29 మద్యం బాటిళ్లు పట్టివేత

మద్దిపాడు, మే 11: పెద్దకొత్తపల్లిలో శనివారం పోలీసులు 29 క్వార్టర్ మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. గ్రామానికి చెందిన చెన్నుపాటి వెంకటశేషయ్య వద్ద అక్రమంగా మద్యం ఉన్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ మహేష్ తన సిబ్బందితో దాడి చేశారు. 29 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే మద్దిపాడు బొద్రాయి సెంటర్‌లో ఓ యువకుడి నుంచి 16 మద్యం ఫుల్ బాటిళ్ల మద్యాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పట్టుకుందని ఎస్ఐ మహేష్ తెలిపారు. ఈ మద్యాన్ని ఎక్సైజ్‌శాఖకు అప్పగించి, కేసు నమోదు చేశారు.

ఎన్నికల్లో టీడీపీ కూటమిని గెలిపించాలి

టీడీపీ కూటమి ఒంగోలు అసెంబ్లీ, ఎంపీ అభ్యర్థులు దామచర్ల, మాగుంట పిలుపు ● చివరి రోజు విస్తృత ప్రచారం





కమ్మపాలెంలో ప్రజలకు అభివాదం చేస్తున్న దామచర్ల, చెరువుకొమ్ముపాలెంలో జనార్దన్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు

ఒంగోలు (కార్పొరేషన్), మే 11 : ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో టీడీపీ కూటమి ఒంగోలు అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, సైకిల్ గుర్తుకు ఓటు వేసి సంక్షేమ పాలన సాధించుకోవాలని ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్దన్, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. శనివారం ఎన్నికల ప్రచారం ముగింపు రోజు కావడంతో నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో దామచర్ల జనార్దన్ విస్తృతంగా పర్యటించారు. స్థానిక 18వ డివిజన్‌లోని చెరువుకొమ్ముపాలెంలో పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. అలాగే ఒంగోలు రూరల్ పరిధిలోని యరజర్ల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం సర్వేరెడ్డిపాలెం, నగరంలోని 7, 8 డివిజన్లలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన రోడ్‌షోలో దామచర్ల మాట్లాడుతూ సోమవారం జరగబోయే ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకమన్నారు. అరాచకానికి, అభివృద్ధికి మధ్య జరుగుతున్న పోటీలో ప్రజలు న్యాయ నిర్ణేతలు కావాలని కోరారు. అవినీతి సొమ్మును ఎరగా చూపి, ప్రజలను మరోసారి మోసం చేస్తున్న వైసీపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలు బాగుండాలన్నా, రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగాలన్నా టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. యువతకు ఉద్యోగాలు రావాలన్నా, మహిళలు సంతోషంగా ఉండాలన్నా, పన్నుల భారం పోవాలన్నా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలు ఆశీర్వదించి గడిచిన ఐదేళ్ళ వైసీపీ పాలనలో పడిన ఇబ్బందులు ఒక్కసారి గుర్తు చేసుకోవాలన్నారు. దోచుకున్న సొమ్ముతో తాత్కాలికంగా అందించే తాయిలాలకు ఆశ పడవద్దని తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే అన్ని వర్గాల వారి సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. 2014లో ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపించారని, మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని దామచర్ల కోరారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో దామచర్లకు స్థానిక ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

ఘనంగా గాంధీరోడ్‌లో రోడ్‌షో

తెలుగుదేశం పార్టీ గెలుపు కోరుతూ టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, దామచర్ల జనార్దన్‌లు శనివారం నగరంలోని గాంధీరోడ్‌లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యాపారులు, ప్రజలతో మాట్లాడారు. సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. తెలుగుదేశం పార్టీ గెలుపుతోనే వ్యాపారులపై ఆర్థిక భారాలు తగ్గుతాయన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దామచర్ల మాగుంటలకు ఘనంగా స్వాగతం పలికి, హారతులిచ్చారు.

ఆశీర్వదించండి..అండగా ఉంటా!

టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్ ● పలు గ్రామాల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



చీమకుర్తి మండలంలో ప్రచారం చేస్తున్న విజయ్‌కుమార్



పోతవరంలో మాట్లాడుతున్న బీఎన్

చీమకుర్తి, మే11 : "గత ఇరవై ఏళ్లుగా మీ సమస్యల పరిష్కారంలో పార్టీలకతీతంగా కృషి చేశాను. మరోసారి ఆశీర్వదించండి. మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించండి. మీ సంక్షేమం, అభివృద్ధికి అండగా నిలుస్తా" అని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ కోరారు. చీమకుర్తి మండలంలోని జీఎల్.పురం, పుట్టచెరువుపాలెం, రామచంద్రాపురం గ్రామాల్లో శనివారం విజయ్‌కుమార్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో శ్రేణులు విజయ్‌కుమార్‌కి అఖండ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ కూటమి అభ్యర్థుల గెలుపుతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు. మహిళల అభ్యున్నతి, పింఛను రూ.4వేల కూటమి గెలుపుతోనే సమకూరుతాయన్నారు. కార్యక్రమంలో గొట్టిపాటి రాఘవరావు పాల్గొన్నారు.

పోతవరం గ్రామంలో..

నాగులుప్పలపాడు: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తనను ఎమ్మెల్యేగా ఆదరించాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం పోతవరం గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, మహిళలు బీఎన్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రాభివృద్ధి శూన్యమన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల మహిళలకు మేలు కలుగుతుందని చెప్పారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, తేనేటి కృష్ణప్రసాద్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. ప్రతి ఇంటికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, ప్రతి మహిళకు నెలకు రూ.1500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు, ప్రతి రైతుకు ఏటా రూ.20వేలు, నిరుద్యోగభృతి రూ.3వేలు ఇస్తామన్నారు. ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు తేళ్ల మనోజ్‌కుమార్, కాకర్ల లక్ష్మీవరప్రసాద్, దివి పున్నారావు, శరత్, నార్నె అంజయ్య చెరుకూరి వెంకి, శేషారావు, జనసేన నాయకులు ధనుష్, సాయిచరణ్, నాయకులు పాల్గొన్నారు.

మున్నా ముఠాకు 45 ఏళ్ల జైలు

- **ఉరిశిక్షను యావజ్జీవంగా మార్చిన రాష్ట్ర హైకోర్టు**
- **రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమని ఆక్షేపణ**

ఒంగోలు(క్రైం), మే 11: హైవే కిల్లర్‌గా పేరొందిన మున్నా గ్యాంగ్‌కు ఉరిశిక్షను రద్దు చేసి 45 ఏళ్ళు యావజ్జీవంగా మారుస్తూ రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇచ్చింది. మూడు దశాబ్దాల క్రితం మున్నా ముఠా జాతీయ రహదారిపై నిశబ్ద మారణకాండ సాగించింది. 13మందిని మట్టు బెట్టింది. ఇనపలోడుతో వెళ్లే లారీలే లక్ష్యంగా ఈ మారణకాడ సాగింది. ఈ నేపథ్యంలో హైవేపై రక్తం పారించిన మున్నాగ్యాంగ్‌కు 2021 మే నెలలో జిల్లా కోర్టు 12 మందికి ఉరి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. అప్పట్లో ఈ తీర్పు రాష్ట్రవ్యాప్తంగా సంచలన రేపింది. ఈక్రమంలో జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తు దోషులు హైకోర్టులో అప్పీలుకు వెళ్ళారు. దీంతో రాష్ట్ర హైకోర్టు విచారణ చేపట్టిన డివిజన్ బెంచ్ న్యాయమూర్తులు జస్టిస్ యు.దుర్గాప్రసాద్, జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ శుక్రవారం తీర్పు ఇచ్చారు. మున్నా ముఠాలో ఉరిశిక్ష విధించిన వారికి 45 ఏళ్ళు యావజ్జీవం విధిస్తూ ఈ కాలంలో ఎలాంటి క్షమాభిక్ష ప్రసాదించేందుకు అవకాశం లేదని తీర్పులో స్పష్టం చేశారు. అదేవిధంగా జాతీయరహదారిపై ఇలాంటి హంతకులను నిలవరచడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని ఆక్షేపణ చేశారు. అప్పట్లో ఒంగోలు జిల్లా సెషన్స్ కోర్టులో న్యాయమూర్తి మనోహర్‌రెడ్డి తీర్పు ఇచ్చారు. మున్నా ముఠాలో 12మందికి ఉరిశిక్ష, నలుగురికి యావజీవం, ఒకరికి 10 ఏళ్లు, మరొకరికి ఏడేళ్ళు జైలుశిక్ష విధించారు.

తనిఖీల పేరుతో హడలెత్తించిన మున్నాగ్యాంగ్

జిల్లాలోని కనిగిరికి చెందిన ఎండీ అబ్దుల్‌సమాద్ అలియాస్ మున్నా తొలుత నాటు వైద్యుడు. నాటుమందులు తయారు చేసి విక్రయాలు చేసేవాడు. ఆ తరువాత గుప్తనిధులు తవ్వకాలపై దృష్టి సారించి ఓ ముఠాను ఏర్పాటు చేసుకున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై తనిఖీల పేరుతో ఇనపలోడుతో వెళ్లే లారీలను లక్ష్యంగా చేసుకొని డ్రైవర్, క్లీనర్‌లను దారుణంగా హత్య చేసి గుండ్లకమ్మ నదీ ఒడ్డున ఇసుకలో పూడ్చి వేశారు. ఈ లారీలను మద్దిపాడు కొష్టాలు సమీపంలోని ఓ గోదాంలోకి తీసుకెళ్లి ఇనుమును విక్రయించి లారీలను పార్టులుగా ఊడదీసి పాత ఇనుముకు అమ్ముకుంటారు. 2008లో ఈ హైవే కిల్లరు హత్యల పరంపర కొనసాగింది. మొత్తం మున్నాతోపాటు 17 ముఠా సభ్యులు ఉన్నారు. వారు 13 మందిని ఈ విధంగా హత్యలకు పాల్పడ్డారు. లారీలను గల్లంతు చేసి బాడీలు మాయం చేయడం ఈ ముఠాకు వెన్నతో పెట్టిన విద్య. ఉరిశిక్ష పడిన వారిలో ఎండీ.అబ్దుల్ సమాద్ అలియాస్ మున్నా, షేక్ రియాజ్, హిదయతుల్లా, జమాల్, బత్తుల సాల్మన్, ఏపూరి చినవీరస్వామి, పెదవీరస్వామి, గుండా భానుప్రకాష్, రాచమల్లు సంపత్, గుండెబోయిన శ్రీధర్, షేక్ హఫీజ్, షేక్ దాదపీర్‌లు ఉన్నారు.

ముఠా ఇలా దొరికింది..

2008 అక్టోబరులో ఇనుము లోడుతో తమిళనాడులోని కల్పకం వెళుతూ ఒంగోలు సమీపంలో మాయమైంది. దీంతో లారీ యజమాని ఒంగోలు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఎస్పీగా పని చేసిన నవీన్‌చంద్ ఈక్రమంలో దర్యాప్తు అధికారిగా ప్రస్తుతం పీటీసీ ప్రిన్సిపాల్, అప్పట్లో ట్రైనీ డీఎస్పీగా ఉన్న దామోదర్‌ను నియమించారు. ఈక్రమంలో విచారణ అధికారులకు ఇంజన్ లేకుండా లారీ బాడీ పాత జిల్లా పరిషత్ కార్యాలయంలో నిలిపి వేసింది దొరికింది. అదే ఆధారంగా దర్యాప్తు చేసిన పోలీసులు అధికారులకు అనుమానాస్పద రీతిలో వెల్డింగ్ చేసే వ్యక్తి దొరికాడు. ఇలా మున్నాగ్యాంగ్‌ను పోలీసులు పట్టుకొని దర్యాప్తు చేసి గగుర్పాటుకు గురిచేసే నిజాలను వెలికి తీశారు.

ప్రతి పౌరుడు ఓటుహక్కును వినియోగించుకోవాలి

- **ప్రలోభాలకు గురికావద్దు..**
- **ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ పిలుపు**



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మే 11: ఓటుహక్కును వినియోగించుకోవడం ప్రతి పౌరుని బాధ్యతని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిష్పక్షపాతంగా ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోలు రూములో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈనెల 13న జరగనున్న పోలింగ్ ప్రక్రియ స్వేచ్ఛాయుత వాతావరణంలో, ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పోలింగ్ శాతం పెంచేందుకు వీలుగా ఓటర్లను ఆకర్షించేలా ఆదర్శ(మోడల్) పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద మంచినీటి సదుపాయం, టెంట్లు ఏర్పాటుతో పాటు విద్యుత్ సౌకర్యం, దివ్యాంగులు, వృద్ధులు సజావుగా కేంద్రంలోకి వెళ్ళేలా ర్యాంపులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శుక్రవారం సాయంత్రం ఆరుగంటలతో ప్రచారం ముగిసిందన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా నియోజకవర్గాల్లో బయటి నియోజకవర్గాల నుంచి వచ్చిన వారు ఎవరైనా ఉండేందుకు వీలులేదని స్పష్టం చేశారు. లాడ్జిల్లో, ప్రైవేటు అతిథిగృహాల్లో ఉండేవారు వెళ్ళిపోవాలని సూచించారు. ఏదైనా సందేహాలు ఉంటే 08592-288599 నెంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు. జిల్లాలో 2183 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో 259 ప్రాంతాల్లో 486 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా ప్రత్యేక కేంద్ర బలగాలను ఏర్పాటు చూసినట్లు కలెక్టర్ వెల్లడించారు. 1,589 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయడంతో పాటు 260 మంది వీడియోగ్రాఫర్ల సహాయంలో పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు చిత్రీకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రకియ కోసం పటిష్టమై బందోబస్తు చేపట్టినట్లు తెలిపారు. కీలక పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు, కేంద్ర బలగాలతో అదనపు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు ఎంసీసీ వైలేషన్ కింద 190 కేసులు నమోదు చేయడంతో పాటు రూ.5 కోట్ల విలువైన మెటీరియల్‌ను సీజ్ చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో డీఆర్వో శ్రీలత, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్ పాల్గొన్నారు.

లాండ్ టైటిల్ యాక్ట్ జీవో కాపీలు దహనం

ఒంగోలు(కార్పొరేషన్), మే 11: వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిల్ యాక్టుపై టీడీపీ శ్రేణులు కన్నెర్ర చేశారు. ప్రజల ఆస్తులపై ప్రభుత్వ పెత్తనాన్ని నిరసిస్తూ జీవో కాపీలను దహనం చేశారు. జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిల్ చట్టంతో మన ఆస్తులు జగన్ చేతిలోకి వెళతాయని, ప్రజల ఆస్తులు ప్రభుత్వం తాకట్టు పెడుతుందని విమర్శించారు. జీవో నెం.512 ల్యాండ్ టైటిల్ యాక్ట్ కాదని, ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ అని ఆరోపించారు. శనివారం స్థానిక 9వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి, వడ్లమూడి మునీంద్ర, 9వ డివిజన్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జీవో ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

అవీ..ఇవీ..

మల్లవరం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ

మద్దిపాడు, మే 11: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లవరం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు, ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు హుండీ పగలగొట్టి రూ.1.50 లక్షల నగదు చోరీ చేశారని ఆలయ కార్యనిర్వహణ అధికారి శనివారం ఉదయం మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ మహేష్ సంఘటన స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరు పరిశీలించారు. గత నాలుగు నెలల నుంచి హుండీలో డబ్బులను అలాగే ఉంచారు. సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని అంచనా. ఒంగోలు క్లూస్ టీం దుండగుల వేలిముద్రలు నమూనా, సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ నారా నాగిరెడ్డి, ఈవో నాగేశ్వరరావుల నుంచి పోలీసులు వివరాలు సేకరించారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

వైసీపీ అరాచక పాలనకు అంతం పలకాలి



గ్రేడింగ్ కూలీలకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

మద్దిపాడు, మే 11: రాష్ట్రంలో అభివృద్ధి కావాలో, అరాచక పాలన కావాలో ప్రజలు తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని ప్రొఫెషనల్ టీం ప్రెసిడెంట్ మన్నం రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం లింగంగుంట గ్రామంలో టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని, డీఎస్సీ ఉద్యోగాలపై తొలి సంతకం చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో బోడపాటి మురళి, అవినాష్, చుంచు సుధాకర్, నల్లమెతు బాబు, చైతన్య, రాయపాటి పవన్, రావిపాటి శ్రీనివాసరావు, నారిపెద్ది అనిల్, అన్నాబత్తిని శ్రీనివాస రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ

ఒంగోలు(కలెక్టరేట్), మే 11: ఎన్నికల నిర్వహణలో భాగంగా మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ల సమక్షంలో శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించేందుకు ఇప్పటికే పీవోలు, ఏపీవోలు, ఓపీవోలతో ప్రత్యేక టీంలను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ టీములను పోలింగ్ కేంద్రాల వారీగా కేటాయించేందుకు మూడోవిడత ర్యాండమైజేషన్ నిర్వహించారు. దీని ప్రకారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి వీరికి పోలింగ్ సామగ్రి ఇచ్చి ఆయా పోలింగ్ కేంద్రాలకు పంపిస్తారు. కార్యక్రమంలో జనరల్ అబ్జర్వర్లు అరవింద్‌కుమార్ చౌరాసియా, మయూర్ కె మెహత, డీఆర్వో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ సాధ్యం



ప్రచారం నిర్వహిస్తున్న పోతినేని శ్రీనివాసరావు, నాయకులు

మద్దిపాడు, మే 11: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ నాయకుడు పోతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం పెద్దకొత్తపల్లి అంజయ్యనగర్, నర్సాయిపాలెం, మారెళ్లగుంటపాలెం గ్రామాల్లో ఆయన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని, అన్నిరంగాలు అస్తవ్యస్తంగా మారాయని విమర్శించారు. గుండ్లకమ్మ గేట్లకు మరమ్మత్తులు చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని, సాగునీరు, తాగునీటి కష్టాలు పెరిగాయన్నారు. కనుక టీడీపీ కూటమి అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నల్లూరి శ్రీనివాసరావు, ఉప్పుటూరి చిన్న, అంజయ్యనగర్ యూత్‌ఫోర్స్ నాయకులు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



వీరభద్రాచారిని ఆహ్వానిస్తున్న శివారెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), మే11 : సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి. వీరభద్రాచారి భారతీయ జనతా పార్టీలో చేరారు. శనివారం ఒంగోలులోని బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి ఆయనకు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు పెముల మోజీ, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో ఘనంగా నర్సుల దినోత్సవం



వేడుకల్లో ప్రతిజ్ఞ చేస్తున్న నర్సులు

ఒంగోలు(కార్పొరేషన్), మే 11: ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో శనివారం ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని జిల్లా నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏడుకొండలు, జీజీహెచ్ సూపరింటెండెంట్ జి.దుర్గాదేవి, ఆర్ఎంవో హనుమంతరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ బి.సంపూర్ణమ్మలు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సుల సేవలు అభినందనీయం అన్నారు. ఉత్తమ సేవలు అందించిన నర్సులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్.అనంతలక్ష్మీ, ఉదయలక్ష్మీ, వందన, విజయ్‌కుమార్, రమణ నాయక్, మహేష్, కళ్యాణ్, జానీబాషా, హుజన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ మత్స్యకార నాయకులు



పార్టీలో చేరిన వారితో నాయకులు

కొత్తపట్నం(ఒంగోలు నగరం) మే 11: మండలంలోని కె.పల్లెపాలెం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు తెలుగు దేశంపార్టీలో చేరారు. వీరికి టీడీపీ మండల అధ్యక్షులు ద్వారబాకుల శ్రీనివాసరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. శనివారం కొత్తపట్నం పల్లెపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా దామచర్ల జనార్దన్, ఎంపీగా మాగుంట శ్రీనివాసులురెడ్డి విజయానికి పాటుపడాలని కోరారు. వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి చేరిన వారిలో పనమలము సలయ్య, పి.కోటేశ్వరరావు(పీకే), శింగోతు ప్రసాద, నాయకులు వెంకటేశ్వర్లు ఉన్నారు. కార్యక్రమంలో పల్లెపాలెం మాజీ సర్పంచ్ ప్రభుప్రకాష్, జ్వాలరామ్, నాయుడు శ్రీనివాసరావు, గ్రామ అధ్యక్షులు సైకం బాలకోటయ్య, తమ్ము శ్రీనివాసరావు, దేవప్రసాదు, పేరయ్య పాల్గొన్నారు.

బీఎన్ గెలుపు కోరుతూ పూజలు



కొబ్బరికాయలు కొడుతున్న నాయకులు

చీమకుర్తి, మే 11 : టీడీపీ కూటమి సంత నూతలపాడు నియోజకవర్గ అభ్యర్థిగా బరిలో ఉన్న బీఎన్.విజయ్‌కుమార్ గెలుపును కాంక్షిస్తూ చీమకుర్తి పట్టణంలోని సాక్షిరామలింగేశ్వరస్వామి ఆలయంలో తెలుగుదేశం నాయకులు శనివారం ప్రత్యేక పూజలు జరిపారు. 108 శరణాలతో 108 కొబ్బరి కాయలు కొట్టారు. కార్యక్రమంలో పరాల శ్రీనివాసరావు, సూరంపల్లి ప్రసాద్, కాట్రగడ్డ రమణయ్య, కందిమళ్ల గంగాధరరావు, రావిపాటి రాంబాబు, కొండయ్య, వెంగన్న, పత్తి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ఆర్వో కుమార్ విజ్ఞప్తి
- పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

కొండపి, మే11: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈనెల 13 వ తేదీన కొండపి నియోజకవర్గంలోని 283 పోలింగ్ కేంద్రాల్లో ఆయా గ్రామాల ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కొండపి నియోజకవర్గ ఈఆర్వో ఎ. కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరుగుతుందని ఆయన తెలిపారు. 11వ తేదీ సాయంత్రం 5 గంటలకు ప్రచార గడువు ముగిసిందని తెలిపారు. నియోజకవర్గానికి సంబంధం లేని వ్యక్తులు ఎవరూ ఉండకూడదన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలులో ఉంటుందని కుమార్ వివరించారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్లలోపు ఎలాంటి వాహనాలను అనుమతించబోమని ఆయన తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పెరిఫరీ వద్ద ఓటరు సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల ఆవల రాజకీయ పార్టీలు తమ శిబిరాలను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ బూతుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీసీ కెమెరాలు లేని చోట మైక్రో అబ్జర్వర్‌లు ఉంటారన్నారు. సిబ్బందికి భోజన వసతులు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి రెండు మండలాలకు బెల్ ఇంజనీర్లను , ప్రతి 10 పోలింగ్ కేంద్రాలకు సెక్టార్ అధికారులను నియమించామన్నారు. 12వ తేదీ సాయంత్రానికి పోలింగ్ సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ మెటీరియల్‌తో చేరుకుంటారన్నారు. పోలింగ్ కేంద్రంలోకి పోటీ చేస్తున్న అభ్యర్థులతోపాటు ఎలక్షన్ ఏజంట్లను మాత్రమే అనుమతిస్తామన్నారు. పోలింగ్ కేంద్రంలోకి ఎలాంటి ఆయుధాలు, కర్రలు, ఇతర వస్తువులు, సెల్‌ఫోన్లు అనుమతించడం జరగదన్నారు. ఈవీఎంలలో అసెంబ్లీ నియోజకవర్గానికి పింక్‌పేపరు, పార్లమెంటరీ నియోకవర్గానికి వైట్ పేపరు కేటాయించి రెండు బ్యాలెట్ యూనిట్లలో అమర్చామన్నారు. కేంద్ర బలగాలు పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహిస్తాయన్నారు. ఓటర్లు అందరూ 12 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకదాన్ని తీసుకుని వచ్చి బీఎల్వోలు అందజేసిన స్లిప్పులతో కేంద్రానికి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్వో కుమార్ సూచించారు. వృద్ధులకు, వికలాంగులకు, గర్భిణులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తామన్నారు. ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మరోమారు కుమార్ విజ్ఞప్తి చేశారు.



ర్యాలీలో మాట్లాడుతున్న సినీ నటుడు శివాజీ

మీపిల్లల భవిష్యత్తును ఆలోచించి ఓటువేయండి

దర్శి, మే 11: మీ పిల్లల భవిష్యత్తుకోసం ఆలోచించి ఓటు వేయాలని సినీహీరో శివాజీ పిలుపునిచ్చారు. దర్శిలో శనివారం కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఎన్నికల ప్రచారం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి సాధ్యమన్న విషయాన్ని గుర్తించాలన్నారు. చంద్రబాబు సమర్థపాలనలో అభివృద్ధి, సంక్షేమంతోపాటు అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. గత ఐదు సంవత్సరాలుగా సాగిన అవినీతి, అరాచక విధ్వంస పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, మాగుంట చందన, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

భూరక్షణ చట్టం కాదది - జగన్ భూ భక్షణ చట్టం

- స్వామి, రాఘవరెడ్డి విమర్శ
- జీవో ప్రతులు దహనం
- పొన్నలూరులో సమావేశాలు

పొన్నలూరు (కొండపి), మే11: ఏపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ భూరక్షణ చట్టం కాదని, జగన్ భూభక్షణ చట్టమని కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి విమర్శించారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పొన్నలూరు, నాగిరెడ్డిపాలెం, పైరెడ్డిపాలెం, పెరికపాలెం, చెరుకూరు, ముండ్లమూరివారిపాలెం, చెన్నిపాడు, కొత్తపాలెం, బాలిరెడ్డిపాలెం, మేకపాడు గ్రామాల్లో వారు పర్యటించారు. ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా పొన్నలూరులో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ జీవో ప్రతులను దహనం చేశారు. అనంతరం వారు వ్యాట్లాడుతూ రైతులు, చిన్న, సన్నకారు, కౌలు రైతులకు తాతలు, తరాల నుంచి వస్తున్న భూములపై హక్కులు కోల్పోనున్నారని విమర్శించారు. కోర్టులకు వెళ్లి పరిష్కరించుకునే అవకాశం కూడా లేకుండా జగన్ ప్రభుత్వం చట్టం చేస్తున్నదని విమర్శించారు. ఈచట్టాన్ని చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే రద్దు చేస్తూ రెండో సంతకం చేసి రైతులకు న్యాయం చేస్తానని హామీ నిచ్చారన్నారు. రైతు, మహిళ, బీసీ, ఎస్సీ, మైనార్టీ యువత సంక్షేమ కోరే ప్రభుత్వం ఎన్‌డీఏ ఆధ్వర్యంలో చంద్రబాబు సారథ్యంలో ఏర్పడనున్నదని వారు ఆకాంక్షించారు. నాయకులు, కార్యకర్తలు పోలింగ్ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని తమ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అక్రమాలు జరగకుండా చట్టబద్ధంగా ఎదుర్కోవాలని ఇరువురూ సూచించారు. సమావేశాల్లో పార్టీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మండల నాయకులు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



పొన్నలూరులో పార్టీ నాయకులతో సమావేశంలో పాల్గొన్న స్వామి, రాఘవరెడ్డి



ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ప్రతులను తగుల బెడుతున్న ఎమ్మెల్యే స్వామి, మాగుంట రాఘవరెడ్డి

అర్హులందరికీ తెల్ల రేషన్ కార్డులు

- కూటమి అభ్యర్థి స్వామి

టంగుటూరు, మే 11 : అర్హులైన ప్రతి ఒక్కరికీ తెల్లరేషన్‌కార్డులు మంజూరు చేయించి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానని తెలుగుదేశం కూటమి అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రజలకు హామీ ఇచ్చారు. మండలంలోని తన స్వగ్రామం తూర్పునాయుడుపాలెంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యతో కలసి ఎమ్మెల్యే శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మొదటి సంతకం మెగా డీఎస్సీపై పెట్టి నిరుద్యోగ యువత జీవితాల్లో ఆనందం కలిగిస్తాడని, రెండవ సంతకం జగన్ తెచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేస్తూ ప్రజల ఆస్తులను కాపాడుతూ చేయనున్న చట్టంపై చేయనున్నట్లు వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు తగ్గించాలన్న దురుద్దేశంతో తెల్లరేషన్‌కార్డులను విచ్చలవిడిగా రద్దు చేసిందని, తెలుగుదేశం ప్రభుత్వం రాగానే అర్హతున్న ప్రతి ఒక్కరికీ తెల్లరేషన్ మంజూరు చేయిస్తానని చెప్పారు. రానున్న ఉమ్మడి ప్రభుత్వంలో మహిళలకు, యువతకు, నిరుద్యోగులకు, రైతాంగానికి, విద్యకు, వైద్యానికి ప్రాధాన్యత నిస్తూ పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. కొండపి నియోజకవర్గంలో అసంపూర్తిగా మిగిలిపోయిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతాం అన్నారు. దామచర్ల, మాగుంట కుటుంబాలు ఎల్లప్పుడు కొండపి నియోజకవర్గాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తారని చెప్పారు. జిల్లాకు పరిశ్రమలు రాబట్టి యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా తెలుగుదేశం పార్టీ పాటుపడుతుందన్నారు. రేపు జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మీ పవిత్రమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సత్యా ప్రజలకు పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

సంక్షేమ సారథులకు అండగా నిలవండి : సత్య



మాట్లాడుతున్న దామచర్ల సత్య

టంగుటూరు : అనునిత్యం ప్రజల బాగోగులను, వారి సాధకబాధల్లో అండగా నిలుస్తున్న జనసేన, బీజేపీ కూటమి తెలుగుదేశం పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామికి అండగా నిలవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పిలుపునిచ్చారు. మండలంలోని తూర్పునాయుడుపాలెంలో శనివారం సత్య మీడియాతో మాట్లాడుతూ మాగుంటను, స్వామిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంలో యువతకు పని లేక, జీవనభృతి ప్రశ్నార్థకమై వారు చెడుమార్గంలో పయనిస్తున్నారని సత్య ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడ్డ వెంటనే చంద్రబాబు మెగా డీఎస్సీ విడుదల చేసి నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తారని చెప్పారు. సంగమేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేసి ప్రజల సాగు, తాగునీటి అవసరత తీర్చనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచి పారిశుద్యానికి పెద్దపీట వేయనున్నట్లు తెలిపారు. 50 రోజులుగా కూటమి అభ్యర్థుల ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ వారి విజయానికి అహర్నిశలు శ్రమించిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రేపు జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని అత్యధిక మెజారీతో గెలిపించాలని సత్య కోరారు.



పొన్నలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న స్వామి, రాఘవరెడ్డి, కూటమి నాయకులు

పొన్నలూరులో టీడీపీ భారీ ర్యాలీ

పొన్నలూరు (కొండపి), మే11: ఎన్‌డీఏ కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ పొన్నలూరులో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు శనివారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించా రు. ఎన్‌డీఏ జనేయస్వామి, ఒంగోలు ఎంపీ, ప్రస్తుత ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి ఆధ్వర్యంలో పొన్నలూరులో కూటమి బలపరుస్తున్న టీడీపీ అభ్యర్థికొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి... ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి తరుపున పోటీ చేస్తున్న తమను గెలపించాలని వారు విజ్ఞప్తి చేశారు. ర్యాలీలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్, టీడీపీ నాయకులు అనుమోలు సుధాకర్, కోటేశ్వరమ్మ, మండవ ప్రసాద్ కర్ణా కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పట్టుకున్న మద్యం, నిందితులతో సెబ్ సిబ్బంది

48 మద్యం బాటిళ్లు స్వాధీనం

పొన్నలూరు (కొండపి), మే11: మండలంలోని అగ్రహారం మద్యం షాపు నుంచి కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్న 48 మద్యం బాటిళ్లను సెబ్ అధికారులు శనివారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. పొన్నలూరు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆదర్శ్ అనే వ్యక్తి తన వాహనంలో తరలిస్తున్న మద్యాన్ని సింగరాయకొండ సీఐ నరహరి ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకున్నారు. నిందితుడి వాహనంతోపాటు సెల్‌ఫోన్ సీజ్ చేశారు. ఈ కేసులో పొన్నలూరు మద్యం దుకాణం సేల్స్‌మెన్‌ను కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తనిఖీలో సెబ్ ఎస్సై దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.1,42 లక్షల నగదు స్వాధీనం

కొండపి, మే11: మండలంలోని తాటాకులపాలెం గ్రామంలో ఉప్పుటూరి రవితేజ అనే యువకుడి వద్దనుంచి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి జంగం అజయ్ ఆధ్వర్యంలో సిబ్బంది 1, 42, 500 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. శనివారం సాయంత్రం రవితేజ దగ్గర డబ్బు ఉండటంతో పట్టుకుని నిందితుడిని కొండపి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రవితేజ మాత్రం డబ్బులు మిరప కాయలు అమ్మగా వచ్చాయని పోలీసులకు వివరించారు. కాగా ఎన్నికల నిబంధనల ప్రకారం 50 వేల రూపాయలకు మించి నగదు ఉండకూడదని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పట్టుబడిన నగదును కొండపి ఎస్సై కృష్ణబాజీబాబు అప్పగించారు. కాగా అధికార పార్టీ తరుపున నగదు పంచుతూ అధికారులను చూసి ఇద్దరు పారిపోయారని, రవితేజను అదుపులోకి తీసకున్నారని కూడా మరో పక్క సమాచారం.

కేజీ పొగాకు ధర రూ. 300

కొండపి, మే10: కొండపి పొగాకు వేలం కేంద్రంలో ఎఫ్-1 రకం పొగాకు కేజీ 300 రూపాయలు అత్యధిక ధర పలికింది. శనివారం వేలం కేంద్రానికి గోగినేనివారిపాలెం రైతులు తమ పొగాకు బేళ్లను విక్రయానికి తీసుకువచ్చారు. 969 బేళ్లను రైతులు వేలానికి తీసుకురాగా 886 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి జి. సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.



కనిగిరి వ్యవసాయమార్కెట్‌లో ఎన్నికల సామగ్రి కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రణాళికాబద్ధంగా ఎన్నికల సామగ్రి పంపిణీ

- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

కనిగిరి, మే 11: ఎన్నికల సామగ్రి పంపిణీచేసే క్రమంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని కలెక్టర్, ఎన్ని కల అధికారి ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక వ్యవసాయమార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని శనివారం కలెక్టర్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఆదేశాల ప్రకారం ఎన్నికల అధికారులు, సిబ్బంది తుచ పాటించాలన్నారు. ఎన్నికల విధుల కోసం ఇతర ప్రాంతాల నుంచి దాదాపు 60 బస్సులు కనిగిరి కేంద్రానికి వస్తున్నట్లు ఆయన తెలిపారు. తెల్లవారుజాము 5గంటల నుంచే ఎన్నికల సిబ్బంది, అధికారులు వారివారి ప్రాంతాల నుంచి ప్రయాణించి కనిగిరి 9గంటలలోపే చేరుకుంటారని చెప్పారు. వారికి నాణ్యమైన అల్పాహార ఏర్పాట్లను విధిగా చేపట్టాలన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటా!

- ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా
- టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



దర్శిలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

దర్శి, మే 11: ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ప్రజలను ఇబ్బందులు పెట్టే మనస్తత్వం తమ వంశంలో లేదన్నారు. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా శనివారం దర్శి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో ర్యాలీని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. దర్శి నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే బాగ్యం కల్పించిన టీడీపీ అధినేత చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. తమ కుటుంబానికి ప్రజలకు నిస్వార్థ సేవ చేయటమే తప్ప దాచుకోవటం, దోచుకోవటం, దాడులు చేయటం, ప్రజలను ఇబ్బందులు పెట్టటం తెలియదన్నారు. మా మెట్టినింటిలో 14 మంది డాక్టర్లు వైద్య వృత్తిలో కొనసాగుతున్నారని చెప్పారు. తాము కష్టపడి సంపాదించుకున్న సొమ్ములో కొంతభాగం ప్రజల కోసం ఖర్చు చేస్తున్నామేకానీ, ప్రజల సొమ్ము దోచుకోవటం మాకు అలవాటు లేదన్నారు. తనకు ఒక్క సారి అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. ప్రత్యర్థులు ఓటమి భయంతో తమను, తమ కుటుంబంపై వ్యక్తిగత దూషణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు తాము బయపడే ప్రసక్తేలేదన్నారు. ప్రజల మద్దతుతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతామని చెప్పారు. అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేస్తానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, సినీ హీరో శివాజీ, నగర పంచాయతీ చైర్మెన్ నారపుశెట్టి పిచ్చయ్య, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీ సూపర్ సక్సెస్

ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా శనివారం సాయంత్రం టీడీపీ కూటమి నిర్వహించిన ర్యాలీ సూపర్ సక్సెస్ అయింది. అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు రోడ్లపై బారులుతీరారు. మహిళలు పసుపురంగు దుస్తులు ధరించి జెండాలు చేతబూని హల్‌చల్ చేశారు. యువత కేరింతలు కొడుతూ పసుపురంగుతో కూడిన కాగితాలను చల్లుకుంటూ ఆ మార్గమంతా పసుపుమయం చేశారు. దర్శి-అద్దంకి రోడ్డులోని పోలేరమ్మ గుడిలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, సినీ హీరో శివాజీ పూజలు నిర్వహించి ర్యాలీగా బయలుదేరారు. టాప్‌లేని వాహనంపై ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఎన్నికల ప్రచారం విజయవంతంగా ముగియటంతో టీడీపీ కూటమి క్యాడర్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ కవ్వింపు చర్యలు

టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పోలేరమ్మ గుడిలో పూజలు చేస్తున్న సమయంలో కొంతమంది వైసీపీ కార్యకర్తలు జెండాలు పట్టుకొని వచ్చి కవ్వింపు చర్యలకు దిగారు. కూటమి క్యాడర్ ఎదురు తిరగటంతో తోకముడిచి వెళ్లిపోయారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల అభిమానాన్ని చూరగొనాల్సిన రాజకీయ పార్టీలు కవ్వింపు చర్యలకు పాల్పడటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓటమి భయంతోనే వైసీపీ ఇలాంటి పనికిమాలిన పనులు చేస్తున్నారని పలువురు అభిప్రాయపడ్డారు.

దళిత, బహుజనులకు చేదోడుగా ఉంటా!

- టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర
- వైసీపీని వీడిన పలు కుటుంబాలు

కనిగిరి, మే 11: కనిగిరి ప్రాంతంలోని దళిత, బహుజన వర్గాలకు చేదోడుగా ఉంటానని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహా రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని పాస్టర్‌లు, దళిత, బహుజనవర్గాలకు చెందిన ప్రజలు ఉగ్రకు మద్దతుగా శనివారం స్థానిక అమరావతి గ్రౌండ్స్ లో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ పాస్టర్ లకు ఇళ్లస్థలాలు ఇప్పించి పక్కా గృహాలను నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రతి ఒక్కరికీ చేతనైనంత సేవతో పాటు సహాయ, సహకారాలు అందించానన్నారు. దశాబ్దకాలంగా కనిగిరి ప్రజల సంక్షేమం కోసం సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగించినట్లు చెప్పారు. ఆరోగ్యం బాగాలేని పేదలకు వైద్య సహాయం కూడా అందించామన్నారు. తనపై దుష్ప్రచారాలు చేస్తూ ఎన్నికల్లో పబ్బం గడుపుకునే నేతలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఎవరెన్ని చెప్పినా ఎన్నికల్లో గెలిచిన అనంతరం దళితులకు, పాస్టర్‌లకు ఎలాంటి సమస్య వచ్చి నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పార్టీలతో పనిలేకుండా పారదర్శకంగా పాలన సాగిస్తామన్నారు. కనిగిరి అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. దళితవాడల అభివృద్ధితోపాటు వారి ఆర్థిక పురోగతికి బాటలు వేస్తామన్నారు. స్థానికంగా ఉపాధి లభించేలా వారికి అండగా నిలబడతాన న్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆదరించి అత్యంత మెజార్టీతో గెలిపించాల ని అభ్యర్థించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పాస్టర్‌లు, దళితులు పాల్గొన్నారు.

పది కుటుంబాలు టీడీపీలో చేరిక

పామూరు మండలం వగ్గంపల్లి, తూర్పుకట్టకిందపల్లి గ్రామాలకు చెం దిన పది కుటుంబాలు వైసీపీని వీడి డాక్టర్ ఉగ్ర సమక్షంలో శనివారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో టీడీపీలో చేరారు. వారికి డాక్టర్ ఉగ్ర టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ఇంకా ఎన్నికల సమయం 24గంటలు మాత్రమే ఉంద ని, ప్రతి ఒక్కరూ టీడిపి గెలుపే లక్ష్యంగా సైనికుల్లా పనిచేయాలని కోరా రు. ప్రత్యర్థుల ఎత్తులను చిత్తు చేయాలని పిలుపునిచ్చారు. ఓటింగ్ ప్ర క్రియపై ప్రతి టీడీపీ సైనికుడు దృష్టి సారించి సానుభూతిపరుల ఓట్లను మళ్లించాలన్నారు. అవ్వ, తాతలను పోలింగ్ బూత్‌ల వద్దకు తీసుకువచ్చి ఓటు వేయించేలా ప్రోత్సహించి వారికి అండగా నిలబడాలన్నారు. ఎ లాంటి చిన్న అవకాశాన్ని కూడా ప్రత్యర్థి పార్టీలకు ఇవ్వకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాస్టర్‌ల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర

మాక్ పోలింగ్ తప్పనిసరి


- పోలింగ్ ప్రారంభానికి ముందే అన్ని కేంద్రాల్లో ఏజెంట్ల సమక్షంలో ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించి ఈవీఎంలు సక్రమంగా పనిచేస్తున్నట్లు నమ్మకం కలిగించాలి.
- పోటీలో ఉన్న అభ్యర్థులందరికీ సమానంగా కనీసం 50 ఓట్లకు తగ్గకుండా మాక్ పోలింగ్ నిర్వహించాలి.
- ఆ సమయంలో కనీసం ఇద్దరు ఏజెంట్లు ఉండాలి.
- ఏజెంట్లు ఎవరూ రాకపోతే 15 నిమిషాలు ఎదురుచూడాలి.
- అప్పటికి వారు రాకపోతే ఎన్నికల సిబ్బంది
- మాక్ పోలింగ్ నిర్వహించవచ్చు.
- మాక్‌పోలింగ్ పోలైన ఓట్ల కోసం సంబంధించిన వివరాలను భద్రపర్చాలి.
- మాక్ పోలింగ్ పూర్తయిన తర్వాత క్లియర్ బటన్లు నొక్కి ఓట్లు జీరో చూపించి పోలింగ్ ప్రారంభించాలి.
- పోలింగ్ ఉదయం 7 సాయంత్రం ఆరు గంటల వరకు జరుగుతుంది.

ఎన్నికల విధులు.. కత్తి మీద సాము

పలు పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లతో చిక్కులు

అభ్యర్థులు భారీగా ఉన్న ప్రాంతాల్లో వారందరికీ వసతుల కల్పనకు ప్రయాస

మాక్‌పోలింగ్ తప్పనిసరి



ఒంగోలు(విద్య), మే 11 : జిల్లాలో సోమవారం జరగనున్న సాధారణ ఎన్నికల విధులకు నియమితులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎన్నికల నిర్వహణ కత్తిమీద సాములా మారనుంది. ఈ ఎన్నికలను అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పోరాడుతున్నాయి. కోట్లాది రూపాయలను మంచినీళ్లలా ఖర్చు చేస్తున్నారు. ఓటు రేటు వేలల్లో పలుకుతోంది. పోటీలో ఉన్న స్వతంత్రులు కొందరు ప్రచారంలో జాడ లేకపోయినా వారికి కూడా ప్రధాన పార్టీల అభ్యర్థులకు ఇచ్చే అన్ని సౌకర్యాలు వీరికి కూడా వర్తిస్తాయి. గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రధాన పార్టీలు ప్రతి ఓటును సీరియస్‌గా తీసుకున్నాయి. ఈ నేపథ్యంలో పోలింగ్ కేంద్రంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అత్యంత జాగరూకతగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎన్నికల ప్రక్రియలో ఏ చిన్నపొరపాటు జరిగినా దానికి ఉద్యోగులే బలవుతారు. ఈ నేపథ్యంలో పోలింగ్ కేంద్రంలోని పీవో, ఏపీవో, నలుగురు ఓపీవోలు ఎన్నికల కమిషన్ నిబంధనలను కూడా పాటించాల్సి ఉంది.

ఏజెంట్ల కుర్చీలకూ ఇబ్బందులే

ఈసారి పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల అధికారులకు, అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్లతో కూడా చిక్కులు తలెత్తనున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో 20కి పైగా అభ్యర్థులు పోటీలో ఉండటంతో పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థుల ఏజెంట్లందరికీ చోటుకల్పించడం ఎన్నికల అధికారులకు పెద్ద సమస్య కానుంది. ఒంగోలు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో 50 మందికి పైగా పోటీలో ఉన్నారు. వారి తరఫు ఏజెంట్లకు కేంద్రాల్లో కూర్చునేందుకు వసతి కల్పించడం ఇబ్బందికరమే. ఒంగోలు, గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాలలో అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున వారందరికీ సీట్లు కల్పించడంలో సమస్యలు తప్పవు.



'ఒంగోలు'లో నూరుశాతం వెబ్‌కాస్టింగ్

పోలింగ్ కేంద్రాల నుంచి కలెక్టరేట్, ఈసీకి అనుసంధానం

ఒంగోలు నియోజకవర్గంపై ఫిర్యాదుల నేపథ్యంలో అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి

పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లతోపాటు భారీ బందోబస్తు

ఒంగోలు(కలెక్టరేట్), మే 11 : ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో సోమవారం జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు నూరుశాతం వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 259 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను పరిశీలించే విధంగా ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా ఎన్నికల కమిషన్ గుర్తించింది. ఆ మేరకు ఒంగోలులో అన్ని కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను పరిశీలించే విధంగా ఏర్పాట్లు చేశారు. ఈ వెబ్ కాస్టింగ్ కలెక్టరేట్‌లోని ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోలు రూముతో పాటు ఎన్నికల కమిషన్ కార్యాలయానికి అనుసంధానం చేస్తూ చర్యలు తీసుకున్నారు. మరోవైపు వెబ్‌కాస్టింగ్‌తో పాటు పూర్తి సమస్యాత్మకంగా గుర్తించిన 51 పోలింగ్ కేంద్రాల్లో భారీ పోలీసు బలగాలను ఏర్పాటు చేసే విధంగా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో లైటింగ్‌తో పాటు దివ్యాంగుల కోసం మూడు చక్రాల సైకిళ్లు, బారికేడ్లతో పాటు నిరంతరం ఆయా పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు. ఎన్నికల సిబ్బందికి ఆయా పోలింగ్ కేంద్రాల్లో అల్పాహారం, భోజనంతోపాటు వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జన కేతనం



ప్రకాశం జిల్లా వార్తలు

ఆదివారం 12 మే 2024

నేరచరితులకూ పోలింగ్ ఏజెంట్లుగా అవకాశం

ఒంగోలు(విద్య), మే 11 : జిల్లాలో సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులకు పోలింగ్ ఏజెంట్లుగా వ్యవహరించేందుకు నేరచరితులకు కూడా అవకాశం కల్పిస్తూ ఎన్నికల కమిషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఎన్నికల కమిషన్ తాజా ఉత్తర్వులతో నేరచరితులు, రౌడీషీటర్లు కూడా పోలింగ్ ఏజెంట్లుగా పనిచేయవచ్చు. గత సార్వత్రిక ఎన్నికల వరకు సత్ప్రవర్తన కలిగిన వారే పోలింగ్ ఏజెంట్లుగా పనిచేయాలి. దీనికోసం పోలింగ్‌కు మూడు రోజుల ముందే తమ తరఫున పోలింగ్ కేంద్రాల్లో ఎవరిని ఏజెంట్లుగా నియమించాలో వారి వివరాలను అభ్యర్థులు ఆర్వోలకు సమర్పించాలి. రిటర్నింగ్ అధికారి వీరి వివరాలను పోలీస్ అధికారులకు పంపి వారి నేరచరిత్రను పరిశీలింపజేసేవారు. నేరచరిత్ర లేని, క్లీన్ అభ్యర్థులను ఏజెంట్లుగా ఉండేందుకు అనుమతించేవారు. నేరచరితులు, రౌడీషీటర్లను ఏజెంట్లుగా అనుమతించేవారు కాదు. ప్రస్తుతం ఆ విధానానికి చెల్లుచీటి ఇచ్చారు. ఎటువంటి పోలీస్ పరిశీలన లేకుండా అభ్యర్థులు తమ కిష్టమైన వారిని ఏజెంట్లుగా నియమించుకొనేందుకు వీలు కల్పించారు. దీంతో అభ్యర్థులు ఇచ్చిన ధ్రువీకరణపత్రాలను పీవోలకు సమర్పించి ఎవరైనా ఏజెంటుగా గుర్తింపు పత్రం పొంది పోలింగ్ కేంద్రంలో ఏజెంటుగా పనిచేయవచ్చు.

వలస ఓటర్లు వస్తున్నారు..!

అనేక మంది ముందుగానే స్వస్థలాలకు చేరిక

పోలింగ్ రోజుకు అందరూ రాక

3లక్షల మందికిపైనే ఉంటారని అంచనా

ప్రయాణ చార్జీలు చెల్లిస్తున్న అభ్యర్థులు

బస్సులు, రైళ్లలో రిజర్వేషన్‌లు ఫుల్

ఒంగోలు, మే 11 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికలకు వలస ఓటర్లు భారీగా తరలివస్తున్నారు. వివిధ ఉద్యోగాలు, వ్యాపారాలు, వృత్తులు, ఇతర జీవనం కోసం జిల్లాకు చెందిన వారు పెద్దసంఖ్యలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పూణే, ముంబై, విశాఖ, రాజమండ్రి, కరీంనగర్, నిజామాబాద్, ఇతరత్రా పొరుగు రాష్ట్రాల్లోని పలుప్రాంతాల్లో ఉంటున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల నుంచి బేల్దారి పనులు చేసే వారి దాకా దాదాపు మూడు లక్షల మంది జిల్లాకు సంబంధించిన వలస ఓటర్లు ఉన్నట్లు సమాచారం. సాధారణంగా సంక్రాంతి పండుగకు వారిలో అత్యధికులు స్వగ్రామాలకు వస్తుంటారు. అలాగే ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు కూడా భారీగానే చేరుకుంటారు. కొన్ని నియోజకవర్గాల్లో ప్రత్యేకించి స్థానిక ఎన్నికల్లో వలస ఓటర్ల ఓట్లే నిర్ణయాత్మకంగా ఉంటాయి. దీంతో ఏఎన్నికలు వచ్చినా వీరు పోలింగ్‌కు వచ్చేలా స్థానికంగా ఉండే ప్రధాన పార్టీల నాయకులు ఏర్పాట్లు చేసి తమకు అనుకూలంగా ఓట్లు పడేలా చర్యలు తీసుకుంటారు.

ప్రయాణ చార్జీ కింద ఒక్కొక్కరికి రూ.2వేలు

వలస ఓటర్లలో ఉద్యోగ, వ్యాపారాల్లో ఆర్థికంగా స్థిరపడిన వారు కొందరు స్వయంగా వాహనాలను ఏర్పాటు చేసుకొని స్వస్థలాలకు చేరుకుంటున్నారు. ఇతరులకు మాత్రం పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రయాణ సౌకర్యం కల్పించాల్సి వస్తోంది. దీనివల్ల ఆర్థిక భారం పెరుగుతోంది. హైదరాబాద్ నుంచి ఒంగోలుకు ప్రైవేటు బస్సుకు రానూ,పోనూ రూ.1.20లక్షలు అద్దె చెల్లించాల్సి ఉండగా 40నుంచి 50 మందికి మించి వచ్చే అవకాశం లేదు. అది భారంగా మారడంతో ఒక్కొక్కరికి చార్జీ కింద రూ.2వేల వరకు అభ్యర్థులు చెల్లించి స్వయంగా రావాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. అలా చేసినా ఒక్కో నియోజకవర్గంలో వలస ఓటర్ల ప్రయాణ చార్జీలకు రూ.2 కోట్ల నుంచి రూ.5కోట్ల వరకూ వెచ్చించాల్సి వస్తోంది.

ప్రైవేటు వాహనాల్లో వస్తున్న పలువురు

ఉద్యోగాలలో ఉండే వారు ప్రత్యేకించి సాఫ్ట్‌వేర్ రంగంలోని వారికి ఈనెల 11,12 తేదీలు (శని, ఆదివారాలు) సెలవులు రావడంతో 13వతేదీ జరిగే పోలింగ్‌కు రెండు రోజుల ముందే స్వస్థలాలకు చేరుకున్నారు. మిగిలిన వారు పోలింగ్ రోజైన సోమవారానికి ఇక్కడికి చేరుకోనున్నారు. దీంతో ఈనెల 10నుంచి 13వతేదీ వరకూ జిల్లాకు చెందిన వలస ఓటర్లు అధికంగా ఉండే ప్రాంతాలైన హైదరాబాద్, బెంగళూరు, విశాఖ తదితర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లు, ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల్లో రిజర్వేషన్లు అన్నీ ఫుల్ అయ్యాయి.

అభ్యర్థుల ప్రత్యేక దృష్టి

సార్వత్రిక ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న నేపథ్యంలో వలస ఓటర్లపై అభ్యర్థులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా ప్రాంతాల్లో ఉండే వలస ఓటర్లు కూడా ఇక్కడి ఎన్నికలపై ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలకు చెంది పొరుగు ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్న యువత మరింత ఎక్కువ ఉత్సాహం చూపుతోంది. అత్యధికులు రాష్ట్ర భవిష్యత్ కోసం చంద్రబాబు తిరిగి అధికారంలోకి రావాలన్న ఆకాంక్షను వెలిబుచ్చుతున్నారు. టీడీపీ అభ్యర్థులకు మద్ద తు ఇస్తున్నారు. గత నెలలో హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాల్లో నియోజకవర్గాల వారీ సమావేశాలు నిర్వహించి సంఘీభావం తెలిపారు.

దొనకొండ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ



ఊరెళ్దాం.. ఓటేద్దాం..

టీడీపీ గెలుపే లక్ష్యంగా 'మాగుంట, దామచర్ల' ప్రచారం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మాగుంట కుటుంబ సభ్యులు

ఒంగోలు(కలెక్టరేట్), మే 11 : ఒంగోలు ఎంపీ, ఎమ్మెల్యే టీడీపీ కూటమి అభ్యర్థులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, దామచర్ల జనార్దన్‌కు మద్దతుగా మాగుంట, దామచర్ల కుటుంబ సభ్యులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నగరంలోని 34వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. మాగుంట మరదలు శశికళ, సురేఖరెడ్డి, చెల్లెలు సంధ్య, హితారెడ్డి, మేనకోడళ్లు ప్రణతి, కీర్తి, మనమరాలు జాహ్నవి, దామచర్ల జనార్దన్ అక్క మాధవి, కుమార్తె అనిషాలక్ష్మి, మరదలు డాక్టర్ హిమబిందు, కోడలు హారికలు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. సోమవారం జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి మాగుంట, దామచర్లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరి బ్రహ్మయ్యతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఉన్నారు.

ఎన్నికల విధులకు 14,768 మంది

ఒంగోలు(కలెక్టరేట్), మే 11 : జిల్లాలో సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కోసం 14,768 మంది ఉద్యోగులను నియమించారు. పీవోలు 2,481 మంది, ఏపీవోలు 2,481 మంది, ఓపీవోలు 9,806 మందిని నియమించారు. జిల్లాలో 2,183 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఒక పీవో, ఏపీవోతో పాటు నలుగురు సిబ్బందిని నియమించారు. నియోజకవర్గాల వారీగా నియమించిన ఉద్యోగుల వివరాలు ఇలా ఉన్నాయి.

జిల్లాలో 18,22,470 మంది ఓటర్లు

పురుషుల కంటే మహిళల ఓట్లే అధికం



ఒంగోలు(కలెక్టరేట్), మే 11 : జిల్లాలో ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఒంగోలు లోక్‌సభ, జిల్లా పరిధిలోని ఎనిమిది నియోజకవర్గాల్లో 18,22,470 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. జిల్లాలో పురుషులు 9,07,980 మంది ఉండగా, స్త్రీలు 9,14,379 మంది ఉండగా థర్డ్ జండర్ 111 మంది ఉన్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళలు 6,399 మంది అధికంగా ఉన్నారు. అందుకోసం జిల్లాలో 2183 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరగనుండటంతో అందుకు అనుగుణంగా జిల్లా ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో నియోజకవర్గాల వారీ ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

అసెంబ్లీ	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	థర్డ్ జండర్	మొత్తం
వైపాలెం	265	1,05,230	1,01,982	02	2,07,214
దర్శి	282	1,14,233	1,12,129	08	2,26,370
ఎస్ఎన్‌పాడు	256	1,05,497	1,09,137	04	2,14,638
ఒంగోలు	259	1,15,495	1,24,694	53	2,40,242
కొండపి	283	1,18,624	1,20,982	03	2,39,609
మార్కాపురం	257	1,08,043	1,06,557	08	2,14,608
గిద్దలూరు	284	1,19,502	1,20,188	20	2,39,710
కనిగిరి	297	1,21,359	1,18,710	13	2,40,079
మొత్తం	2183	9,07,980	9,14,379	111	18,22,470

12 రకాల గుర్తింపు కార్డులతో ఓటు వినియోగించుకోవచ్చు

ఒంగోలు(కలెక్టరేట్), మే 11 : జిల్లాలో ఓటు హక్కు కలిగి ఉండి ఎపిక్ కార్డులేని ఓటర్లు ప్రత్యామ్నాయంగా కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదానితో ఓటు హక్కును వినియోగించుకోవచ్చుకొనే విధంగా చర్యలు తీసుకుంది. ఆధార్ కార్డు, ఉపాధి పథకం గుర్తింపు కార్డు, బ్యాంకు/పోస్టాఫీసులు జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్‌లు, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డ్, ఎంపీఆర్‌కింద ఆర్‌జీఐ జారీచేసిన స్మార్ట్ కార్డు, భారతీయ పాస్‌పోర్టు, ఫొటోతోకూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వం/పీఎస్‌యూలు/పబ్లిక్ లిమిటెడ్ కంపెనీల ద్వారా ఉద్యోగులకు జారీ చేసిన ఫొటోతో కూడిన సేవా గుర్తింపు కార్డులు, ఎంపీలు/ఎమ్మెల్యేలు/ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు, ప్రత్యేక వైకల్యం గుర్తింపు కార్డుల్లో ఏదో ఒక కార్డును పోలింగ్ కేంద్రాల్లో చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. ఎన్నికల కమిషన్ కల్పించిన ఈ అవకాశాన్ని ఓటర్లందరూ వినియోగించుకోవచ్చు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో మన ఆస్తులకు పంగనామం

భావి తరాల భవిష్యత్ చంద్రబాబుతోనే సాధ్యం

రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్

ముండ్లమూరు, మే 11 : వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో ప్రజల ఆస్తులకు పంగనామాలు పెడతారని సినీ నటుడు శివాజీ చెప్పారు. ఆయన శనివారం మండలంలోని పెదఉల్లగల్లు, లక్ష్మీనగర్ గ్రామాల్లో దర్శి టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాల భవిష్యత్ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుతోనే సాధ్యమని చెప్పారు. మాట మాట్లాడితే నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలు అని చెప్పుకుంటూ వారిపైనే దాడులు, హత్యలు రాష్ట్రంలో కోకొల్లలుగా జరిగాయన్నారు. ప్రజా కోర్టులో జగన్‌కు శిక్ష తప్పదన్నారు. రెండు నెలలు ఆగితే పరిపాలన అధ్యక్షుడు ముఖ్యమంత్రి అవ్వటం ఖాయమని చెప్పారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తమైందన్నారు. అవినీతి, అరాచకం రాజ్యమేలిందని, ఎవరైనా ప్రశ్నిస్తే దాడులు చేయటం, అక్రమకేసులు బనాయించటంలో నేతలు ఆరితేరిపోయారని చెప్పారు. 22ఏ భూముల్లో కూడా రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో నాసిరకం మద్యం సరఫరా చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడుతున్నారని చెప్పారు. లక్ష్మీ తాతహనుమంతరావు, ఆమె తండ్రి నరసయ్య ఎంతో అభివృద్ధి చేసి నీతి నిజాయితీతో రాజకీయం చేశారన్నారు. అనంతరం లక్ష్మి మాట్లాడుతూ మీ ఇంటి ఆడ బిడ్డగా ఆదరించండి, అభిమానించండి, సేవ చేసే భాగ్యం కల్పించండి అని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొక్కెర నాగరాజు, మాజీ సర్పంచ్ జిల్లెలమూడి చౌదరి, కొండవీటి సుబ్బారావు, కర్నాటి సాయికుమార్‌రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు కొండవీటి బాలయ్య కామని పూర్ణచంద్రరరావు, కాలేషా, వలి, వాతల వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శివాజీ, పక్కన అభ్యర్థి లక్ష్మి, పాపారావు





బియ్యం దుకాణాన్ని సీజ్ చేస్తున్న అధికారి

ఎట్టకేలకు బియ్యం దుకాణం సీజ్

తాతా షాపులో రెండో రోజు అధికారుల తనిఖీలు

ఒంగోలు (క్రైం), మే 11 : ఒంగోలులోని తాతా కోటేశ్వర్లు బియ్యం దుకాణాన్ని ఎట్టకేలకు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు శనివారం సీజ్ చేశారు. స్థానిక బండ్లమిట్ట ప్రాంతంలో ఉన్న ఈ షాపులో రూ.50 నోటుకు బియ్యం బస్తా ఇచ్చే ప్రలోభపర్వానికి వైసీపీ నేతలు తెరతీశారు. సమాచారం అందుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు శుక్రవారం ఏడుగురుని అదుపులోకి తీసుకొని విచారించి దుకాణాన్ని సీజ్ చేశారు. అనంతరం వైసీపీ నాయకులు అక్కడికి చేరుకొని ఆందోళనకు దిగారు. దీంతో ట్రైనీ ఐఏఎస్ శౌర్యమన్‌పటేల్ దుకాణం వద్దకు వచ్చి సీల్‌ను తొలగించారు. కేవలం ఒకే సీరియల్ నంబర్‌తో ఉన్న రూ.50 నోట్లు 272 సీజ్ చేసి షాపును తెరిచే వెళ్లిపోయారు. దీనిపై 'పట్టుకున్నారు.. వదిలేశారు!' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శనివారం కథనం ప్రచురితమవడంతో ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాలతో ఎన్నికల అధికారులు శనివారం భారీ బందోబస్తుతో ఆ ప్రాంతానికి చేరుకొన్నారు. మరోసారి బియ్యం దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. అనంతరం 3,332 బియ్యం బస్తాలను సీజ్ చేశారు.



ఒంగోలులో మందుకోసం క్యూ

మద్యం బంద్

ఈనెల13 వరకు విక్రయాలు నిలిపివేత

బార్‌లు, మద్యం దుకాణాలకు సీజ్

ఒంగోలు(క్రైం), మే 11 : రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా మద్యం దుకాణలు, బార్‌లను ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 13 సాయంత్రం 6 గంటల వరకు మద్యం విక్రయాలు నిలిపివేయించినట్లు ఈఎస్ టి.శౌరి తెలిపారు. జిల్లాలో మొత్తం 25 బార్‌లు, 178 మద్యం దుకాణాలను సీజ్ చేశామన్నారు. ఎన్నికలు అయ్యే వరకు మద్యం విక్రయాలు చేయకూడదనే ఎన్నికల కమిషన్ నిబంధన విధించడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. శనివారం సాయంత్రం నుంచి మద్యం దుకాణాలను మూసివేస్తారనే సమాచారం తెలుసుకున్న మద్యం ప్రియులు ఉదయం నుంచే ఎండను సైతం లెక్కచేయకుండా దుకాణాల వద్ద క్యూ కట్టారు. బార్‌లు సైతం కిటకిటలాడాయి.

అభివృద్ధి పనులకు నిధుల కోత

- టీడీపీలో పెండింగ్ పనులకు నిధులు విదిల్చని వైసీపీ
- ప్రజా కంటక పాలనకు ఓటుతో బుద్దిచెప్పేందుకు సిద్ధపడ్డ ప్రజలు



అర్ధాంతరంగా ఆగిన ఓవర్ హెడ్ ట్యాంక్

గిద్దలూరు, గిద్దలూరు టౌన్, మే 11 : ఓ వైపు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలతో హడావుడి చేస్తూ మరోవైపు నిధులు ఇవ్వకుండా ఎండగట్టడంలో వైసీపీకి పోటీ లేదనే చెప్పవచ్చు. ఈ ఐదేళ్ల పాలనలో అనేక అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయకుండా ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది.

గిద్దలూరు పట్టణంలోని పేద కుటుంబాలకు సొంత ఇంటి కలనెరవేర్చేందుకు వీలుగా పట్టణ సమీపంలో 1408 టిడ్కో గృహాలను అప్పటి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి టీడీపీ ప్రభుత్వంలో మంజూరు చేయించారు. ఆ పనులు 80 నుంచి 90 శాతం పూర్తయ్యాయి. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ఐదేళ్లలో మిగిలిన నిర్మాణ పనులను పూర్తి చేయలేదు. దీంతో 1408 కుటుంబాలు నేటికీ అద్దె ఇళ్లలోనే మగ్గుతున్నారు. ఇక గిద్దలూరు పట్టణానికి శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు వీలుగా రామన్నకతువ నుంచి గిద్దలూరుకు నీరు మళ్లించేందుకు వీలుగా అశోక్‌రెడ్డి సుమారు రూ.90 కోట్ల నిధులను మంజూరు చేయించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ నిధులను కూడా రద్దు చేయాలని చూసింది. అయితే ప్రజాగ్రహానికి భయపడి నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నది. అయితే ఈ ఐదేళ్లలో 10శాతం పనులు కూడా పూర్తికాని పరిస్థితి నెలకొంది. పైపులైన్ నిర్మాణం, ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం అర్ధాంతరంగ ఆగిపోయాయి. టీడీపీ హయాంలో కేవలం రూ.6 కోట్ల వ్యయంతో గుండ్లమోటు నుంచి గిద్దలూరుకు తెచ్చిన తాగునీటి ప్రాజెక్టే అంతో ఇంతో ప్రజల గొంతు తడుపుతోంది. సగిలేరు వరద ముంపు నుంచి పట్టణ ప్రజలను కాపాడేందుకు వీలుగా రూ.14.5 కోట్లతో సగిలేరుపై చెక్‌డ్యాంల నిర్మాణం, రక్షణ గోడ నిర్మాణం, పూడికతీత పనులకు సంబంధించి ముత్తుముల అశోక్‌రెడ్డి నిధులు మంజూరు చేపించి, శంకుస్థాపన చేశారు. టెండరు కూడా పిలిచారు. అయితే వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని కూడా రద్దు చేయడంతో పెద్దపాటి వర్షం కురిస్తే సగిలేరు నీరు ఎప్పుడు ఇళ్లలోకి వస్తుందోనని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు వీలుగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి అశోక్‌రెడ్డి రూ.320 కోట్ల నిధులను మంజూరు చేయించగా వైసీపీ ప్రభుత్వం రాగానే ఈ పథకాన్ని కూడా రద్దు చేయించింది. దీంతో నేడు చాలా గ్రామాల్లో తాగునీటి సమస్య విలయ తాండవం చేస్తూనే ఉంది. పట్టణంలో రూ.18 కోట్లతో సిమెంటు రోడ్లు, మురికినీటి కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించగా వైసీపీ నాయకులు ఏకంగా కోర్టుకు వెళ్లి పనులను నిలిపివేసిన విషయం విదితమే. మరో రూ.25 కోట్ల రూపాయల రోడ్ల నిధులను కూడా కోర్టుకు వెళ్లి నిలిపివేయించారు. అర్ధవీడు, కొమరోలులలో రూ.3 కోట్లతో క్రీడాభివృద్ది కోసం మిని స్టేడియంల నిర్మాణం మొదలు పెట్టగా మధ్యలో వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఆపేసింది. దీంతో అవి మొండి గోడలతో దర్శనమిస్తున్నాయి. అన్ని మండల కేంద్రాలలో అంబేద్కర్ భవన నిర్మాణానికి రూ.3 కోట్లు, బీసీ భవనాల నిర్మాణానికి రూ.2.5 కోట్లు, గిద్దలూరులో రూ.50 లక్షలతో కాపు భవనం మంజూరు చేయించగా ఈ నిధులపై కూడా వైసీపీ వేటు వేసింది. కొమరోలు, కంభంలలో షాదీఖానాల అభివృద్ధికి రూ.1.5 కోట్లు అశోక్‌రెడ్డి మంజూరు చేయించి శంకుస్థాపన చేయగా ఈ నిధులను కూడా రద్దు చేసి ముస్లిం మైనారిటీలకు నోట్లో మట్టి కొట్టింది. మాగుటూరు తాండా నుంచి కాటమరాజు దేవస్థానం వరకు తారురోడ్డు నిర్మించేందుకు కోటి రూపాయలు మంజూరు చేయించగా రోడ్డు వేయకుండా అడ్డుకొంది. గిద్దలూరులో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను మూసి వేయించింది. దిగువ మెట్ట, రంగనాయకస్వామి దేవాలయం వద్ద ఎకో టూరిజం ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయించగా ఐదేళ్లలో ఈ పనులు నత్తనడకన నడుస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వ పథకాలపై వైసీపీ ప్రభుత్వం కక్ష కట్టి నిధుల కోత వేసింది. దీంతో ప్రజాసమస్యల పరిష్కారానికి అప్పటి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చొరవ తీసుకున్నప్పటికీ, వైసీపీ అడ్డుకోవడంతో ఈ ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ఐదేళ్ల పాటు సాగిన ప్రజా కంటక పాలనకు ఓటుతో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధమయ్యారు.



ఐదేళ్లుగా నిలిచిన టిడ్కో గృహ సముదాయం

పోలీసు వాహనాన్ని ఢీకొన్న బైక్

- వ్యక్తికి గాయాలు, ఆస్పత్రికి తరలించిన ఎస్సై

మార్కాపురం, మే 11: పోలీసు వాహనం ఢీకొట్టడంతో మోటార్ సైకిలిస్టుకు గాయాలైన ఘటన శనివారం మధ్యాహ్నం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు పట్టణానికి చెందిన పెరుమాళ్ల కాశీరావు పీఎస్ కాలనీవైపు నుంచి పట్టణంలోకి వెళ్తున్నాడు. ఈ క్రమంలో స్థానిక పెద్ద వాటర్‌ట్యాంక్ సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మార్కాపురం రూరల్ ఎస్సై వాహనం మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో ఆయన తలకు గాయాలయ్యాయి. హుటాహుటిన అదే పోలీసు వాహనంలో క్షతగాత్రున్ని జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్సలు నిర్వహించిన అనంతరం వైద్యుల సూచన మేరకు ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



ప్రమాదంలో గాయాలపాలైన కాశీరావు

వృద్ధురాలికి నగదు బ్యాగ్ అందజేత

- ఆర్టీసీ బస్సులో మరిచిపోవడంతో భద్రపరిచి అందజేసిన కంట్రోలర్

పొదిలి, మే 11 : ఆర్టీసీ బస్సులో వృద్ధురాలు పోగొట్టుకున్న బ్యాగు, నగదును పొదిలి ఆర్టీసీ కంట్రోలర్ బి శ్రీనివాసులు సహకారంతో బాధితురాలికి చేర్చారు. వివరాల్లోకి వెళితే కొనకనమిట్ల మండలం వాగుమడుగు గ్రామానికి చెందిన వృద్ధురాలు కనిగిరి వెళ్లింది. తిరిగి స్వగ్రామం వెళ్లేందుకు పొదిలి వచ్చే బస్సు ఎక్కింది. బస్సు బయలుదేరక ముందే మంచినీటి కోసం దిగింది. గమనించని డ్రైవర్ బస్సును కదిలించాడు. వృద్ధురాలు వచ్చి పాయింట్‌లో బస్సు లేకపోవడంతో కనిగిరి ఆర్టీసీ కంట్రోల్ పాయింట్‌లో తెలియజేసింది. స్పందించిన అక్కడి సిబ్బంది పొదిలికి సమాచారం ఇచ్చారు. అయితే బస్సు వచ్చే సమయంలో పొదిలిలో ట్రాఫిక్ జాం అయ్యింది. వైసీపీ ఎన్నికల ప్రచారం ర్యాలీ ఉండడంతో అక్కడి ట్రాఫిక్‌లో బస్సు చిక్కుకుంది. అయితే సంచిలో విలువైన వస్తువులు నగదు ఉండడంతో కంట్రోలర్ బి.శ్రీనివాసులు నేరుగా బస్సు వద్దకు బైక్‌పై వెళ్లాడు. బస్సులోని సంచి గుర్తించి భద్రపరిచాడు. ఈ క్రమంలోనే వృద్ధురాలు మరో బస్సులో పొదిలి చేరుకొంది. దీంతో ఆమె బ్యాంగ్‌ను ఆమెకు అందజేశారు. బ్యాగును చూసిన వృద్ధురాలు అన్ని ఉన్నాయని సంతోషంతో కంట్రోలర్ శ్రీనివాసులును అభినందించింది.



నగదు, బ్యాగును వృద్ధురాలికి అందజేస్తున్న కంట్రోలర్

బైకును ఢీకొన్న ట్రాలీ ఆటో

ఇద్దరు యువకుల మృతి

మార్కాపురం రూరల్, మే 11: బైకును ట్రాలీ ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతిచెందారు. ఈ ఘటన మండలంలోని మార్కాపురం-కుంట రోడ్డు మధ్యలో వేములకోట వద్ద శనివారం రాత్రి చోటు చేసుకొంది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న ఇద్దరు యువకులు ఎం.బ్రహ్మనాయుడు(19), నల్లబోతుల గోపి(14) ఘటన స్థలంలోనే మృతిచెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.., మార్కాపురం పట్టణం నుంచి స్వగ్రామం నికరంపల్లి గ్రామానికి బైకుపై బ్రహ్మనాయుడు, గోపీలు వెళుతున్నారు. అదే సమయంలో మార్కాపురం వైపుకు వస్తున్న ట్రాలీ ఆటో వేములకోట గ్రామ జగనన్న కాలనీ వద్ద ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో బైకుపై ఉన్న యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. బ్రహ్మనాయుడు పట్టణంలోని కిరాణాదుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. గోపి 9వ తరగతి చదువుతున్నాడు. మృతదేహాలను పోస్టుమర్టం నిమిత్తం స్థానిక జిల్లా వైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ వెంకటేశ్వరనాయక్ తెలిపారు.



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

నాటుసారా, మద్యం సీసాలు స్వాధీనం

మార్కాపురం రూరల్, మే 11: మండలంలో, పట్టణంలో మార్కాపురం సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో దాడులు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న మద్యంసీసాలు, నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు శనివారం తెలిపారు. మండలంలోని చింతకుంట్ల గ్రామానికి చెందిన సురవరపు కృష్ణారెడ్డి వద్ద నుంచి పట్టణంలో 15 క్వాటర్ మద్యం సీసాలను, పెద్దారవీడు మండలం గొబ్బూరు గ్రామానికి చెందిన నల్లపాటి చిన్న గురుమూర్తి, పెద్దారవీడు చెంచుకాలనీకి చెందిన కుడుముల పెద్దయ్యల వద్ద నుంచి 40 లీటర్ల నాటు సారాను, 1600 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలోని ఇడుపూరు గ్రామ సమీపంలో గుండ్లకమ్మ నది వద్ద ఎస్ఈబీ అధికారులు 40 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. పెద్దారవీడు మండలం గొబ్బూరు గ్రామానికి చెందిన నల్లపాటి గురుమూర్తి, కుడుముల పెద్దయ్య అనే ఇద్దరు వ్యక్తులు నాటు సారా తయారు చేస్తుండగా వారిని పట్టుకొని వారి వద్ద ఉన్న 40 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలోని ఇడుపూరు గ్రామ సమీపంలో తర్లుపాడు మండలం ఓబాయిపల్లి గ్రామానికి చెందిన చింతలపూడి ప్రభాకర్ వద్ద నుంచి 22 క్వార్టర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలోని మన్నెంవారిపల్లి గ్రామానికి చెందిన వల్లపునేని వెంకటనరాయణ వద్ద నుంచి పట్టణంలో 14 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాలలో, పట్టణంలో అక్రమంగా ఎవరైనా మద్యం నిలువలు ఉంచినట్లయితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మీ ప్రాంతాలలో మాదక ద్రవ్యాలు, నిషేధిత మత్తు పదార్థాలు, అక్రమంగా మద్యం నిల్వలు ఉంచినట్లయితే సమాచారాన్ని సెబ్ అధికారులకు తెలియజేయాలని కోరారు.

టీడీపీ ఆధ్వర్యంలో ఉత్సాహంగా బైక్‌ర్యాలీ

పొదిలి, మే 11 : టీడీపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డిల గెలుపును ఆకాంక్షిస్తూ పొదిలి పట్టణంలో కందుల తనయుడు కందుల విఘ్నేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురం అడ్డరోడ్డు నుండి చినబస్టాండ్ వరకు బైక్‌ర్యాలి నిర్వహించారు. ఈ ర్యాలీలో పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల నుండి పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. టీడీపీ అధికారంలోకి రావడం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయం అంటూ నినాదాలు చేశారు. అనంతరం విఘ్నేష్‌రెడ్డి మాట్లాడుతూ మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపు కోసం ఇదే ఉత్సాహంతో పని చేయాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి హింసలు జరగకుండా సామరస్యంగా ఓటింగ్ జరిగేందుకు అధికారులకు సహకరించాలని కోరారు. ర్యాలీలో పట్టణ, గ్రామాల టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కాపురం : తర్లుపాడు మండలంలో వైసీపీకి భారీషాక్ తగిలింది. మండలంలోని కారుమానుపల్లి గ్రామానికి చెందిన 40 వైసీపీ కుటుంబాలు శనివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వారికి టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు రాఘవరెడ్డిలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త వెన్నా పోలిరెడ్డి, కొండా రామసుబ్బారెడ్డి, దొండపాటి అల్లూరిరెడ్డిల ఆధ్వర్యంలో వారంతా పార్టీలోకి వచ్చారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ పాత, కొత్త అనే తేడాలు లేకుండా అందరూ కలిసి టీడీపీ గెలుపునకు తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు గొలమారి శ్రీనివాసరెడ్డి, దొండపాటి వెంగళరెడ్డి, బత్తుల నాగిరెడ్డిలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విఘ్నేష్‌రెడ్డి

టీడీపీతో మహిళాభివృద్ధి సాధ్యం

మార్కాపురం : టీడీపీతోనే మహిళాభివృద్ధి సాధ్యమని కూటమి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంతలక్ష్మి అన్నారు. స్థానిక 9, 10 వార్డుల్లో తెలుగు మహిళలు ప్రచారం చివరి రోజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతలక్ష్మి ఇంటింటికి తిరిగి కందుల నారాయణరెడ్డికి ఓటేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ మేనిఫెస్టో మహిళలకు పెద్దపీట వేసిందన్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, సంవత్సరానికి ఉచితంగా మూడు సిలిండర్లు, ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా వారికి సంవత్సరానికి రూ.15వేల చొప్పున, డ్వాక్రా మహిళలకు విరివిగా రుణాలు, రూ.4 వేలకు పింఛన్ పెంపు ఇస్తామని టీడీపీ హామీ ఇచ్చిందన్నారు. ఆమె వెంట తెలుగు మహిళలు ప్రచారంలో పాల్గొన్నారు.

రాయవరంలో జనసేన ప్రచారం

మార్కాపురం రూరల్ : మండలంలోని రాయవరం గ్రామంలో శనివారం నియోజవకర్గ జనసేన ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డిని, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్డీఏ కూటమిని గెలిపిస్తే ప్రతి పేద వారికి సంక్షేమ అభివృద్ధి పథకాలు అందుతాయని అన్నారు. రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.





కార్యకర్తలు పార్టీలోకి ఆహ్వానిస్తున్న నారాయణరెడ్డి, రాఘవరెడ్డి, ప్రచారంలో పాల్గొన్న కందుల వసంతలక్ష్మి

అన్ని వర్గాల ప్రజల సమస్యలు తెలుసుకున్నా..

- 20 వేల మెజార్టీతో విజయం సాధిస్తాం
- టీడీపీ కూటమి అభ్యర్థి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, మే 11 : 'ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో మూడేళ్లగా పల్లెపల్లెకు వెళ్లా ప్రజల సమస్యలను గుర్తించా, ప్రజలు టీడీపీకి ఓట్లు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రి చేసేందుకు సిద్ధం అయ్యారు.' ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. నియోజకవర్గంలో గత నెలరోజులుగా ఎన్ని కల ప్రచారం పూర్తి అయిన సందర్భంగా శనివారం పలు విషయాలు వెల్లడించారు. ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బందులకు గురైన ప్రజలు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు. నియోజకవర్గం ఐదు మండలాలల్లో తాగునీటి సమస్య, గ్రామాల్లో రోడ్ల సమస్య తీవ్రంగా ఉందన్నారు. టీడీపీతోనే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో 20 వేల మెజార్టీతో విజయం సాధిస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబు తెలిపారు. ఎర్రగొండపాలెం మండలంలో టీడీపీకి 6500 మెజార్టీ, పుల్లలచెరువు మండలంలో 4500, త్రిపురాంతకం మండలంలో 6000 ఆరువేలు, దోర్నాల మండలం 1500, పెద్దారవీడు మండలంలో 1500, ఐదు మండలాలలో 20 వేల మెజారిటీ సాధిస్తామన్నారు. సమావేశంలో ఎర్రగొండపాలెం మండల టీడీపీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రునాయక్, టీడీపీ రాష్ట్ర తెలుగు యువత సభ్యులు పోట్ల గోవింద్, మండల టీడీపీ కొత్తమాసు సుబ్రహ్మణ్యం, తోట మహేష్, గుమ్మా గంగరాజు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

త్రిపురాంతకం : టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలే టీడీపీని గెలిపిస్తాయని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కుమార్తె చెల్సియా అన్నారు. మండలంలోని సంఘం తండా గ్రామంలో శనివారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ సైకిల్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా ఎరిక్షన్‌బాబును, ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసరెడ్డిని గెలిపించాలని కోరారు. టీడీపీతోనే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి జరుగుతుందని, గిరిజనులు అభివృద్ధి చెందుతారని తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



జయకేతనం చూపుతున్న చెల్సియా



మాట్లాడుతున్న గూడూరి ఎరిక్షన్‌బాబు

ఐదేళ్ల కాలంలో ముస్లింలపైనే దాష్టీకాలు

ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకే మైనార్టీల మద్దతు

మార్కాపురం, మే 11: ముస్లిం మైనార్టీలపై ఈ ఐదేళ్ల కాలంలోనే దాష్టికాలు ఎక్కువయ్యాయని టీడీపీ పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం టీడీపీ జనసేన పార్టీలకు చెందిన మైనార్టీ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలాలి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జగన్ ప్రభుత్వ పాలనలో సుమారు 100కు పైగా దాడులు ముస్లింలపై జరిగాయన్నారు. ఎన్నో ముస్లిం కుటుంబాలు వైసీపీ గూండాల దాడులకు గురయ్యాయని, ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. వైసీపీ పాలనలో ఇన్ని దురాగతాలు జరిగినా మతపెద్దలు, మేధావులు ఏనాడు నోరు మెదపలేదన్నారు. కానీ నేడు టీడీపీ కూటమిలో బీజేపీ భాగస్వామ్యం కావడంపై కొన్ని ముస్లిం సంఘాలు టీడీపీకి ఓటు వేయవద్దని చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. ఎవరెన్ని చెప్పినా మైనార్టీ లు టీడీపీ పక్షానే ఉంటారన్నారు. మార్కాపురంలో కందుల నారాయణరెడ్డిని, ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి మాగుంట శ్రీనివాసుల రెడ్డికి ముస్లింలు మద్దతుగా నిలవాలన్నారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాధిక్ మాట్లాడుతూ మైనార్టీలకు గతం నుంచి వస్తున్న రాయితీపై రుణాలను ఈ ప్రభుత్వం ఎత్తి వేసిందని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో అమలు చేసిన విదేశీ విద్య పథకాన్ని వైసీపీ ప్రభుత్వం ఎత్తివేసిందన్నారు. విలేకరుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి పఠాన్ ఇబ్రహీంఖాన్, నియోజకవర్గ అధ్యక్షులు షేక్ మహబూబ్‌బాషా, మాజీ కౌన్సిలర్ షరీఫ్, షాకీర్, షేక్ నూరుల్లా, షేక్ వలి, పఠాన్ హుసేన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మౌలాలి, నాయకులు

అవీ..ఇవీ..

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం

- రిటర్నింగ్ ఆఫీసర్ రాహుల్ మీనా

మార్కాపురం, మే 11: మార్కాపురం అసెంబ్లీ పరిధిలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సర్వంసిద్ధం చేసినట్లు సబ్‌కలెక్టర్, రిటర్నింగ్ ఆఫీసర్ రాహుల్ మీనా అన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 2,14,608 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో 68 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ఆయా కేంద్రాలలో పోలీస్ బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 140 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల్లో అక్రమాలు చోటు చేసుకుండా ఉండేందుకు 48 మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవసరమైన అన్నీ మౌలిక వసతులు కల్పించామన్నారు.



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

శాంతియుతంగా ఎన్నికలు



కంభంలో కవాతు నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ రక్షణ దళాలు

కంభం, మే 11 : ఈ నెల 13న జరిగే శాసనసభ, ఎంపీ ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా అందరూ సహకరించాలని కంభం సీఐ రామకోటయ్య తెలిపారు. శనివారం ఉదయం బీఎస్ఎఫ్ దళాలతో కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గిద్దలూరు నియోజకవర్గంలోని కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల్లో జరిగే ఎన్నికల్లో ప్రజలందరూ సహకరించి శాంతియుతంగా ఓటు వేయాలన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కవాతులో కంభం ఎస్సై రాజేష్ పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూం పరిశీలన

గిద్దలూరు, మే 11 : వ్యయపరిశీలకులైన ఐఆర్ఎస్ అధికారి సాతే సందీప్ ప్రదీప్‌రావ్ పట్టణంలోని సెయింట్ పాల్స్ బిఇడి కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. భద్రతను సమీక్షించారు. అనంతరం రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వచ్చి అభ్యర్థుల సమక్షంలో వారి వ్యయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రిటర్నింగ్ అధికారి నాగజ్యోతి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సిద్దార్థ, సిబ్బంది పాల్గొన్నారు.



స్ట్రాంగ్‌రూంను పరిశీలిస్తున్న అబ్జర్వర్

వైద్యశిబిరం ఏర్పాటు

గిద్దలూరు, మే 11 : పట్టణంలోని ఏబీఎం పాలెంలో ముత్తూట్ ఎం జార్జ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గుండె, లివర్, కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏబీఎంపాలెం సమన్వయకర్త రిబ్కారాణి, భవాని, ప్రసన్న, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలి

పొదిలి, మే 11 : మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహీమ్మద్‌జియా తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బూత్‌లెవెల్ అధికారులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల అధికారులకు కేటాయించిన విధులను అప్రమత్తంగా నిర్వర్తించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఓటర్లపట్ల వ్యత్యాసం చూపించడం లాంటి వాటిని వ్యతిరేకించాలన్నారు. అలాచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బందికి కూడా ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని సూచించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న జియా

ప్రశాంతంగా ముగిసిన ప్రచారం

- ప్రజలతో మమేకం కావడంలో ముందున్న టీడీపీ

గిద్దలూరు, మే 11 : సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారంతో ముగిసింది. సుదీర్ఘంగా జరిగిన ప్రచారంలో నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి ముందున్నారు. టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి గిద్దలూరు పట్టణంతోపాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించి టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించారు. అశోక్‌రెడ్డి ఏ ప్రాంతానికి వెళ్లినా అక్కడి ప్రజలు స్వచ్ఛందంగా ఎదురేగి స్వాగతం పలికారు. శాలువాలు కప్పుతూ, దండలు వేస్తూ, పూలుచల్లుతూ స్వాగతం పలుకడం కనిపించింది. అలాగే అశోక్‌రెడ్డికి మద్దతుగా ఆయన సతీమణి పుష్పలీల నియోజకవర్గంలో ముమ్మరంగా ప్రచారం చేశారు. మహిళల నుంచి ఆమె అపూర్వ మద్దతు కనిపించింది. అశోక్‌రెడ్డి విజయం కోసం సోదరులు జగన్నాథరెడ్డి, క్రిష్ణకిశోర్‌రెడ్డి, కుమారుడు దివ్యేష్‌రెడ్డి, సోదరి గీతలు అన్ని మండలాల్లో ముమ్మరంగా ప్రచారం చేశారు. వైసీపీ, కాంగ్రెస్ అభ్యర్థులు సైతం ప్రచారంలో పాల్గొన్నారు. ఏది ఏమైనా ప్రచారఘట్టం ప్రశాంతంగా ముగియడంతో ప్రజలు కూడా ఊపిరి పీల్చుకుంటున్నారు. ఎన్నికలు కూడా ఇలాగే ప్రశాంతంగా ముగియాలని కోరుకుంటున్నారు.

చంద్రబాబుతోనే పేదల సంక్షేమం



ర్యాలీ నిర్వహిస్తున్న రామకృష్ణారెడ్డి, రఫీ

కంభం, మే 11 : ప్రజానాయకుడు నారా చంద్రబాబు నాయుడి తోనే పేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమం అందుతుం దని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చేగిరెడ్డి రామక్రిష్ణారెడ్డి, ఎన్ఆర్ఐ రఫీ తెలిపారు. పార్టీ ప్రచారం చివరి రోజు శనివారం కంభం తెలుగు యువతతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పూర్తిగా వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో అసంపూర్తిగా నిలిచిన వెలిగొండ ను పూర్తి చేయడం, మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించడం ద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. వైసీపీ ఈ ఐదేళ్ల పాలనలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించక పోవడంతో భవిష్యత్తును నాశనం చేశారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి ఏమాత్రం లేదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే గల్ఫ్ దేశాలలో లక్ష మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్ఆర్ఐ రఫీ తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కందులాపురం కూడలి నుంచి మెయిన్‌బజార్, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎన్నికల సామగ్రి పంపిణీ

» ఏర్పాట్లను పరిశీలించిన ఎన్నికల అధికారి

ఒంగోలు(కలెక్టరేట్), మే 11: జిల్లాలో సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల సామగ్రిని ఆదివారం పంపిణీ చేసేందుకు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఒంగోలు పార్లమెంట్‌తో పాటు జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో అందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు(ఈవీఎంల సామగ్రి)లో అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేశారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఆయా నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ కేంద్రాల వారీగా ఎన్నికల సామగ్రితో పాటు పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్ళనున్నారు. ఈనేపథ్యంలో ఆయా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లను పరిశీలించారు. శనివారం సాయంత్రం కనిగిరిలోని డిస్ట్రిబ్యూటరీ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారైన జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. అక్కడి ఆర్వోకు పలు సూచనలు చేశారు. ఆయా నియోజకవర్గాల కేంద్రాల్లో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు ఇలా ఉన్నాయి.

వైపాలెం అసెంబ్లీ నియోజకవర్గానికి అక్కడి ప్రభుత్వ హైస్కూలులో, దర్శి నియోజకవర్గానికి అక్కడి ఏపీ మోడల్ స్కూలు అండ్ జూనియర్ కాలేజీలో డిస్ట్రిబ్యూటరీ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. సంతనూతలపాడు నియోజకవర్గానికి ఎండ్లూరు డొంక వద్ద ఉన్న ట్రిబుల్ ఐటీ కళాశాలలో, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి ఆర్‌జీయూకేటీఎస్(రావ్ అండ్ నాయుడు కాలేజీ)లో, కొండపి నియోజకవర్గానికి రైజ్ ఇంజనీరింగ్ కాలేజీలో, గిద్దలూరు నియోజకవర్గానికి అక్కడి సెయింట్‌పాల్స్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి అక్కడి వ్యవసాయ మార్కెట్ అవరణలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు.

వైసీపీకి ఓటేస్తే ఉరితాడే!



పామూరులో రోడ్‌షో నిర్వహించిన టీడీపీ కూటమి శ్రేణులు

పామూరు, మే 11: వైసీపీకి ఇవే చివరి ఎన్నికలు కావాలని, జగన్‌కు ఓటేస్తే ఉరితాడేనని టీడీపీ కూటమి అభ్యర్థి ఉగ్ర తనయులు ఊహశ్రీ, జయసింహారెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ప్రధాన వీధుల్లో ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల భూములకు సంబంధించి ఆస్తుల రక్షణ కోసం కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. లేకుంటే జగన్ అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులను అమ్మేస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ పువ్వాడి తిరుపతమ్మ, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు ఏలూరి వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకుడు కేవీ రమణయ్య, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, జనసేన నాయకుడు వై.రహీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

సేవకు ప్రతిరూపం.. ఉగ్ర

పామూరు, మే 11: సేవకు ప్రతిరూపమైన ఉగ్రను ఓట్లు వేసి గెలిపించాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కుమార్తె ఊహశ్రీ, కుమారుడు జయసింహారెడ్డి కోరారు. మండలంలోని పడమటకట్టకిందపల్లి గ్రామంలో టీడీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ శనివారం రోడ్‌షో, ఇంటింటా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ ఉన్మాద పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఉగ్రను, ఎంపీగా మాగుంటను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్ చల్లా రత్తమ్మ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు గట్లు కొండారెడ్డి, యారవ శ్రీనివాసులు, మితికల నారాయణ, చల్లా శివయ్య కావేరి రసూల్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల



దేవాలయంలో భజనలు చేస్తున్న భక్తులు

దొనకొండ, మే 11: స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆనంద ఆశ్రమంలో వెలసిన శ్రీబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల వేడుకలు ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి నేతృత్వంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక భజనలు, పూజాకార్యక్రమాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పోలవరంలో రూ4.86 లక్షలు పట్టివేత

ముండ్లమూరు, మే 11: మండలంలోని పోలవరంలో శనివారం ఓటర్లకు వైసీపీ అభ్యర్థి శివప్రసాదరెడ్డి తరుపున నగదును కందుల మహేష్ పంపిణీ చేయటానికి సిద్ధమవుతుండగా పట్టుకున్నారు. ఉదయం ఎస్ఈటీ సీఐ బి. సుందరరామయ్య ఆధ్వర్యంలో దాడిచేయగా మహేష్ నుంచి రూ.4.86 లక్షలు పట్టుబడ్డాయి. నగదుతోపాటు మహేష్‌ను దర్శి రిటర్నింగ్ అధికారి లోకేశ్వర రావు ఎదుట హాజరుపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

టీడీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి

తాళ్లూరు, మే 11: టీడీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి పోలింగ్ సజావుగా జరిగేలా చూడాలని కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సోదరుడు భరత్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో శనివారం సాయంత్రం టీడీపీ ముఖ్యనేతలతో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రశాంతంగా ఓటింగ్ జరిగేటట్లు చూస్తే టీడీపీకి పోలింగ్ శాతం పెరుగుతుందన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, మానం రమేష్‌బాబు, రాచకొండ వెంకట్రావు, కైపు రామకోటిరెడ్డి, కైపు నాగార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు

పామూరు, మే 11: సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ నిర్వహణకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. మండలంలో 68 బూత్‌లు ఏర్పాటు చేయగా, అందులో పామూరు పట్టణంలో 16 బూత్‌లు ఏర్పాటు చేసినట్లు మండల ఎన్నికల అధికారి షాకిర్‌పాష తెలిపారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు, బారికేడ్లు, మంచినీటి సౌకర్యం, విద్యుద్దీపాలు, కుర్చీలు, టేబుళ్లు, తదితర ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. కాగా, సీఎస్‌పురం మండలంలో మొత్తం 43 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుచేసినట్లు ఏఆర్‌వో నాగూర్‌మీరా తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రాలవద్ద ఓటర్ల కోసం మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు చెప్పారు.

ప్రచారంలో ఓటర్లను ఆకట్టుకున్న గొట్టిపాటి లక్ష్మి

తాళ్లూరు, మే 11: గత నెల రోజులుగా జరుగుతున్న ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం ఆరు గంటలకు ముగిసింది. ఎన్నికల ప్రచారంలో టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, దర్శి అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి విస్తృతంగా పర్యటించారు. ఎంపీ మాగుంట తూర్పుగంగవరం, మాధవరం, కొత్తపాలెం, తాళ్లూరు గ్రామాల్లో దర్శి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మితో కలిసి పర్యటించి టీడీపీ శ్రేణుల్లో జోస్ నింపారు. లక్ష్మి మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓటర్లను ఆకట్టుకున్నారు. ఎంపీ మాగుంట తరుపున కుమారుడు రాఘవరెడ్డి, చందన, గొట్టిపాటి లక్ష్మి తరుపున పద్మావతి, భరత్ పలుగ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని తెలుపుతూప్రజల్ని ఆకట్టుకున్నారు. గతంలో కంటే ఈఎన్నికల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గొట్టిపాటి లక్ష్మి, మాగుంట శ్రీనివాసులరెడ్డిల రాకతో మండలంలో గతంలో కంటే ఈ పర్యాయం టీడీపీ కొంచెం పట్టు సాధించిందని పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటా!

» ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా
» టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



దర్శిలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

దర్శి, మే 11: ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ప్రజలను ఇబ్బందులు పెట్టే మనస్తత్వం తమ వంశంలో లేదన్నారు. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా శనివారం దర్శి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో ర్యాలీని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. దర్శి నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే బాగ్యం కల్పించిన టీడీపీ అధినేత చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. తమ కుటుంబానికి ప్రజలకు నిస్వార్థ సేవ చేయటమే తప్ప దాచుకోవటం, దోచుకోవటం, దాడులు చేయటం, ప్రజలను ఇబ్బందులు పెట్టటం తెలియదన్నారు. మా మెట్టినింటిలో 14 మంది డాక్టర్లు వైద్య వృత్తిలో కొనసాగుతున్నారని చెప్పారు. తాము కష్టపడి సంపాదించుకున్న సొమ్ములో కొంతభాగం ప్రజల కోసం ఖర్చు చేస్తున్నామేకానీ, ప్రజల సొమ్ము దోచుకోవటం మాకు అలవాటు లేదన్నారు. తనకు ఒక్క సారి అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. ప్రత్యర్థులు ఓటమి భయంతో తమను, తమ కుటుంబంపై వ్యక్తిగత దూషణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు తాము బయపడే ప్రసక్తేలేదన్నారు. ప్రజల మద్దతుతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతామని చెప్పారు. అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేస్తానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, సినీ హీరో శివాజీ, నగర పంచాయతీ చైర్మెన్ నారపుశెట్టి పిచ్చయ్య, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీ సూపర్ సక్సెస్

ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా శనివారం సాయంత్రం టీడీపీ కూటమి నిర్వహించిన ర్యాలీ సూపర్ సక్సెస్ అయింది. అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు రోడ్లపై బారులుతీరారు. మహిళలు పసుపురంగు దుస్తులు ధరించి జెండాలు చేతబూని హల్‌చల్ చేశారు. యువత కేరింతలు కొడుతూ పసుపురంగుతో కూడిన కాగితాలను చల్లుకుంటూ ఆ మార్గమంతా పసుపుమయం చేశారు. దర్శి-అద్దంకి రోడ్డులోని పోలేరమ్మ గుడిలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, సినీ హీరో శివాజీ పూజలు నిర్వహించి ర్యాలీగా బయలుదేరారు. టాప్‌లేని వాహనంపై ప్రజలకు అబివాదం చేస్తూ ముందుకు సాగారు. ఎన్నికల ప్రచారం విజయవంతంగా ముగియటంతో టీడీపీ కూటమి క్యాడర్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ కవ్వింపు చర్యలు

టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పోలేరమ్మ గుడిలో పూజలు చేస్తున్న సమయంలో కొంతమంది వైసీపీ కార్యకర్తలు జెండాలు పట్టుకొని వచ్చి కవ్వింపు చర్యలకు దిగారు. కూటమి క్యాడర్ ఎదురు తిరగటంతో తోకముడిచి వెళ్లిపోయారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల అభిమానాన్ని చూరగొనాల్సిన రాజకీయ పార్టీలు కవ్వింపు చర్యలకు పాల్పడటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓటమి భయంతోనే వైసీపీ ఇలాంటి పనికిమాలిన పనులు చేస్తున్నారని పలువురు అభిప్రాయపడ్డారు.

దళిత, బహుజనులకు చేదోడుగా ఉంటా!

» టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర
» వైసీపీని వీడిన పలు కుటుంబాలు

కనిగిరి, మే 11: కనిగిరి ప్రాంతంలోని దళిత, బహుజన వర్గాలకు చేదోడుగా ఉంటానని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని పాస్టర్‌లు, దళిత, బహుజనవర్గాలకు చెందిన ప్రజలు ఉగ్రకు మద్దతుగా శనివారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ పాస్టర్లకు ఇళ్లస్థలాలు ఇప్పించి పక్కా గృహాలను నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రతి ఒక్కరికీ చేతనైనంత సేవతోపాటు సహాయ, సహకారాలు అందించానన్నారు. దశాబ్దకాలంగా కనిగిరి ప్రజల సంక్షేమం కోసం సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగించినట్టు చెప్పారు. ఆరోగ్యం బాగాలేని పేదలకు వైద్య సహాయం కూడా అందించామన్నారు. తనపై దుష్ప్రచారాలు చేస్తూ ఎన్నికల్లో పబ్బం గడుపుకునే నేతలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఎవరెన్ని చెప్పినా ఎన్నికల్లో గెలిచిన అనంతరం దళితులకు, పాస్టర్‌లకు ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పార్టీలతో పనిలేకుండా పారదర్శకంగా పాలన సాగిస్తామన్నారు. కనిగిరి అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. దళితవాడల అభివృద్ధితోపాటు వారి ఆర్థిక పురోగతికి బాటలు వేస్తామన్నారు. స్థానికంగా ఉపాధి లభించేలా వారికి అండగా నిలబడతానన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆదరించి అత్యంత మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పాస్టర్‌లు, దళితులు పాల్గొన్నారు.



పాస్టర్‌ల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర



డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన పామూరు మండలం వాసులు

పది కుటుంబాలు టీడీపీలో చేరిక

పామూరు మండలం వగ్గంపల్లి, తూర్పుకట్టకిందపల్లి గ్రామాలకు చెందిన పది కుటుంబాలు వైసీపీని వీడి డాక్టర్ ఉగ్ర సమక్షంలో శనివారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో టీడీపీలో చేరారు. వారికి డాక్టర్ ఉగ్ర టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ఇంకా ఎన్నికల సమయం 24గంటలు మాత్రమే ఉందని, ప్రతి ఒక్కరూ టీడిపి గెలుపే లక్ష్యంగా సైనికుల్లా పనిచేయాలని కోరారు. ప్రత్యర్థుల ఎత్తులను చిత్తు చేయాలని పిలుపునిచ్చారు. ఓటింగ్ ప్రక్రియపై ప్రతి టీడీపీ సైనికుడు దృష్టి సారించి సానుభూతిపరుల ఓట్లను మళ్లించాలన్నారు. అవ్వ, తాతలను పోలింగ్ బూత్‌ల వద్దకు తీసుకువచ్చి ఓటు వేయించేలా ప్రోత్సహించి వారికి అండగా నిలబడాలన్నారు. ఎలాంటి చిన్న అవకాశాన్ని కూడా ప్రత్యర్థి పార్టీలకు ఇవ్వకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న సినీహీరో శివాజీ

మీ పిల్లల భవిష్యత్తును ఆలోచించి ఓటువేయండి

దర్శి, మే 11: మీ పిల్లల భవిషత్తుకోసం ఆలోచించి ఓటు వేయాలని సినీహీరో శివాజీ పిలుపునిచ్చారు. దర్శిలో శనివారం కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఎన్నికల ప్రచారం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి సాధ్యమన్న విషయాన్ని గుర్తించాలన్నారు. చంద్రబాబు సమర్థపాలనలో అభివృద్ధి, సంక్షేమంతోపాటు అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. గత ఐదు సంవత్సరాలుగా సాగిన అవినీతి, అరాచక విధ్వంస పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని అత్యధిక మెజారిలో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, మాగుంట చందన, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గొట్టిపాటి లక్ష్మి జన్మదినం



కేకు కట్ చేస్తున్న గొట్టిపాటి లక్ష్మి

దర్శి, మే 11: టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి జన్మదిన వేడుకలు శనివారం దర్శిలో ఘనంగా నిర్వహించారు. దర్శి నగర పంచాయతీలోని చింతలపాలెంలో నాయకులు, కార్యకర్తలు ఏర్పాటుచేసిన కేకును ఆమె కట్ చేసి అభిమానులకు పంచారు. అనంతరం చింతలపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కనకం శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఎన్నికల సామగ్రి పంపిణీ

» కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

కనిగిరి, మే 11: ఎన్నికల సామగ్రి పంపిణీచేసే క్రమంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని కలెక్టర్, ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక వ్యవసాయమార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని శనివారం కలెక్టర్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఆదేశాల ప్రకారం ఎన్నికల అధికారులు, సిబ్బంది తుచ పాటించాలన్నారు. ఎన్నికల విధుల్లో అలసత్వంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల విధుల కోసం ఇతర ప్రాంతాల నుంచి దాదాపు 60 బస్సులు కనిగిరి కేంద్రానికి వస్తున్నట్లు ఆయన తెలిపారు. తెల్లవారుజాము 5గంటల నుంచే ఎన్నికల సిబ్బంది, అధికారులు వారివారి ప్రాంతాల నుంచి ప్రయాణించి కనిగిరి 9గంటలలోపే చేరుకుంటారని చెప్పారు. వారికి నాణ్యమైన అల్పాహార ఏర్పాట్లను విధిగా చేపట్టాలన్నారు. మహిళా సిబ్బందికి ఎలాంటి అసౌకర్యాలకు తావులేకుండా తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈవీఎంల పరిరక్షణ విషయంలో కట్టుదిట్టంగా ఉండాలని ఆర్‌వోకు హెచ్చరికలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆవుల సురేష్, డీటీ రమేష్, ఎన్నికల అధికారులు రమణారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కనిగిరి వ్యవసాయ మార్కెట్‌లో ఎన్నికల సామగ్రి కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ దినేష్‌కుమార్

దర్శిలో ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

దర్శి, మే 11: జిల్లాలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ చెప్పారు. స్థానిక మోడల్ స్కూల్‌లో ఎన్నికల సామగ్రి పంపిణీ కోసం చేసిన ఏర్పాట్లను శనివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం అందితే, ముందుగానే పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల పండుగకు తరలివస్తున్న జనం

» కిటకిటలాడుతున్న రైళ్లు
» అధిక చార్జీలు వసూళ్లు చేస్తున్న ప్రైవేట్ బస్సులు

దొనకొండ, మే 11: రాష్ట్రంలో ఐదేళ్లకు ఒకసారి జరిగే ఓట్ల పండుగ మళ్లీ వచ్చేసింది. సోమవారం రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఈనేపథ్యంలో అనేక ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు సంసిద్ధమై స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. ఉద్యోగ, ఉపాధి, విద్య, వ్యాపారపరంగా జీవనోపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి ఆప్రాంతాల్లో జీవిస్తున్న మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజలు సొంత గ్రామాలకు తరలివస్తున్నారు. శని, ఆది, సోమవారాలు సెలవులు కావటంతో ఓటర్లు ముందుగానే తమ ప్రాంతాలకు చేరుతున్నారు. దీంతో దొనకొండ మీదుగా ప్రయాణించే రైళ్ల రద్దీగా ప్రయాణిస్తుండటం కనిపిస్తుంది.

హైదరాబాద్, బెంగుళూర్, విశాఖపట్టణం తదితర పట్టణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రైవేట్ బస్సులు రెట్టింపు చార్జీలు వసూళ్లు చేస్తున్నాయి. ఇతర ప్రాంతాల్లో ఉన్న వలస ఓటర్లను తిరిగి స్వగ్రామాలకు రప్పించేందుకు ప్రధాన రాజకీయ పార్టీల నేతలు ఆఫర్లు ప్రకటించి చెల్లింపులు జరిపినట్లు తెలుస్తోంది. ఓటు వేయటం కోసం గ్రామాలకు తరలివస్తున్న ఓటర్లతో గ్రామాల్లో సందడి వాతావరణం చోటుచేసుకుంది. ఈనేపథ్యంలో ఓటర్లు ఎవరిని గెలిపిస్తారో, ఏపార్టీకి పట్టం కడతారో అనేది ప్రజల్లో చర్చనీయాంశమైంది.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు

» ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ హసీబ్ ఉర్ రహిమాన్

కనిగిరి, మే 11: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈసీ అమలు చేస్తున్న నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీస్ అబ్జర్వర్ హసీబ్ ఉర్ రహిమాన్ హెచ్చరించారు. శనివారం కనిగిరి పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన ఆజీపురం, యడవల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలతో పాటు, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఇతర అంశాలను హసీబ్ ఉర్ రహిమాన్ పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఎంతమంది ఓటర్లు ఉన్నారో, గతంలో జరిగిన గొడవలపై ఆరా తీశారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరగటానికి చేపట్టాల్సిన భద్రతా చర్యలపై డీఎస్పీ రామరాజుకు సూచించారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు ఎలాంటి భద్రతాపరమైన లోపాలు, అవరోధాలు ఏర్పడితే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ఆయన వెంట పోలీసు అధికారులు వెంకటేశ్వరరావు, త్యాగరాజు, విజయ్‌కుమార్ ఉన్నారు.



కనిగిరిలో పోలీసులకు తగు సూచనలు చేస్తున్న ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ హసీబ్ ఉర్ రహిమాన్



ష్..

ముగిసిన ప్రచారం

- మూగబోయిన ఎన్నికల మైకులు
- ఓటర్లకు ప్రలోభాల ఎరలో అభ్యర్థులు
- పోల్ మేనేజ్‌మెంట్‌పై రాజకీయ పార్టీల దృష్టి

గుంటూరు, బాపట్ల, మే 11 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రచారం పరిసమాప్తమైంది. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు శనివారం సాయంత్రం 6 గంటలకు నిషేధాజ్ఞలు అమల్లోకి వచ్చాయి. కాగా చివరి రోజున ప్రధాన పార్టీల అభ్యర్థులు భారీ ర్యాలీలు, రోడ్ షోలు, సభలతో హోరెత్తించి ఎన్నికల ప్రచారానికి ముగింపు పలికారు. దీంతో ఎన్నికల మైకులు మూగబోయాయి. దాదాపు రెండు నెలలుగా ప్రచార హోరుతో దద్దరిల్లిన గ్రామాలు, పట్టణాలన్నీ ఒక్కసారిగా సైలెంట్ అయిపోయాయి. ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకోవడానికి చివరి ప్రయత్నంగా శనివారం సాయంత్రం వరకు ఉన్న అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఇంతకాలం ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి మండు టెండల్లో ప్రచారం చేసిన నేతలు రహస్య మంతనాలు, ప్రలోభాలపై దృష్టిసారించేందుకు ప్రణాళికలు రూపొందించుని రంగంలోకి దిగారు. పోలింగ్‌కు కొద్ది గంటల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున బూత్‌ల వారీగా బలాబలాలపై మరోమారు సమీక్ష జరుపుకునే పనిని ఆదివారం నేతలు చేయనున్నారు. ప్రతికూలంగా ఉన్న చోట్ల రహస్యమంతనాలు జరపడానికి ప్రణాళికలు రచించి దానికి అనుగుణంగా అడుగులు వేయనున్నారు. ప్రచార గడువు ముగియడంతో జెండాలు, కండువాలు లేకుండా గ్రామాల్లో, పట్టణాల్లో నేతలతో పాటు వారి అనుచరులు తిరగడానికి ప్రణాళికలు రచించారు. రాత్రివేళల్లో ఓటరు స్లిప్పుతో పాటు ఓటుకు రేటుతో నగదు పంపిణీని నేతల అనుచరులు పంచుతున్నారు. ఓటుకు రూ.1,500 నుంచి 2,000 వరకు ఇస్తూ ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలను ముమ్మరంగా చేశారు. మద్యం దుకాణాలకు సాయంత్రం 6 గంటల నుంచి ఎక్సైజ్ అధికారులు సీలు వేశారు.

సుదీర్ఘంగా ఎన్నికల ప్రక్రియ

ఈ దఫా ఎన్నికల ప్రచారం సుదీర్ఘంగా సాగింది. షెడ్యూల్ మార్చి 16న విడుదల కాగా నోటిఫికేషన్ నెలా రెండు రోజుల తర్వాత ఏప్రిల్ 18న విడుదలైంది. అప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. గత ఎన్నికల్లో తొలి విడతలోనే పోలింగ్ జరగ్గా ఈ దఫా నాల్గో దశలో జరగబోతున్నాయి. రాజకీయ పార్టీలకు ఎక్కువ సమయం లభించడంతో నియోజకవర్గాల వారీగా సభలు, రోడ్ షోలను పార్టీల అధ్యక్షులు నిర్వహించారు. దాదాపుగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలల్లో ఏదో ఒక రూపంలో ప్రచారం చేశారు. ఎన్‌డీఏ కూటమి తరపున ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ తది తరులు తొలి అడుగు చిలకలూరిపేట నియోజకవర్గంలోని బొప్పూడి ఆంజనేయస్వామి పాదాల చెంత నుంచి ప్రచారం ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రచార సభలు, రోడ్ షోలతో ప్రధాన పార్టీల నాయకులు హోరెత్తించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పలు నియోజకవర్గాల్లో చంద్రబాబు ప్రజాగళం పేరుతో బహిరంగ సభలు నిర్వహించారు. గుంటూరులో చంద్ర బాబు రోడ్ షోకు వేలాదిగా ప్రజలు హాజరై మద్దతు తెలిపారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తెనాలి, పొన్నూరుల్లో ప్రచార సభలు, రోడ్‌షోలు నిర్వహించి కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఓటర్లను చైతన్య పరిచారు. కాంగ్రెస్ పార్టీ తరపున వైఎస్ షర్మిల గుంటూరు, బాపట్ల, చీరాల, రేపల్లెలో రోడ్ షో, బహిరంగ సభ నిర్వహించారు. కాగా అధికార యంత్రాంగం రెండు నెలలపై నుంచి ఎన్నికల నిర్వహణ పైనే పూర్తిగా నిమగ్నమైంది. పోస్టల్ బ్యాలెట్ సందర్భంగా కొంత సమస్యలు ఎదురైనప్పటికీ గడువుని పెంచి అందరూ ఓటుహక్కు వినియోగించుకునేలా చేశారు. ఈఎన్నికల్లో ప్రప్రథమంగా ప్రవేశపెట్టిన హోం ఓటింగ్‌ని సజావుగా నిర్వహించారు.



సంక్షేమ బాదుడు

- సామాన్యుడిపై ధరా భారం
- పథకాల మాటున రెట్టింపు దోపిడి
- ధరలు అదుపులో వైసీపీ ప్రభుత్వం విఫలం
- ఐదేళ్లలో 200 నుంచి 300 శాతం పెరిగిన ధరలు
- ఐదేళ్లలో కుటుంబానికి 3 లక్షల వరకు అదనపు ఖర్చు
- మందుబాబులుంటే ఆ భారం మరో రూ.2 లక్షలు అదనం

సంక్షేమం అన్నారు.. ప్రతీ ఇంటా ఏదో ఒక లబ్ధి పొందారన్నారు.. కానీ పథకాల ద్వారా ఒక్కో కుటుంబం పొందిన లబ్ధి కంటే వారిపై బాదుడు భారం పది రెట్లకు పైగా పడింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక సామాన్యుడి ఇంట ధరల మంట అంటుకుంది. ధరల రూపంలో, ఛార్జీల రూపంలో ప్రతీ కుటుంబం ఐదేళ్లు విలవిలలాడిపోయింది. కరెంటు బిల్లులు విపరీతంగా పెరిగిపోయాయి. ఇక చెత్త పన్నుతో పాటు ఇంటి పన్నులు పెరుగుదలతో అద్దెలు కూడా పెరిగాయి. ధరా భారం, చార్జీలు, పన్నుల మోతలతో కుటుంబాలు చితికిపోయాయి. ఐదేళ్ల జగన్ పాలనలో జరిగిన నష్టాన్ని, కోల్పోయిన ఆదాయాన్ని చూసుకుని ఘొల్లుమంటున్నాడు. పెరిగిపోతోన్న ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వం విస్మరించింది. ఇదే అవకాశంగా వ్యాపారులు ధరలను ఇష్టం వచ్చినట్లుగా పెంచేశారు. అసలు ధరలు ఎందుకు పెరుగుతున్నాయంటే సమాధానం చెప్పేవారే లేకుండా పోయారు. వ్యాపారుల తీరు ఈ విధంగా ఉంటే.. ప్రభుత్వం చార్జీలు, పన్నుల బాధుడుతో చెలరేగిపోయింది. మొత్తంమీద ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో అరకొర విదిల్చి పెద్దమొత్తంలో దోచుకుందని ప్రజలు వాపోతున్నారు.

గుంటూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం.. సంక్షేమం.. అంటూ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం జపం చేస్తూ వచ్చింది. అయితే సంక్షేమం రూపంలో అందిన మొత్తాలకంటే తమ నుంచి వివిధ రూపాల్లో దోచుకున్నదే అధికం అని ప్రజలు వాపోతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో అందిన సంక్షేమం కంటే ఒక్కో కుటుంబంపై అంతకు రెండు రెట్లు భారం పడింది. ఈ విషయం గమనించిన ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో సంక్షేమంపై ఊకదంపుడు ఉపన్యాసాలతో హోరెత్తించింది. అయితే ధరలు, చార్జీలు, పన్నుల రూపంలో తమపై పడిన భారాన్ని తలుచుకుని ప్రజలు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. 2019లో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ధరలకు రెక్కలు వచ్చాయి. నాటి నుంచి ఇప్పటి వరకూ నిత్యావసర ధరల్లో పెరుగుదల 200 నుంచి 300 శాతం ఉంది. 2019లో రూ.40 ఉన్న కిలో సన్న బియ్యం ధర ఇప్పుడు రూ.65 నుంచి 70కి పెరిగింది. రూ.50 ఉన్న కిలో కందిపప్పు ధర ఇప్పుడు 160కి పెరిగింది. రూ.50 ఉన్న కిలో పామాయిల్ రూ.155కి పెరిగి ఇప్పుడు రూ.98కి తగ్గింది. రూ.40 ఉన్న లీటరు పాల ధర ఇప్పుడు రూ.70కి చేరింది. కిలో చికెన్ రూ.150 నుంచి రూ.300కు, రూ.350 ఉండే మటన్ రూ.850కు పెరిగింది. పక్క రాష్ట్రాలతో పోల్చుకుంటే మన రాష్ట్రంలో పెట్రోలు ధర లీటరుకు రూ.10 అదనం కావడంతో భారం మరింత పెరిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే నిత్యావసర ధరలు సామాన్యుడి నడ్డి విరిచేస్తున్నాయి.

మందుబాబుల కుటుంబమైతే..

గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో క్వార్టరు మద్యం ధర రూ.50 నుంచి 60 ఉండేది. వైసీపీ ప్రభుత్వం మద్య నిషేధం పేరుతో మద్యం ధరను రూ.200కు పెంచింది. ఫలితంగా ఒక్కో మందుబాబుపై కనీసంగా రూ.140 భారం పడింది. ఆ కారణంగా ఆయా కుటుంబాలపై నెలకు రూ.4,200 భారం అదనంగా పడింది. ఏడాదికి రూ.50,400, ఐదేళ్లకు రూ.2లక్షల 52 వేలు అదనంగా భారం పడింది. అం టే ఒక్కో మందుబాబు కుటుంబంపై కనిపించకుండా రెండు న్నర లక్షల భారం పెరిగింది. దీనికి తోడు ఇంటి పన్ను, చెత్తపన్ను, ఆర్టీసీ చార్జీలను కలుపుకుంటే ఆ భారం మరింత పెరిగినట్లే.

ధరల స్థిరీకరణపై నిర్లక్ష్యం

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ధరలను స్థిరీకరిస్తామని, అందుకోసం రూ.3 వేల కోట్లతో నిధిని బడ్జెట్లో కేటాయిస్తామని ప్రతిపక్ష నేత హోదాలో జగన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. చెప్పినట్లుగా బడ్జెట్లో నిదులు కేటాయించినట్లు చూపించిన ప్రభుత్వం ఆచరణలో దాన్ని పక్కన పెట్టేసింది. ఫలితంగా ధరల భారం ప్రజలపై దారుణంగా పడింది. కందిపప్పు, బియ్యం ధరలు పెరిగినప్పుడు ఆర్భాటపు ప్రకటనలు చేసిన ప్రభుత్వం సబ్సిడీ ధరలకు వాటిని ఇవ్వలేదు. దీంతో ఆ భారమంతా ప్రజలే మోయాల్సి వచ్చింది. గతంలో టీడీపీ ప్రభుత్వం ధరలు పెరిగిన సందర్భాల్లో రైతుబజార్ల ద్వారా, రేషన్ షాపుల ద్వారా సబ్సిడీ ధరలకు వాటిని అందించింది. ఫలితంగా సామాన్యులకు కొంత ఊరట లభించేంది. వైసీపీ వచ్చాక ఆ ఊసే లేకుండా పోయింది.

రూ.1.96 లక్షలు ఇచ్చి రూ.3.60 దోపిడీ

ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వార ఒక్కో కుటుంబానికి లక్ష నుంచి రెండు లక్షల వరకూ ప్రయోజనం చేకూరినట్లు వైసీపీ ప్రచారం చేసుకుంటోంది. 4 దఫాల అమ్మఒడి ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.54 వేలు, 3 దఫాల చేయూత ద్వారా రూ.55 వేలు, రుణమాఫీ ద్వారా రూ.40 నుంచి రూ.60 వేలు, పించన్ల పెంపుదల ద్వారా రూ.27 వేలు లబ్ధి చేకూరింది. అంటే ఒక కుటుంబంలో ప్రభుత్వ పథకాలన్నీ పొందినా అది రూ.1.96 లక్షలు అందుకున్నట్లు. కానీ ధర పెరుగుదల కారణంగా అదే కుటుంబంపై నెలకు రూ.4 నుంచి 6 వేలు చొప్పున ఏడాదికి 48 నుంచి 72 వేలు ఐదేళ్లకు 2 లక్షల 40 వేల నుంచి రూ.3 లక్షల 60 వేల వరకూ భారం పడినట్లు. అంటే సంక్షేమ పథకాల పేరుతో రూ.1.96 లక్షలు ఇచ్చి అదనంగా 2 లక్షల వరకు దోచుకున్నట్లే.

నెలకు రూ.6 వేల భారం

వైసీపీ అధికారంలోకి వచ్చాక లెక్కలు తీస్తే ఒక్కో కుటుంబంపై రూ.4 నుంచి 6 వేల వరకు భారం పడుతున్నట్లు తేలింది. 25 కేజీల బియ్యం కట్టపైనే ఒక్కో కుటుంబం నెలకు రూ.650 అదనంగా చెల్లించాల్సి వస్తోంది. గతంలో రూ.వెయ్యి ఉన్న బియ్యం కట్ట ఇప్పుడు రూ.1650 వరకూ విక్ర యిస్తున్నారు. కంది పప్పుపై ఒక్కో కుటుంబం నెలకు రూ.500, నూనెలపై రూ.400, పాలపై రూ.900 వందలు, గ్యాసుపై రూ.500, చింతపండు, ఉల్లిపాయలపై రూ.300, అల్లం, వెల్లుల్లిపై రెండు వందలు, చికెన్‌పై రూ.400, మటన్‌పై 800 నుంచి రూ.1200 అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. చంద్ర బాబు పాలనలో రూ.300 వచ్చే కరెంటు బిల్లు ఇప్పుడు రూ.1100 నుంచి 1400 వస్తోం ది. రోజుకు ఒక లీటరు పెట్రోల్ వాడే కుటుంబంపై నెలకు రూ.900 భారం పడింది. ఈ మొత్తం కలుపుకుంటే ఒక్కో కుటుం బంపై ప్రతి నెలా 4 నుంచి 6 వేల వరకూ ఖర్చు పెరిగింది.

- ఓటేయడానికి భారీ సంఖ్యలో రాక
- వైసీపీలో కలవరం.. రవాణాలో ఆటంకాలు



ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి వాహనాల్లో ఆంధ్రాకు తరలివస్తున్న ప్రజలు

ఉత్సాహంతో.. ఊర్లకు..

తెనాలి, బాపట్ల(ఆంధ్రజ్యోతి), గుంటూరు, మే 11: పండుగలకు.. జాతర్లకు వచ్చినట్లుగా ఓటర్లు ఉత్సాహంగా ఊర్లకు తరలివస్తున్నారు. గతంలో ఎన్నో ఎన్నికలు జరిగాయి. కానీ ఆ.. చూద్దాంలే.. కుదిరితే వద్దాంలే.. ఎవరైనా ఖర్చులు పెట్టుకుంటే వస్తాం అన్నట్లుగా ఓటర్లు ఉండేవారు. కానీ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో కసిగా ఓటర్లు పెద్దసంఖ్యలో సొంతూళ్లకు తరలివస్తున్నారు. ఉద్యోగం, ఉపాధి నిమిత్తం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల్లో ఉంటున్న వేలాది మంది తమతమ సొంతూళ్లకు తరలివచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. కొందరైతే శనివారమే పయనమవగా మిగిలిన వారు ఆదివారం వచ్చేలా ఏర్పాట్లు చేసుకున్నారు. విదేశాల నుంచి కూడా పెద్దసంఖ్యలో ఈ సారి ఓటు వేయడానికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మొదలుకుని వివిధ రంగాలలో స్థిరపడిన వారు, కార్మికులు, విద్యార్థులు ఇలా అందరూ ఎలాగైనా తమ ఓటు హక్కు వినయోగించుకోవాలనే కసితో సొంతూళ్ల బాట పట్టడం రాజకీయ పండితులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో ఓటు వేయడానికి ఆసక్తి చూపిన దాఖలాలు లేవని పలువురు అభిప్రాయ పడుతున్నారు. పైగా వరుస సెలవులు వస్తే ఆటవిడుపుగా భావించే వారని కానీ ఈ సారి పరిస్థితి మారిందంటున్నారు. కసితోనే వస్తున్నారన్న అంచనాలతో అధికారపార్టీ నేతల్లో కల వరం మొదలైంది. దీంతో రవాణా విషయంలో ఆటంకాలు కలిగించడానికి వైసీపీ కుట్రలు పన్నుతోందన్న విమర్శలను టీడీపీ చేస్తోంది. నిన్నమొన్నటి వరకు ఆయా పార్టీల అభ్యర్థులు ఏర్పాటు చేసే రవాణా సౌకర్యం మీద ఆశలు పెట్టుకున్న ఇతర ప్రాంతాల్లో ఉండే ఓటర్లు, ఇప్పుడు ఎవరికి వారు స్వచ్ఛందంగానే వచ్చేలా సిద్ధమయ్యారు. శనివారం గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్, రైల్వే స్టేషన్లలో ప్రయాణీకుల కోలాహలం నెలకొన్నది. అంతేగాక కొందరు గ్రూపులుగా ఏర్పడి సొంతంగా కార్లను కూడా ఏర్పాటు చేసుకొని మరీ ఓటు వేసేందుకు ఉత్సాహంగా చూపుతున్నారు. దీంతో టోల్ ప్లాజాల వద్ద కార్లతో రద్దీ ఏర్పడింది.

50 వేల మందికిపైగా రాక..

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఓ అంచనా ప్రకారం దాదాపు 50,000 మంది వేరే ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వారంతా స్వస్థలాలకు తరలి వస్తున్నట్లు సమాచారం. బాపట్ల జిల్లాలో చూస్తే ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఓటర్లలో పర్చూరు నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్నారు. తర్వాత స్థానాల్లో బాపట్ల, వేమూరు, రేపల్లె, అద్దంకి, చీరాల ఉన్నాయి. ఇప్పటికే హైదరాబాద్ నుంచి గుంటూరుకు వచ్చే రైళ్లని కిటకిటలాడుతూ వస్తున్నాయి. బస్సుల్లో సైతం అదే రద్దీ నెలకొంది. ప్రత్యేక రైళ్లు, బస్సులు ఏర్పాటు చేసినా అన్నింట్లోనూ సీట్లు దొరకని పరిస్థితి. 500 మంది వరకు విదేశాల నుంచి ఓటు వెయ్యడానికి రావొచ్చని తెలుస్తోంది. ఈ స్థాయిలో ప్రవాస ఓటర్లలో స్పందన కనిపించడంపై టీడీపీ ఆనందం వ్యక్తం చేస్తోంది. ఈ పరిణామాలు తమకు సానుకూలమని, ప్రభుత్వం మీద వ్యతిరేకత ఉంటేనే ఈ విధంగా ఓటర్లు సొంతూళ్ల బాట పడతారని టీడీపీ అభ్యర్థులు లెక్కలు వేస్తుకుంటున్నారు. పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్‌లో ఉద్యోగులు దాదాపు కూటమి వైపు మొగ్గారనే అంచనాల నుంచి తేరుకోకముందే ఇతర ప్రాంతాల నుంచి ఓటర్లు భారీగా తరలి రావడంతో వైసీపీ నేతలు కలవర పడుతున్నారు.

ప్రత్యేక రైళ్లు ఏర్పాటు

హైదరాబాద్‌లో నివసిస్తూ ఓటు వేయడా నికి గుంటూరు, పల్నాడు జిల్లాలకు వస్తున్న వారి కోసం రైల్వే శాఖ ఆదివారం ప్రత్యేక రైలుని ఏర్పాటు చేసింది. నెంబరు. 07097 సికింద్రాబాద్ - విశాఖ రైలు ఆదివారం రాత్రి 7.45కి బయ లుదేరి సత్తెనపల్లికి 10.39, గుం టూరుకు 11.30, మరుసటి రోజు ఉద యం 6.30కి విశాఖ చేరుకొంటుంది. అలానే ఓటు వేసి తిరుగు ప్రయాణమయ్యే వారి కోసం ఈ నెల 13న రాత్రి 7.50కి నెంబరు. 07098 విశాఖ - సికింద్రాబాద్ రైలు బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2.25కి గుంటూ రు, 3.20కి సత్తెనపల్లి, మంగళవారం ఉదయం 8.15కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. ఎవరైతే టిక్కెట్‌లు బుకింగ్ చేసుకోలేకపోయారో వారు ఈ రైళ్ల సర్వీసులను వినియోగిం చుకోవచ్చని రైల్వే అధికారులు ప్రకటించారు.

తెగిన నోట్ల కట్టలు.. తరలిన మద్యం

అధికార పార్టీ అభ్యర్థులకే మద్యం   ఒక్కదుకాణంపైనా కన్ను వేయని ఎస్ఈబీ

ప్రచారం ముగిసింది. మద్యం దుకాణాలూ మూతపడ్డాయి. కానీ నోట్ల కట్టలకు, మద్యం సీసాల మూటలకు మాత్రం కట్టడి లేకుండా పోయింది. ఓట్ల కొనుగోళ్లకు నోట్ల కట్టలు తెగి ప్రలోభాల కోసం పందేరం అయిపోతున్నాయి. శనివారం నుంచి మద్యం దుకాణాలకు సీలు పడుతుందని ముందే తెలిసి అధికార పార్టీ నేతలు, అభ్యర్థులు మద్యం కోసం జాగ్రత్తలు పడ్డారు. దుకాణాల్లోని సరుకును తరలించేశారు. మరోపక్క ఓటుకోసం నోట్ల పంపిణీ కూడా కొన్నిచోట్ల గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతుంటే, మరికొన్నిచోట్ల బహిరంగంగానే పంచేస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా ఎన్నికల పరిశీలకులు కానీ, ఎస్ఈబీ అధికారులు కానీ వీటివైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఓటు కోసం కట్టలు తెంచుకున్న డబ్బు చాలాచోట్ల శుక్రవారం నుంచే పంపిణీ మొదలుకాగా శనివారం మరింత ఊపందుకుంది. తెనాలి నియోజకవర్గంలో ఒక పార్టీ రూ.వెయ్యి ఇస్తుంటే, మరోపార్టీ రూ.1500 పంపిణీ చేస్తోంది. అధికార పార్టీ మాత్రం కొన్నిచోట్ల రూ.వెయ్యి, మరికొన్నిచోట్ల రూ.1500 వరకు పంచుతున్నారని సమాచారం. పొన్నూరులోనూ ఓటుకు రూ.2 వేల వరకు పంచేస్తున్నారు. అధికార పార్టీ అభ్యర్థులు బహిరంగంగానే పంచుతున్నారు. మరికొన్నిచోట్ల అధికార, ప్రతిపక్ష సభ్యులు ఒకే మాటగా ఎవరిపైనా ఎవరూ ఫిర్యాదు చేసుకోకుండా గుట్టుచప్పుడు కాకుండా పంపిణీ చేస్తున్నారు. ఎన్నికల కోడ్‌కి ముందే ఎక్కడికక్కడ డబ్బు సిద్ధం చేసి ఉంచటంతో చెక్‌పోస్టుల దగ్గర, దాడుల్లో డబ్బు దొరకలేదు. పల్నాడుకు చెందిన నేతలే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అధికార పార్టీ అభ్యర్థులకు డబ్బు సమకూర్చేపనిలో ఉన్నారని సమాచారం. ఇక మద్యం విషయానికి వస్తే ప్రతిపక్ష పార్టీల నేతలకు మద్యం అందడం కష్టంగా మారింది. అధికార పార్టీ నేతలకు మాత్రం ప్రభుత్వ దుకాణాల నుంచే సరఫరా జరిగింది. అమ్మకాల్లో పరిమితి ఉన్నా ఒక్కో మద్యం దుకాణం నుంచి చీప్‌లిక్కర్ బాటిల్స్ 100 చొప్పున మూటలు కట్టి తరలించుకుపోయారు. ఒక్కో దుకాణం నుంచి కనీసం పది మూటల చొప్పున బహిరంగంగానే తీసుకుపోయారు. దుకాణాల వద్ద మందుబాబులు క్యూలో ఉన్నా మద్యం లేదని చెప్పడంతో వారు గొడవకు దిగిన ఘటనలు పలు చోట్ల కనిపించాయి.





సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రవర్మ, తెన్నేటి కృష్ణప్రసాద్, అన్నం సతీష్, బాధితుడి భార్య

టీడీపీలో చేరాడని దళితుడిపై దాష్టీకం

- పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధం.. ఎస్ఐ ఎదుట దాడి
- ఎస్ఐ, కోన వెంకట్‌పై కేసు నమోదు చేయాలని స్టేషన్ చుట్టుముట్టిన దళితులు
- దళితుడికి న్యాయం చేయాలని తెన్నేటి, వేగేశన, అన్నం డిమాండ్

కర్లపాలెం, మే 11: మండలంలోని గణపవరం పంచాయతీ లంకమాల పల్లికి చెందిన దళిత నేత కత్తి రాజేశ్వరరావు(రాజేష్) శనివారం ఉదయం బాపట్ల అసెంబ్లీ కూటమి అభ్యర్థి నరేంద్రవర్మ ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. దీంతో బాపట్ల వైసీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కోన రఘుపతి బంధువు అయిన సినీ రచయత, నిర్మాత కోన వెంకట్ ఫోన్ ఆదేశాలతో ఇంట్లో నిద్రిస్తున్న రాజేష్‌ను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆ వెంటనే స్టేషన్‌కు చేరుకున్న కోన వెంకట్ ఎస్ఐ జనార్ధన్ ఎదుటే దళితుడిపై చేయిచేసుకున్నారు. ఈ విషయం తెలిసిన కుటుంబసభ్యులు, బంధువులు, టీడీపీ నేతలు స్టేషన్‌ను చుట్టిముట్టి ఐదు గంటల సేపు ఆందోళన చేశారు. టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు తెన్నేటి కృష్ణప్రసాద్, వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీరాల గోవర్ధన్‌రెడ్డి, నాయకులు సలగల రాజశేఖర్, డాక్టర్ చార్వాక, న్యాయవాదులు కళ్ళం హరినాథరెడ్డి, గవిని శ్రీనివాసరావు, భోగిరెడ్డి రమేష్‌రెడ్డి, బెజ్జం వెంకటేశ్వర్లు స్టేషన్ వద్దకు చేరుకుని దళితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఫిర్యాదు లేకుండా కోన వెంకట్ చెప్పారని దళితుడ్ని ఎస్ఐ స్టేషన్‌కు పిలిపించడంపై డీఎస్పీ మురళీకృష్ణ ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు.



న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న బాధితుడి బంధువులు

కులం పేరుతో దూషించి దాడి

కోన వెంకట్, అతడి అనుచరులు మార్పు బెనర్జి, మార్పు రత్నం, కాగిత మోషె, నక్కా సంతోష్‌లు ఎస్ఐ సమక్షంలోనే కులం పేరుతో దూషించి, కాలుతో తన్నారని రాజేష్ డీఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. పార్టీ మారటం నీ ఇష్టమా, ఎంతకు అమ్ముడు పోయావు.. నిన్ను చంపితే దిక్కు ఎవరు, మా బాబాయి కాబోయే ఎమ్మెల్యే అంటూ ఇష్టం వచ్చినట్లు కొట్టారన్నారు. ఎస్ఐ కూడా చెంపలపై కొట్టి, పెద్దవారితో నీకేందుకురా అని తిట్టాడన్నారు.

ఎస్ఐపై వేటు

రాజేశ్‌పై దాడి చేసిన కోన వెంకట్‌తో పాటు ఆయన అనుచరులు, ఎస్ఐ జనార్ధన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్ఐను సస్పెండ్ చేసినట్లు ఎస్పీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

భూముల కబ్జాకే ల్యాండ్ టైటిలింగ్

- ప్రజల ఆస్తులు కొల్లగొట్టేందుకు వైసీపీ కుట్ర
- జీవో పత్రాలను తగలబెట్టిన ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, మే 11: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా భూములు భక్షించేందుకు జగన్‌రెడ్డి ల్యాండ్ టైటిలింగ్ చట్టం తెచ్చారని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు తెలిపారు. శనివారం ఇసుకదర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 512 జీవో కాపీలను ఎమ్మెల్యే ఏలూరి తగలబెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలు, ఇంటి పట్టాలు, పాసుపుస్తకాలపై జగన్‌రెడ్డి ఫొటోలు, వైసీపీ రంగులు ఉండడంపై ప్రజలందరూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. రైతుల భూములను కబ్జా చేసేందుకు వారి భూములపై ఆస్తులపై వైసీపీ నాయకులకు హక్కు కల్పించేందుకు, వారి పేర రాసేందుకే ల్యాండ్ టైటిలింగ్ అన్నారు. ఈ విషయమై రైతులు కోర్టులను ఆశ్రయించకుండా జీవోలో పొందుపరిచారని తెలిపారు. ప్రమాదకరమైన అంశాలతో కూడిన ఈ చట్టాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. మన ఆస్తులను, మన భూములను రక్షించుకోవడానికి జగన్‌రెడ్డి ఆపార్టీ అభ్యర్థులందరికీ ఓటుతో బుద్ధి చెప్పాలని ఏలూరి ప్రజలను కోరారు. జగన్‌రెడ్డి బినామీ కంపెనీకి(ఇండోసోల్) ఒక్క రామాయపట్నం పరిసరాల్లో 8500 ఎకరాల రైతుల భూములను కారు చవకగా కట్ట బెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ రాష్ట్ర అభివృద్ధి కోసం పిల్లల భవిష్యత్ కోసం టీడీపీ కూటమి అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.



ల్యాండ్ టైటిల్ జీవో కాపీలను దహనం చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

టీడీపీలో చేరికల జోరు

ఏలూరి సమక్షంలో సైకిలెక్కిన వైసీపీ శ్రేణులు

పర్చూరు, మే 11 : తెలుగుదేశం పార్టీలో చేరికల జోరు కొనసాగుతోంది. నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే ఏలూరి నినాదం హోరెత్తుతోంది. ప్రతి నిత్యం వందలాది మంది నాయకులు, కార్యకర్తలు వైసీపీని వీడి ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో సూకిలెక్కుతున్నారు. దీంతో వైసీపీ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది. కార్యక్రమంలో భాగంగా శనివారం మార్టూరు మండలం కోనంకి గ్రామానికి చెందిన డెయిరీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి చెంగలయ్య మేనల్లుడు ఎంపీటీసీ సభ్యుడు గుంటుపల్లి శివరామకృష్ణతోపాటు కోనంకి గ్రామ ఉపసర్పంచ్ ఉప్పలపాటి శ్రీకాంత్ ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. ఇది వైసీపీకి భారీ షాక్ అని ఆపార్టీ శ్రేణులే చర్చించుకుంటున్నాయి.

పర్చూరు మండలం బోడవాడ గ్రామానికి చెందిన దేవరకొండ రాముడు, దేవరకొండ శ్రీనివాసరావు, పెద్ద వెంకటేశ్వర్లు, వెంకటేష్, దుర్గా ప్రసాద్‌తోపాటు మరికొందరు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు.

మండలంలోని కొల్లావారిపాలెం కాలనీకి చెందిన గద్దె చిరంజీవి, గర్నెపూడి వినోద్‌కుమార్, పునుగు విజేయ్‌రాజు, బిళ్ల శ్రీకారంత్, రూబేన్, పునుగు సాల్మన్, పిల్లి మోషే, అన్నమ్మ, శ్యాం, కోనా రవికుమార్, అంజయ్య, గర్రపుశాల శివయ్య, సూరాపోకుల బాబు, బిల్లా ఇసాక్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన జూపూరి సుభాష్ బాబు, ప్రేమ్‌కుమార్, సాల్మాన్, తిగూరి సుబ్బారెడ్డి, శీలం రాజారావు, జూపూడి అశోక్ టీడీపీలో చేరారు.

మార్టూరు గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ బాషా, షేక్ ఖాశిం, సుభానీ, సాదూబయా, అల్లాభక్ష్, షేక్ నజీర్, షేక్ కరిముల్లా, షేక్ జానీ, పఠాన్ కాలేషా, పఠాన్ షారూక్‌ఖాన్ సైకిలెక్కారు.

యద్దనపూడి మండలం ఇంజనంపాడుకు చెందిన పల్లెపోగు పెద్ద మస్తాన్, వంకాయలపాటి కల్యాణ్ పార్టీలో చేరారు.

ఇంకొల్లు మండలం భీమవరానికి చెందిన పాటిబండ్ల గోపి, చలిచం చినరాఘవరావు, మొగలి శ్రీను ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో పార్టీలో చేరారు.


ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

వైసీపీని వీడి టీడీపీలో చేరిన భీమవరం గ్రామస్థులు

ఇంకొల్లు : మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన 20 మంది శనివారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వైసీపీకి చెందిన భీమవరం సొసైటీ అధ్యక్షుడు పాటిబండ్ల గోపాలస్వామితో పాటు 20 మంది ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. వారికి కండువాలు వేసి ఏలూరి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో పాటిబండ్ల శ్రీరామూర్తి, కోటా ఆదిశేషయ్య, మద్దినేని వెంకట్రావు, చలిచం చినరాఘవయ్య, అన్నెం రాఘవయ్య, మొగిలి శ్రీనివాసరావు, కంకట గోపాలస్వామి, చెన్నుపాటి శ్రీనివాసరావు, ఆళ్ల అప్పారావు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీరగంధం ఆంజనేయులు పాల్గొన్నారు.


వైసీపీని వీడి టీడీపీలో చేరిన భీమవరం నేతలు

ప్రారంభించిన చోటే ముగింపు

వలపర్లలో ఏలూరి ఎన్నికల ప్రచారం పూర్తి

మార్టూరు, మే 11 : టీడీపీ కూటమి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తన ఎన్నికల ప్రచారాన్ని మండలంలోని వలపర్ల గ్రామంలో శనివారం సాయంత్రం ముగించారు. ఆయన మధ్యాహ్నం వలపర్ల గ్రామంలోని ప్రధాన వీధులలో ఇంటింటికీ తిరుగుతూ సైకిల్ గుర్తుపై ఓటేసి కూటమి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారాన్ని ఆయన ఇక్కడి నుంచే ప్రారంభించారు. 2014, 2019లో విజయం సాధించిన క్రమంలో తన ప్రచారాన్ని వలపర్ల నుంచి ప్రారంభించడం ఇక్కడే ముగించడం విశేషం. ప్రచార కార్యక్రమంలో నాయకులు కంభంపాటి హనుమంతరావు, జంజనం సుబ్బారావు, గుంటి వెంకటేశ్వర్లు, షేక్ బషీర్, వెలగా రామాంజనేయులు, వెంకట సుబ్బారావు పాల్గొన్నారు. ద్వారకపాడు గ్రామానికి చెందిన 12 కుటుంబాలు ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు.


ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరిస్తా

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

అద్దంకి, మే 11 : టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గుండ్లకమ్మ రిజర్వాయర్ ముంపు గ్రామాలు, పునరావాస కాలనీల సమస్యలు పరిష్కరిస్తానని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ధేనువకొండలో గొట్టిపాటి రవికుమార్ శనివారం ఇంటింటికీ తిరిగి ఓట్లు అడిగారు. ఇసుక అక్రమ రవాణా కోసం గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు మరమ్మతులు చేయకుండా వైసీపీ పాలకులు వదిలివేశారని రవికుమార్ అన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో ఇసుక తవ్వకాలతో వైసీపీ నాయులు దండుకుంటున్నారన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజల పై మోయలేని భారాలు మోపారన్నారు. సరైన గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల పాలయ్యారన్నారు. వ్యవసాయ విద్యుత్ మోటార్ లకు మీటర్ల ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు తీరని నష్టం చేసిందన్నారు. వృద్ధాప్య పింఛన్‌ను రూ.4 వేలకు పెంచడంతోపాటు ఏప్రిల్ నుంచి పెంచిన పింఛన్‌ను రూ.7వేలు జులైలో అందిస్తామన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, జొన్నలగడ్డ గోపి, బత్తుల రామకోటయ్య, సర్పంచ్ ఇండ్లా పద్మ, గుంజి నాగరాజు, జొన్నలగడ్డ రామారావు, ఆంజనేయులు, అన్నాబత్తిన అజయ్, తుళ్లూరి వెంకటేశ్వర్లు, మాదాల శ్రీకాంత్ పాల్గొన్నారు.


దేనువకొండలో గొట్టిపాటికి గుమ్మడికాయతో దిష్టితీస్తున్న మహిళలు

మణికేశ్వరం సర్పంచ్ టీడీపీలో చేరిక

మండలంలోని మణికేశ్వరం సర్పంచ్ మందా రూతువేణితో పాటు పలువురు వైసీపీ నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ముప్పవరంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం మణికేశ్వరం సర్పంచ్ రూతువేణి నాగయ్యతో పాటు వైసీపీ నేతలు మందా రవి, పౌలు, సుబ్బయ్య, దాసరి సుబ్బారావు, మందా తిమోతి, యోహోను, జక్రయ్య, డేవిడ్, ఇసాక్‌తో పాటు 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సైకిలెక్కిన 70 ఎస్టీ కుటుంబాలు

అద్దంకి పట్టణంలోని 8వ వార్డు పరిధిలో శ్రీరామ్‌కాలనీకి చెందిన 70 ఎస్టీ కుటుంబాలు ఎంపీటీసీ మాజీ సభ్యుడు జయింపు రామాంజనేయులు, కత్తి కామయ్య, బొజ్జా నరసింహ, ఇండ్లా శ్రీను, కొప్పోలు శ్రీను ఆధ్వర్యంలో శనివారం ముప్పవరంలోని టీడీపీ కార్యాలయంలో వైసీపీని వీడి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ నేతలు మాదాల రామాంజనేయులు, నర్రా శ్రీనివాసబాబు, నర్రా కాంతయ్య, నర్రా గోపాల్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే

మేదరమెట్ల : రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రారంభించిన ఘనత ఎన్టీఆర్‌దన్నారు. సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ అన్నారు. శనివారం మండలంలోని ధైవాలరావూరులో తెలుగుదేశం అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులు గొట్టిపాటి రవికుమార్, తెన్నేటి కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు సామాన్యుల నడ్డివిరిగేలా పెరిగాయన్నారు. విద్యుత్ చార్జీలు 9సార్లు పెంచి, ఎన్నికల హామీలను జగన్ విస్మరించారన్నారు. ఎలాంటి అభివృద్ధి చేయకుండానే అన్నీ చేశానని పచ్చి అబద్ధాలు మాట్లాడుతూ ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50ఏళ్లకే పింఛన్, వృద్ధులకు రూ.4వేల పింఛన్ అందజేస్తారన్నారు. ఆయన వెంట ధైవాలరావూరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు

సంతమాగులూరు : నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు తొలి సంతకం డీఎస్సీ నోటిఫికేషన్‌పై చంద్రబాబు సంతకం పెడతారని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఏల్చూరు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన గొట్టిపాటి జగన్‌రెడ్డి పాలనలో దళితులకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యతనిస్తామన్నారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ కూటమి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని గొట్టిపాటి విజ్ఞప్తి చేశారు.

సంతమాగులూరు మండలంలో ఫ్యాన్‌కు ఎదురుగాలి

మండలంలోని అన్ని గ్రామాల్లో ఫ్యాన్‌కు ఎదురుగాలి వీస్తోంది. నిన్నటి వరకు మండలంలోని పలు గ్రామాలకు చెందిన మండల స్థాయి నాయకులు వైసీపీలో చక్రం తిప్పారు. నేడు ఎన్నికల సమయం రావడంతో తిరిగి సొంత గూటికి చేరారు. కొన్ని గ్రామాల్లో నాయకులు వారివెంటే నడిచారు. దీంతో ఫ్యాన్ పార్టీ ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతోంది. మండలం కుందుర్రు గ్రామానికి చెందిన గోరంట్ల శ్రీనివాసరావు అతని అనుచరులతో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. దీంతో సంతమాగులూరు మండలంలో తెలుగుదేశం పార్టీలో జోష్ పెరిగింది. కార్యక్రమంలో కుప్పాక ఏడుకొండలు, చావల నాగేశ్వరరావు, రాయవరపు వెంకయ్య, మేకల గోవిందరాజులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.


గొట్టిపాటి సమక్షంలో టీడీపీ చేరిన మణికేశ్వరం సర్పంచ్ రూతువేణి


టీడీపీలో చేరిన 8వ వార్డు శ్రీరామ్‌కాలనీ ఎస్టీ కుటుంబాలు

ఎన్నికల సిబ్బంది కోసం ప్రత్యేక బస్సులు

అద్దంకి, మే 11 : ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు రెండు బస్సులు అద్దంకి నుంచి మార్టూరు, పర్చూరు, చీరాల, బాపట్ల, చెరుకుపల్లి, భట్టిప్రోలు మీదుగా రేపల్లెకు వెళ్లాయని, అదే విధంగా రేపల్లె నుంచి అదే రూట్‌లో ఉదయం 6 గంటలకు బయలుదేరి అద్దంకి వస్తాయని డీఎం రామ్మోహనరావు తెలిపారు. అదే విధంగా ఎన్నికల కోసం పర్చూరు నియోజకవర్గానికి అద్దంకి డిపో నుంచి 10 బస్సులు ఉదయం 6 గంటలకు అద్దంకి నుంచి బయలుదేరి వెళ్తాయని తెలిపారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టం ప్రమాదకరం

టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు రామకోటయ్య

అద్దంకి, మే 11 : జగన్‌రెడ్డి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అన్నదాతలకు అత్యంత ప్రమాదకరం అని టీడీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు బత్తుల రామకోటయ్య అన్నారు. మండలంలోని ధేనువకొండలో శనివారం జరిగిన ఎన్నికల ప్రచారంలో రామకోటయ్య మాట్లాడుతూ వైసీపీ తెచ్చిన భూ భక్షక చట్టం వల్ల రైతులు ఆస్తులపై హక్కులను కోల్పోతారన్నారు. ఎదైనా సమస్య వస్తే అధికారుల చుట్టూ తిరగడం తప్ప పరిష్కారమయ్యే అవకాశం ఉండదన్నారు. స్థానిక, జిల్లా కోర్టులను ఆశ్రయించే అవకాశమే ఉండదని, హైకోర్టుకు మాత్రమే వెళ్లే అవకాశముందన్నారు. ఇలాంటి కుట్రలకు రూపకల్పన చేసిన జగన్‌రెడ్డిని ఓటుతో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. టీడీపీ కూటమి రాగానే ల్యాండ్ టైటిల్ చట్టాన్ని రద్దు చేస్తామన్నారు. 13న జరిగే ఎన్నికలలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా గొట్టిపాటిని, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

రాజకీయ ఉపాధి కూలీలకు విరామం

ముగిసిన ఎన్నికల ప్రచారం

చీరాల, మే 11 : సార్వత్రిక ఎన్నికల ప్రచార పర్వం ముగిసింది. చెవులు దిబ్బలు పడేలా అభ్యర్థుల పేర్లు, గుర్తులతో హోరెత్తిరించిన మైకులు మూగబోయాయి. ఎన్నికలలో భాగంగా గత నెలన్నరగా సందర్భానుసారంగా రాజకీయ ప్రచార సభలకు, సమావేశాలకు, ర్యాలీలలో జనసమీకరణకు రాజకీయ ఉపాధి కూలీలకు రోజువారీ రూ.300 ఆపైన గిట్టుబాటు అయింది. శనివారం ఎన్నికల ప్రచారం ముగియడంతో వారిలో కొందరికి విరామం, మరికొందరికి ముగింపు పలికారు. ఆది, సోమవారాలు రెండు రోజులు ప్రత్యేక కార్యాచరణకు నమ్మకస్తులు కొందరికి మాత్రం ప్రత్యేక ప్యాకేజీతో కొన్ని బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. ఇక ద్వితీయశ్రేణి నాయకులలో కొందరు హడావుడి పెంచారు. అక్కడ 50 ఓట్లు ఉన్నాయి. ఇక్కడ 100 ఓట్లు ఉన్నాయి. వాటిని మన వైపు తిప్పుకునేందుకు ప్రత్యేక ప్యాకేజీ అవసరమని పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులకు, వారి అనుంగ అనుచరులకు మాటల మూటలు చేరవేయడంలో కొందరు ద్వితీయశ్రేణి నాయకులు హడావుడి చేస్తున్నారు. అందులో కొందరు స్వామికార్యంతో పాటు స్వకార్యం నెరవేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో అభ్యర్థులు కూడా తాము వెచ్చించే సొమ్ములో కొంత దుర్వినియోగం అయినప్పటికీ సానుకూల ఫలితం సాధించేందుకు వాటిని పెద్దగా పట్టించుకోవటం లేదని విషయం తెలిసిన వారి మధ్య చర్చల్లో ప్రస్తావనలు వస్తుండడం విశేషమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

మూగబోయిన ప్రచారం

పర్చూరు : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ప్రచార పర్వం శనివారంతో ముగిసింది. సాయంత్రం 6 గంటల కల్లా ప్రచారం ముగిసేవిధంగా ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. దీంతో సాయంత్రానికే ప్రచారాన్ని ఆయా పార్టీల ప్రతినిధులు నిలిపివేశారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన మరుసటి రోజు నుంచే ప్రచారం హోరెత్తింది. ఆయా రాజకీయ పార్టీల నేతలు హోరాహోరీగా గ్రామాల్లో ప్రచారాలు సాగించారు. లౌడ్ స్పీకర్ల హోరు మూగబోయింది.

ముగింపు రోజు ముమ్మర ప్రచారం

కొండయ్యకు మద్దతుగా కుమారుడు, మేనల్లుడు హీరో నిఖిల్ ప్రచారం

వేటపాలెం(చీరాల), మే 11 : ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా శనివారం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కూటమి అభ్యర్థి ఎం.ఎం కొండయ్యకు మద్దతుగా ముమ్మర ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా కొండయ్య కుమారుడు గౌరీఅమర్‌నాథ్, మేనల్లుడు సినీ హీరో నిఖిల్ సిద్ధార్థ తీరప్రాంత గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో కలసి విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తులపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రం వైసీపీ పాలనలో అన్ని విధాలుగా కుంటుపడిందన్నారు. మరలా రాష్ట్ర భవిష్యత్‌ను గాడిన పెట్టాలంటే ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఆయన తిరిగి ముఖ్యమంత్రి కావాలన్నారు. అందుకు ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తులపై ఓట్లువేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. పలు చోట్ల యువత పెద్దసంఖ్యలో హీరో నిఖిల్‌తో కలసి సెల్ఫీలు దిగేందుకు పోటీలు పడ్డారు. కార్తికేయ సినిమా హీరోరా మామా అంటూ యువకులు ఒకరికొకరు చెప్పుకుంటూ ప్రచారంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


వాడరేవులో ప్రచారం నిర్వహిస్తున్న సినీహీరో నిఖిల్ సిద్ధార్థ, గౌరీఅమర్‌నాథ్

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా

టీడీపీ కూటమి అభ్యర్థి కొండయ్య

వేటపాలెం (చీరాల), మే 11 : ఆదరించండి. ఓటుతో ఆశీర్వదించండి. అభివృద్ధిలో ముందుందాం. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతూ రుణం తీర్చుకుంటా, అందరికీ అండగా ఉంటానని టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని వూటుకూరిసుబ్బయ్యపాలెంలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కొండయ్య మత్స్యకారులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెసుకున్నారు. వాటిని ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తానని చెప్పారు. సోమవారం జరిగే ఎన్నికల పోలింగ్‌లో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ మేనిఫెస్టో, బీసీ డిక్లరేషన్ ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చీరాల మండలం ఈపురుపాలెంలో శనివారం టీడీపీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. సోమవారం పోలింగ్ సందర్భంగా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్యకు, ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


ఊటుకూరిసుబ్బయ్యపాలెంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న కొండయ్య

చింతపల్లిపాడులో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య వాగ్వివాదం

- ఎంపీ నందిగం సురేష్ వాహనం వస్తుండగా ఘటన
- ఎంపీ, యడం బాలాజీ, ఎమ్మెల్సీ తూమాటి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- సంయమనం పాటించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

యద్దనపూడి, (మార్టూరు) మే 11 : యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామంలో శనివారం సాయంత్రం తెలుగుదేశం, వైసీపీ పార్టీ కార్యకర్తలకు మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ సమయంలో ఎంపీ నందిగం సురేష్ ప్రత్యక్షంగా వివాదం జరిగిన ప్రదేశంలోనే ఉండడం విశేషం. అందిన సమాచారం మేరకు చింతపల్లిపాడు గ్రామంలో శనివారం సాయంత్రం తెలుగుదేశం, జనసేన పార్టీల కార్యకర్తలు గ్రామంలో ద్విచక్రవాహనాలపై ర్యాలీగా ప్రచారం చేసుకొని యనమదల గ్రామం వైపు వెళుతున్నారు. అదే సమయంలో ఎంపీ నందిగం సురేష్ తన వాహనంలో యనమదల గ్రామం వైపు నుంచి చింత పల్లిపాడు గ్రామానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీ వాహనానికి ఎదురుగా టీడీపీ కార్యకర్తల బైక్‌ల ప్రచారర్యాలీ రావడం, దాంతో అక్కడ కొంచెం ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఈ సమయంలో ఎంపీ సురేష్ కారు నుంచి దిగి టీడీపీ కార్యకర్తలను దుర్భాషలాడినట్లు తెలిసింది. అయితే టీడీపీకి చెందిన కొందరు నాయకులు పార్టీ కార్యకర్తలకు నచ్చ చెప్పి, ఎలాంటి గొడవలకు తావివ్వకూడదనే కారణంతో అక్కడ నుంచి ర్యాలీని యనమదల గ్రామానికి తీసుకు వెళ్లినట్లు తెలిసింది. తర్వాత ఈ విషయమై సమీపంలోని గ్రామం నుంచి కొంతమంది వైసీపీ కార్యకర్తలు నందిగం సురేష్ వద్దకు వచ్చారు. అనంతరం మళ్లీ టీడీపీ కార్యకర్తలకు, వైసీపీకి చెందిన కార్యకర్తలకు ఎంపీ సమక్షంలోనే కొంత వాదన జరిగినట్లు తెలిసింది. తర్వాత తెలుగుదేశం పార్టీ ర్యాలీ యనమదల గ్రామానికి వెళ్లిపోగా పార్టీ కార్యకర్తలతో రోడ్డుపై ధర్నా చేయడానికి వైసీపీ కార్యకర్తలు ప్రయత్నిం చినట్లు తెలిసింది. ఈ సంఘటనపై వెంటనే సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి యద్దనపూడి పోలీసులు రోడ్డుపై ధర్నా చేయవద్దని అవసరమైతే స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవాలని ఎంపీతో పాటు కార్యకర్తలకు చెప్పడంతో వారంతా స్టేషన్‌కు చేరారు. అప్పటికి సమాచారం అందడంతో వైసీపీ అభ్యర్థి యడం బాలాజీ, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు కూడా స్టేషన్‌కు వచ్చారు. వారు సీఐ సీతారామ్, ఎస్ఐ జీవీఎస్ చౌదరితో మాట్లాడారు. తరువాత చింతపల్లిపాడు గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన అట్లూరి మహేష్ కొంతమంది తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తులపై కుల దూషణ తో దౌర్జన్యం చేశారని స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తరువాత ఎంపీతో పాటు అందరూ వెళ్లిపోయారు. మొత్తం మీద ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించినట్లు తెలిసింది. చింతపల్లిపాడులో రాత్రికి పికెట్‌ను ఏర్పాటు చేసినట్లు సీఐ సీతారాం తెలిపారు.

ఓటు కోసం సొంత ఊళ్లకు ప్రజలు

కిక్కిరిసిన రైల్వే స్టేషన్, బస్టాండ్

చీరాలటౌన్, మే 11 : ఎట్టకేలకు ఎన్నికల ఘట్టానికి చేరుకున్నాం. మూడు రోజుల నుంచి చీరాల బస్టాండ్, రైల్వే స్టేషన్‌లు ప్రయాణికులతో కిక్కిరిసి కన్పిస్తున్నాయి. రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారే కాకుండా ఇతర రాష్ట్రాల్లో ఉండే యువతీ, యువకులు, మహిళలు, పురుషులు పిల్లాపాపలతో ఓట్లు వేసేందుకు సొంత ఊళ్లకు పెద్ద ఎత్తున చేరుకుంటున్నారు. దీంతో ఒకింత రద్దీ పెరిగిందనే చెప్పాలి. ఇదిలావుంటే తరలిన ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోటీ పడుతున్నారు. ఈనేపథ్యంలో గత ఎన్నికలకంటే ఈసారి ఓటు వినియోగ శాతం పెరిగే అవకాశం ఉంది. అంతే కాకుడా అధికారులు ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో బీఎల్‌వోల ద్వారా ఓటు స్లిప్‌లను పంపిణీ చేశారు. అయితే ఊళ్లకు చేరుకున్న ఓటర్లు ఆయా ప్రాంతాల్లోని స్థానిక సమస్యలపై ముచ్చటించుకుంటున్నారు. ఓటు వినియోగంపై క్లారిటీ తెచ్చుకునేందుకు పెద్ద ఎత్తున చర్చిస్తున్నారు.


రైలు దిగి బయటకు వస్తున్న ప్రయాణికులు

దయనీయంగా గ్రామీణ రోడ్లు

- కనీస మరమ్మతులూ కరువు
- ఐదేళ్లుగా వైసీపీ నిర్లక్ష్యం
- ప్రయాణికులకు తప్పని పాట్లు

పర్చూరు, మే 11: పర్చూరు నియోజకవర్గంలోని ఆయా మండలాల పరిధిలో గ్రామీణ రహదారుల పరిస్థితి దయనీయంగా మారింది. ఎక్కడ చూసినా గుంతలు, కంకరలేచి ప్రమాదకరంగా ఉన్న దృశ్యాలే దర్శనమిస్తున్నాయి. దీంతో ఆయా మార్గాలో నిత్యం రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు నానా పాట్లు పడుతున్నారు. రాత్రిపూట పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. ఏళ్ల తరబడి రహదారులు అధ్వానంగా మారినా కనీసం మరమ్మతులకు కూడా నోచుకోకపోవడం వైసీపీ నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం సంక్షేమం పేరుతో మమ అనిపిస్తుందే తప్ప ప్రజలకు కనీస వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


అధ్వానంగా ఉన్న బోడవాడ - రమణాయపాలెం రహదారి


దారుణంగా ఉన్న గొల్లపూడి - భూషాయపాలెం మధ్య రహదారి


రామాయపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న గొట్టిపాటి రవికుమార్ సతీమణి ఝాన్సీ

అన్నింటా ముందున్న గొట్టిపాటి

- భారీ మెజార్టీ కోసం పక్కా ప్రణాళికతో ముందడుగు
- ఐదోసారి వినయంగా ప్రజల్లోకి..

అద్దంకి, మే 11 : రెండు దశాబ్దాల క్రితం రాజకీయ రంగ ప్రవేశం చేసిన గొట్టిపాటి రవికుమార్ నాలుగు సార్లు వరుస విజయాలతో ముందుకు సాగుతూ 5వ సారి ఎన్నికల బరిలో నిలిచారు. అయితే 5వ సారి పోటీలో ఉన్నానన్న గర్వం, అజాగ్రత్త లేకుండా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ అందరి మద్దతు కూడకట్టుకుంటున్నారు. ఎప్పటికప్పుడు అప్పటి పరిస్థితులకు అనుగుణంగా పక్కా వ్యూహాలతో ముందుకు సాగుతుండడమే గొట్టిపాటి విజయరహస్యం అని రాజకీయనాయకుల విశ్లేషణ. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ నుంచి రెండు సార్లు, వైసీపీ నుంచి ఒక సారి, టీడీపీ నుంచి ఒక సారి విజయం సాధించి, మరో సారి టీడీపీ నుంచి పోటీ చేస్తున్నా, ఏ వర్గం ఓటర్ల లోనూ గొట్టిపాటి పై వ్యతిరేఖ భావన లేకపోవడం వెనుక ఆయనలో ఉన్న లౌకికమే కారణం అన్న భావన అత్యధిక శాతం ఓటర్లలో ఉంది. ఈ క్రమంలోనే గత ఎన్నికలలో రాష్ట్రం మొత్తం వైసీపీ అనుకూల పవనాలు వీచినా అద్దంకి నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున గొట్టిపాటి రవికుమార్ 12 వేలకు పైగా మెజార్టీతో గెలుపొందారు. ఈ విడత గొట్టిపాటిని అన్ని విధాలుగా దెబ్బతీసేందుకు, ఆర్థిక మూలాల మీద దెబ్బకొట్టే విధంగా అధికార పార్టీ వ్యవహరించింది. అయినా చెక్కు చెదరని మనో ధైర్యంతో నిలిచి అన్ని విషయాలలో ప్రత్యర్థి కంటే పది అడుగులు ముందు ఉంటున్నాడన్న భావన నియోజకవర్గ నేతలు, ఓటర్లలో ఉంది. ప్రస్తుత ఎన్నికల విషయానికి వస్తే గతం కంటే భిన్నంగా ఇంటింటి ప్రచారంలో గొట్టిపాటి రవికుమార్‌తో పాటు సతీమణి ఝాన్సీ, కుమారుడు హర్షవర్ధన్, సోదరుని కుమారుడు కమల్‌కిషోర్(బాబీ) విస్తృతంగా పాల్గొన్నారు. అదే సమయంలో తమ అంతరంగికులను నెల రోజుల ముందు నుంచే ఒక్కో మండలానికి ఒక్కొక్కరిని కేటాయించి ఏ విషయంలోనూ లోటు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడంలోనూ సఫలీకృతుడైనట్లు తెలుస్తుంది. ఓటర్లను కలవడం మొదలు ఎలక్షనింగ్ చేసే విషయాల వరకు ప్రత్యర్థులకు అందనంత ముందులో ఉన్నట్లు తెలుస్తుంది. మండలాలు, గ్రామాలవారీగా ప్రత్యర్థి వర్గం నేతలు, క్యాడర్‌ను తన వైపు తిప్పుకోవడం లోనూ గొట్టిపాటి సఫలీకృతులైనట్లు తెలుస్తుంది. ప్రతి విషయంలో ప్రత్యర్థులకంటే ముందుండి భారీ మెజార్టీ దిశగా పక్కా ప్రణాళికతో గొట్టిపాటి ముందుకు సాగుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అన్ని సామాజిక వర్గాల నుంచి గొట్టిపాటికి మద్దతు లభిస్తుండడం కలిసొచ్చే అంశంగా భావిస్తున్నారు. ఈ విడత అద్దంకి పట్టణం తో పాటు అన్ని మండలాలలో గతం కంటే ఎక్కువ మెజార్టీ వచ్చే అవకాశాలు బాగా ఉన్నాయన్న అభిప్రాయం సర్వాత్రా వ్యక్తమవుతోంది.

ప్రచారానికి తెర

ఆద్యంతం ఆధిక్యం ప్రదర్శించిన టీడీపీ అభ్యర్థులు
నాలుగు సభలకు హాజరైన చంద్రబాబు
లోకేష్ యువగళం నిర్వహణ
గిద్దలూరులో పాల్గొన్న పవన్
రెండుచోట్ల బాలకృష్ణ హాజరు
రేపు పోలింగ్, ఎన్నికల ఏర్పాట్లలో యంత్రాంగం
నేడు సిబ్బందికి సామగ్రి అందజేత
మద్యం దుకాణాలు బంద్, బాటిళ్ల కోసం బారులు తీరిన మందుబాబు

సాధారణ ఎన్నికల పోలింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. పోటీలో ఉన్న అభ్యర్థులకు ప్రధాన ఘట్టమైన బహిరంగ ప్రచారం శనివారంతో ముగిసింది. షెడ్యూల్ మార్చి 16న విడుదల కాగా ఇంచుమించు అప్పటి నుంచి రంగంలో ఉంటున్న అభ్యర్థులు, పార్టీశ్రేణులు ఎన్నికల ప్రచారాన్ని చేపట్టాయి. అలా దాదాపు 55రోజుల పాటు సాగిన ప్రచారం శనివారం సాయంత్రం ఆరుగంటలతో నిలిచిపోయింది. నిత్యం మార్మోగిన మైకులు, డీజే సౌండ్స్ మూగబోయాయి. పోటీ చేసే ప్రత్యర్థి పార్టీ అభ్యర్థుల కన్నా టీడీపీ అభ్యర్థులపై ముందుగానే స్పష్టత వచ్చింది. దీంతో వారు తదనుగుణంగా క్యాంపెయిన్ ప్రారంభించి అన్నింటిలోనూ ముందున్నారు.


ఒంగోలు ప్రచారంలో విజయ సూచికగా పూల విల్లును ఎక్కుపెడుతున్న జనార్దన్, పక్కన మాగుంట

ఒంగోలు,మే 11 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల సమరం తుది దశకు చేరుకొంది. శనివారం సాయంత్రం ఆరు గంటలతో ప్రచారానికి తెరపడింది. మొత్తంగా టీడీపీ అభ్యర్థులు క్యాంపెయిన్‌లో దూసుకుపోయారు. నామినేషన్ల సందర్భంగా భారీ ర్యాలీలు నిర్వహించిన వారు అంతకు ముందు, తర్వాత కూడా వీలైనంత ఎక్కువసంఖ్యలో కుటుంబాలను కలిసి ఓటు అభ్యర్థించేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. అలాగే కొంతమంది సమయం సరిపోక రోడ్డుషోలు, గ్రూపు మీటింగ్‌లు నిర్వహించగా రంగంలో ఉన్న అభ్యర్థుల కుటుంబ సభ్యులు, అలాగే ద్వితీయ, తృతీయశ్రేణి నేతలు గ్రామాలు, పట్టణాల్లో వార్డులు చుట్టేశారు. అలా దాదాపు నెలన్నర రోజుల పాటు జిల్లాలో ఏ ప్రాంతంలో చూసినా పసుపు సైన్యం, వారికి మద్దతుగా జనసేన, బీజేపీ శ్రేణులు నిత్యం ఎన్నికల ప్రచారంలో ప్రజల మధ్యనే కనిపించారు. అదే సమయంలో ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థులు చాలాచోట్ల ఈ విషయంలో వెనుకబడిపోయారు. అభ్యర్థుల ఎంపికలో గందరగోళం, స్థానికులకు కాకుండా పొరుగు ప్రాంతాల వారిని నిలపడంతో క్షేత్రస్థాయి పరిస్థితులను అర్థం చేసుకోవడానికి స్థానిక నేతలను సమన్వయం చేసుకోవడానికి వారు అవస్థలు పడాల్సి వచ్చింది. దీంతో ఎన్నికల ప్రచారంలో చాలాచోట్ల వెనుకబడిపోయారు

జిల్లాను చుట్టేసిన అగ్రనేతలు

ఇదిలాఉండగా జిల్లాలో టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా కూటమి అగ్రనేతలు ప్రచారంలో పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాలుగుచోట్ల సభలకు హాజరయ్యారు. అనూహ్యంగా మార్కాపురం నియోజకవర్గంలోని మార్కాపురం, పొదిలి రెండు సభలకు హాజరుకావడమే కాక పొదిలి పక్కనే ఉన్న దర్శిలో మరుసటిరోజే వచ్చారు. అయినా భారీ స్పందన లభించగా ప్రచారం ముగింపునకు ఒక రోజు ముందు రాత్రి ఒంగోలులో రోడ్డుషోలో పాల్గొని కేడర్‌ను ఉత్సాహపరిచారు. ఇక పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రాష్ట్రవ్యాప్త యువగళం కార్యక్రమాన్ని తొలుత ఒంగోలులో నిర్వహించగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గిద్దలూరు సభలో పాల్గొన్నారు. అలాగే సినీ హీరో, టీడీపీ నేత నందమూరి బాలకృష్ణ కొండపి నియోజకవర్గం మర్రిపూడి, ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ కేంద్రంలో జరిగిన సభలకు హాజరయ్యారు. మిగతా ప్రచారం అంతా పోటీలో ఉన్న అభ్యర్థులే ప్రధానంగా కొనసాగించగా టీడీపీ కేడర్‌తో పాటు జనసేన, బీజేపీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఈనెల 13న జరగనుండటంతో అందుకు సంబంధించిన ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నమయ్యారు. పోలింగ్ 13వతేదీ ఉదయం 7గంటలకు ప్రారంభం కానుంది. దీంతో ఆదివారం సాయంత్రానికే ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని, పోలింగ్ మెటీరియల్‌ను చేర్చాలని నిర్ణయించారు. తదనుగుణంగా ఆయా నియోజకవర్గాల వారీ సామగ్రి పంపిణీ ఏర్పాట్లు చేసి ఉదయాన్నే పోలింగ్‌కు నియమితులైన వారిని అక్కడికి రావాలని ఆదేశించారు. వారి కోసం ప్రత్యేక బస్సులను కూడా ఏర్పాటు చేశారు. మరోవైపు శనివారం సాయంత్రంతో ప్రచారం ముగియగా పోలింగ్ ప్రక్రియ పూర్తికి 48 గంటల ముందు ప్రత్యేక చర్యలను చేపట్టారు. ప్రధానంగా ఎన్నికల కమిషన్ ఆదేశాలతో మద్యం దుకాణాలను బంద్ చేశారు. రెండురోజుల పాటు మద్యం అందుబాటులో ఉండే అవకాశం లేదన్న విషయాన్ని గుర్తించిన మందుబాబులు శనివారం బాటిళ్ల కోసం దుకాణాల ముందు బారులు తీరారు. మండుతున్న ఎండల్లో సైతం వారు కొనుగోలుకు క్యూలు కట్టగా అధికశాతం షాపులలో మధ్యాహ్నంకే అమ్మకాలు నిలిచిపోయాయి. అలాగే పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు, ఇతరత్రా చర్యలను అధికారులు చేపట్టారు.

ఆఖరిరోజు అదిరింది!

భారీ ర్యాలీలు, విస్తృత ప్రచారంలో తూర్పు ప్రాంత టీడీపీ అభ్యర్థులు
గ్రామస్థాయి నేతలతో పశ్చిమ అభ్యర్థులు బిజీబిజీ

సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారంతో ముగియగా చివరి రోజున కూడా జిల్లాలో పోటీలో ఉన్న అభ్యర్థులు జోరు కొనసాగింది. తూర్పు ప్రాంత అభ్యర్థులు ఉదయం నుంచి


దర్శిలో శనివారం సాయంత్రం కూటమి అభ్యర్థి లక్ష్మి నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

ప్రచార సమయం ముగిసే వరకు భారీ ర్యాలీలు ఇతర రూపాలలో విస్తృత ప్రచారంలో పాల్గొన్నారు. పశ్చిమప్రాంత అభ్యర్థులు ఆ ప్రక్రియను అంతకు ముందే పూర్తి చేసి చివరిరోజున గ్రామస్థాయి నాయకులతో పోలింగ్ నిర్వహణకు సంబంధించి మంతనాలలో బిజీబిజీగా గడిపారు. దాదాపు 50 రోజుల పాటు మండేఎండను సైతం పట్టించుకోకుండా ప్రచారపర్వంలో సాగిన వారు చివరి రోజున కూడా అదే జోష్‌లో గడిపారు. ఒంగోలు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ గత రాత్రి ఒంగోలులో బస చేసిన పార్టీ అధినేత చంద్రబాబుకు శనివారం వీడ్కోలు పలికిన అనంతరం రూరల్ మండలంలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. సాయంత్రం ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, దామచర్ల కలిసి ఒంగోలులోని గాంధీరోడ్డులో భారీ ర్యాలీ నిర్వహించారు. కొండపి అభ్యర్థి డాక్టర్ స్వామి పొన్నలూరు మండలంలో విస్తృతంగా పర్యటించగా మాగుంట తనయుడు రాఘవరెడ్డి పాల్గొన్నారు. ఎస్ఎన్‌పాడు టీడీపీ అభ్యర్థి బీఎన్ విజయకుమార్ ఉదయం చీమకుర్తి మండలంలో, సాయంత్రం ఎన్‌జీపాడు మండలం పోతవరంలో ప్రచారంలో పాల్గొన్నారు. దర్శి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ముండ్లమూరు మండలంలో ప్రచారం నిర్వహించగా సినీ హీరో శివాజీ పాల్గొని సంఘీభావం తెలిపారు. సాయంత్రం దర్శిలో ర్యాలీ నిర్వహించి ప్రచారం ముగించారు. ఇక ఇప్పటికే ప్రచార కార్యక్రమాలను ముగించిన పశ్చిమ ప్రాంతంలో కనిగిరి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, వైపాలెం అభ్యర్థి ఎరిక్షన్‌బాబు, మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి , గిద్దలూరు అభ్యర్థి అశోక్‌రెడ్డిలు సోమవారం జరగనున్న పోలింగ్‌పై దృష్టిసారించారు. అందుకోసం వివిధ గ్రామాల నేతలతో మంతనాలతో బీజీబీజీగా కనిపించారు. కాగా పోటీలో అభ్యర్థులకు మద్దతుగా వారి వారి కుటుంబసభ్యుల ప్రచారం చివరి రోజైన శనివారం కూడా జోరుగానే సాగింది.

ఒంగోలు లోక్‌సభలో రసవత్తర పోటీ

అభ్యర్థుల భిన్న మనస్తత్వాలపై విస్తృత చర్చ
సేవా కార్యక్రమాలు, మంచితనం మాగుంటకు వరం
రాజకీయ, వ్యక్తిగత జీవితంపై ఆరోపణలు చెవిరెడ్డికి ప్రతిబంధకాలు
ప్రచారంలో దూసుకుపోయిన స్థానిక ఎంపీ
ప్రలోభాలకు ప్రాధాన్యత ఇచ్చిన వైసీపీ అభ్యర్థి
ఉద్యోగులు, వ్యాపారులు, తటస్థులలో పెరిగిన కూటమి బలం

(ఆంధ్రజ్యోతి ఒంగోలు)

ఒంగోలు లోక్‌సభ స్థానంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య పోటీ రసవత్తరంగా మారింది. టీడీపీ కూటమి అభ్యర్థి, స్థానిక ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిల భిన్న మనస్తత్వాలపై ప్రజల్లో విసృత చర్చ సాగుతోంది. మంచితనం, సేవా కార్యక్రమాలు, విస్తృత పరిచయాలు ఎంపీకి వరంగా కనిపిస్తున్నాయి. వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి స్థానికేతరుడు కావడం ప్రజలే కాక కనీసం ఆ పార్టీ శ్రేణులకు పరిచయస్థుడు కాకపోవడం వాటికి మించి ఆయన రాజకీయ, వ్యక్తిగత జీవితంపై తీవ్ర ఆరోపణలు ఉండటం ప్రతిబంధకాలుగా కనిపిస్తున్నాయి. 1991 నుంచి మాగుంట కుటుంబం ఇక్కడ రంగంలోకి వచ్చినాటి నుంచి ఎనిమిది సార్లు ఎన్నికలు జరగగా ఆరుసార్లు వారే గెలుపొందారు. అందులో ప్రస్తుత టీడీపీ అభ్యర్థి శ్రీనివాసులరెడ్డి నాలుగు సార్లు గెలుపొందారు. ఇక్కడ మరో ప్రధానాంశం మాగుంట కాంగ్రెస్, వైసీపీ తరపున మంచి అధిక్యతతో గెలుపొందారు. 2009లో 50వేలు, 2019లో 2.14లక్షల అధిక్యతతో వైసీపీ తరపున గెలుపొందారు. 2014లో ఆయన టీడీపీ పక్షాన పోటీచేయగా కేవలం 15,559 ఓట్ల తేడాతో ఓడిపోవడం గమనార్హం. కాగా వివిధ రకాల అంశాలు ప్రస్తుతం టీడీపీ కూటమికి అనుకూలంగా మారగా వైసీపీ ఎదురీత పరిస్థితులు నెలకొన్నాయి.


మాగుంట శ్రీనివాసులరెడ్డి


చెవిరెడ్డి భాస్కరరెడ్డి

విభిన్న మసతత్వాలపై చర్చ

ఈదశలో తజా పరిస్థితులు పరిశీలించగా ప్రధాన పోటీ అభ్యర్థులైనా మాగుంట, చెవిరెడ్డిల విభిన్న మనస్తత్వాలపై ప్రజల్లో విస్తృత చర్చ సాగింది. ఈచర్చలో అనేక అంశాలలో మాగుంట పట్ల సాకూలత ప్రజలలో వ్యక్తమవుతుంది. గెలుపోటములకు అతీతంగా 33ఏళ్లుగా ఆ కుటుంబం ఒంగోలు లోక్‌సభను అంటిపెట్టికొని రాజకీయం చేయడం అందులో ప్రధానాంశం. ఇక వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి విషయానికొస్తే ప్రజలతో కాని, శ్రేణులతోగాని కనీస పరిచయాలు లేవు. జగన్ ఎక్కడ ఉంటే అక్కడ ఉంటానని చెబుతున్నారే తప్పా స్థానికంగా ఉంటాననే చెప్పలేకపోయారు. వ్యాపార అంశాలను పక్కనబెడితే రాజకీయం, వ్యక్తిగతంగా మాగుంట ఎలాంటి ఆరోపణలు లేవు. అదే చెవిరెడ్డి విసయానికొస్తే ఆయన రాజకీయ, వ్యక్తిగత జీవితం అనేక ఆరోపణలతో నిండిపోయింది. ఎర్ర చందనం స్మగ్లరనే ప్రచారం ప్రజల్లో బలంగా ఉంది.

ప్రచారంలోను తేడానే..

ఎన్నికల ప్రచారంలోను చెవిరెడ్డి, అసెంబ్లీ అభ్యర్థుల ప్రచారంపైనే ఆధారపడ్డారు. మాగుంట వైపు నుంచి చూస్తే ఆయన కుటుంబసభ్యులు, అన్ని నియోజకవర్గాలను జల్లెడపట్టారు. ఇంకా ఆయన కుమారుడు రాఘవరెడ్డి ముందు నుంచి వ్యూహాత్మకంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. అటు శ్రేణులను సమన్వయం చేసుకోవడంలోనూ మాగుంట సఫలీకృతులయ్యారు. చెవిరెడ్డి విషయానికొస్తే సీఎం జగన్ పాల్గొన్న సభల్లో కనిపించడం, అడపాదడపా పార్టీశ్రేణుల పరిచయ సమావేశాలకే పరిమితమయ్యారు. అంతకుమించి ఆయన వ్యక్తిగత సిబ్బంది పోకడలు గ్రామాల్లో, ప్రజల్లో వ్యతిరేకతకు కారణమయ్యాయి. ఓటర్లను ప్రభావితం చేసేందుకు హవాలా మాదిరిగా బియ్యం పంపిణీ, వలంటీర్లకు నగదు పంపిణీ, చివరికి జర్నలిస్టులకు గిఫ్ట్‌ల పంపిణీలాంటి కార్యక్రమాలతో సాధారణ ప్రజల్లో కూడా చెడ్డపేరు తెచ్చుకున్నారు.

ఇటు స్థానికులు.. అటు బయటివారు

ఈ సందర్భంగా లోక్‌సభలో తాజాగా నెలకొన్న పరిస్థితులను పరిశీలిస్తే.. అనేక అంశాలు టీడీపీ కూటమికి సానుకూలంగా వైసీపీకి ప్రతిబంధకాలుగా మారాయి. టీడీపీ కూటమి అభ్యర్థులు దర్శిలో మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో స్థానిక ప్రజలతో మమేకమై ముందు నుంచి పనిచేస్తున్న వారే. వైసీపీ విషయానికొస్తే ఒంగోలు, దర్శిలో మాత్రమే స్థానికులతో పరిచయం ఉన్న అభ్యర్థులను రంగంలో దింపింది. కనిగిరిలో స్థానికుడైనప్పటికీ ప్రజాసంబంధాలు లేని భూఆరోపణలు ఉన్న అభ్యర్థిని వైసీపీ పోటీపెట్టింది. కొండపి, వైపాలెం, మార్కాపురం నియోజకవర్గాల్లో స్థానికేతరులను వైసీపీ రంగంలోకి దించింది. మార్కాపురం అభ్యర్థి ప్రస్తుతం స్థానికుడినని చెప్పుకున్న నిన్నమొన్నటి వరకు గిద్దలూరు స్థానిక నియోజకవర్గంగా చెప్పుకున్నారు.

దర్శిలో కొత్తగా టీడీపీ అభ్యర్థి రంగంలోకి వచ్చిన మహిళ కావడం, డాక్టర్ వృత్తిలో ఉండటం, ప్రజలతో మమేకమయ్యే చొరవ ఉండటంతో ప్రజల్లో దూసుకెళ్తున్నారు. గత ఎన్నికల్లో వైసీపీకి మంచి అధిక్యతను ఇచ్చిన పశ్చిమ ప్రాంతంలో టీడీపీ నుంచి నువ్వానేనా అన్న స్థాయిలో పోటీపడుతుంది. ఈ దశలో ఎంపీ అభ్యర్థిగా మాగుంట రావడంతో ప్రభుత్వ వ్యతిరేకత అన్నింటికి మంచి స్థానికంగా జరగని అభివృద్ధి, వైసీపీకి శాపంగా మారాయి.

బృందావనంలో బాబు సందడి


అధినేతను కలిసిన టీడీపీ నాయకులు



ఒంగోలు (కార్పొరేషన్), మే 11 : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఒంగోలులోని బృందావనం ఫంక్షన్ హాలులో సందడి చేశారు. శుక్రవారం ఒంగోలులో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయన రాత్రికి నగర సమీపంలోని బృందావనం ఫంక్షన్ హాలులో బస చేశారు. శనివారం ఉదయం 11.10 గంటలకు ఇక్కడి నుంచి బయల్దేరి ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు చిత్తూరు జిల్లాకు వెళ్లారు. అంతకుముందు టీడీపీ కూటమి అభ్యర్థులు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్, గూడూరి ఎరిక్షన్‌బాబుతోపాటు దామచర్ల సత్య, పలువురు ముఖ్యనాయకులు, పార్టీ శ్రేణులు చంద్రబాబును కలిశారు.

కాయ్ రాజా కాయ్..!

చీరాల, మే 11 : ప్రచారం పర్వం ముగిసింది. పందేల పర్వం ప్రారంభమైంది. ఎన్నికల వేళ పోటీలో నిలిచిన అభ్యర్థులు గెలుపునకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఇదిలావుంటే ఆయా అభ్యర్థుల గెలుపు, ఓటములు, మెజార్టీపై పందేలు కాసేందుకు కాయ్ రాజా కాయ్ అంటూ కొందరు ముందుకొస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. బాపట్ల పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల్లో ఎంత మంది బరిలో ఉన్నా చీరాల మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో ద్విముఖ పోటీ ప్రధానంగా కనిపిస్తోంది. అయితే చీరాలలో త్రిముఖ పోటీ ఉంది. ఈ పోటీకి సంబంధించి ప్రధాన రాజకీయపార్టీల నుంచి బరిలో నిలిచిన అభ్యర్థుల పార్టీల బలాబలాలతో పాటు వ్యక్తిగత చరిష్మాపై కూడా జోరుగా చర్చ సాగుతోంది. దీంతో రాజకీయ విశ్లేషకులు ఆయా అభ్యర్థుల గెలుపోటములపై కూడికలు, తీసివేతలతో బిజీగా ఉన్నారు. ఆయా కూడికలు, తీసివేతల గణాంకాలు తమ ఆలోచనలకు, అంచనాలకు దగ్గర ఉన్నవారు తాము నిర్ణయించుకున్న అభిప్రాయంపై పందేలు ఎవరన్నా కాస్తారా, వస్తే ముందుకు రావచ్చని ఆశారామన్న సందేశాలను నోటి మాటల ద్వారా వైరల్ చేస్తున్నారు. పందేంకు సిద్ధమని కబురుచేసే వారి అంచనాలకు విరుద్ధంగా ఉన్నవారు కొందరు పందేలకు మొగ్గ చూపుతున్నట్లు సమాచారం.



రూ.1,42 లక్షల నగదు స్వాధీనం

కొండపి, మే 11: మండలంలోని తాటాకులపాలెం గ్రామంలో ఉప్పుటూరి రవితేజ అనే యువకుడి వద్దనుంచి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి జంగం అజయ్ ఆధ్వర్యంలో సిబ్బంది 1, 42, 500 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. శనివారం సాయంత్రం రవితేజ దగ్గర డబ్బు ఉండటంతో పట్టుకుని నిందితుడిని కొండపి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రవితేజ మాత్రం డబ్బులు మిరప కాయలు అమ్మగా వచ్చాయని పోలీసులకు వివరించారు. కాగా అధికార పార్టీ తరుపున నగదు పంచుతూ అధికారులను చూసి ఇద్దరు పారిపోయారని, రవితేజను అదుపులోకి తీసకున్నారని మరో పక్క సమాచారం.

పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు

ఎస్పీ వకుల్‌జిందాల్

అద్దంకి, మే 11 : ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌లలో ఏర్పాట్లను శనివారం ఎస్పీ వకుల్‌జిందాల్ పరిశీలించారు. జిల్లాలో మొత్తం 1510 పోలింగ్ కేంద్రాలు ఉండగా 269 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకవిగా గుర్తించినట్లు తెలిపారు. పోలింగ్ బూత్‌లో వెబ్‌కాస్టింగ్, లైటింగ్ ఏర్పాట్లు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంల రవాణా సమయంలో, పోలింగ్ సమయంలో ఎవరైనా గొడవలు చేసినా, పోలింగ్ సిబ్బంది పై అనుచితంగా వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవని తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఎన్నికలు ముగిసేంతవరకు 48 గంటల పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అభ్యర్థి ఇంటింటి ప్రచారం నిర్వహించుకోవచ్చని, అభ్యర్థితోపాటు 5 గురు కంటే ఎక్కువ మంది ఉంటే చర్యలు తప్పవన్నారు. పోలింగ్ కేంద్రం నుంచి 200 మీటర్ల పరిధిలో ఓటర్లు మా త్రమే ఉండాలన్నారు. ఓటింగ్ విధానాన్ని పరిశీలించేందుకు అభ్యర్థిని మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి అనుమతి ఉంటుందన్నారు. మద్యం, నగదు పంపిణీ చేస్తుంటే సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్, అద్దంకి టౌన్ సీఐ కృష్ణయ్య ఉన్నారు.

ప్రశాంత ఎన్నికలకు


రావినూతలలో పోలింగ్ స్టేషన్ వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

అందరూ సహకరించండి

మేదరమెట్ల : బాపట్ల జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి అందరు సహకరించాలని బాపట్ల ఎస్పీ వకూల్ జిందాల్ తెలిపారు. శనివారం పమిడిపాడు, రావినూతల, మేదరమెట్ల గ్రామాలల్లో పోలింగ్ స్టేషన్‌లను చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్‌లకు చుట్టూ ప్రహరీ గోడలు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. విద్యుత్, ఇంటర్‌నెట్ సౌకర్యం ఉందా లేదా అని పంచాయతీ అధికారులను అడిగారు. ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా మంచినీరు వంటి సౌకర్యాలను కల్పించాలన్నారు. క్యూలైన్‌లో నిలబడే ఓటర్లకు టెంట్‌లు వేసి నీడను కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు.

అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లా మొత్తంలో 916 పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయని, అందులో 269 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామన్నారు. ఎన్నికల సందర్భంగా పోలింగ్ స్టేషన్‌ల వద్ద శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే క్విక్ రెస్పాన్స్, స్ట్రైకింగ్ ఫోర్స్ చర్యలు తీసుకుంటుందన్నారు. ఎస్పీ వెంట అద్దంకి రూరల్ సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్‌బీ సీఐ శ్రీనివాసరావు, కొరిశపాడు ఎస్ఐ శివయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చినగంజాం : మండలంలోని కడవకుదురు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం పరిశీలించారు. కడవకుదురులోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రం 268ని ఆయన పరిశీలించి, అధికారులకు పలు సూచనలు అందజేశారు.

గత ఎన్నికల సమయంలో ఏమైనా గొడవలు జరిగాయా అని ఎస్ఐ ఎం.శ్రీనివాసరావుని ఆయన ప్రశ్నించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద లైటింగ్, షామియాలు, బారికెడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్, ఇంకొల్లు సీఐ శ్రీనివాసరావు, బూత్ లెవల్ అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరులో

మండలంలోని చందలూరు, నూజెళ్లపల్లి గ్రామాలలోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు.

ఆంధ్రజ్యోతి
5 శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
ఆదివారం 12 మే 2024

పోలింగ్‌కు సర్వం సిద్ధం
• కందుకూరులో 55 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు
• కందుకూరు సబ్‌కలెక్టర్ విద్యాధరి వెల్లడి
7

మైకుల మూగనోము..
కరెన్సీ కట్టలకు కాళ్లు !

• పార్టీల ప్రచారాలకు ఫుల్‌స్టాప్ • బహిరంగంగానే నగదు పంపిణీ

• పోల్ మేనేజ్‌మెంట్‌పై నేతల దృష్టి

నెల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. సుమారుగా యాభై రోజులకు పైగా సాగిన రాజకీయ పార్టీల ప్రచారాలకు శనివారం సాయంత్రం 6 గంటలతో గడువు ముగిసింది. ఇప్పటి వరకూ జెండాలు చేతబట్టి ఊరూరా తిరిగిన నాయకులు ఇక వారి ఇళ్లకే పరిమితమయ్యారు. మైకులతో హోరెత్తిం చిన ప్రచార రథాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందుగా ప్రచారాలు ఆపేయాల్సి ఉంది. ఈ మేరకు ప్రధాన పార్టీల అభ్యర్థులు చివరిరోజు భారీ రోడ్ షోలు, సభలు ఏర్పాటు చేశారు. తమను గెలిపించాలంటూ చివరి సారిగా ఓటర్లను అభ్యర్థించారు.

• విస్తృత తనిఖీలు

ఎన్నికల విధుల్లోని ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు, ఎంసీఎంసీ బృందాలు ముమ్మరంగా రోడ్లపై తిరుగుతున్నాయి. సాయంత్రం 6 తర్వాత ఎక్కడా ప్రచారం చేయ కుండా చర్యలు తీసుకున్నా యి. కొన్నిచోట్ల వీధుల్లో వివిధ పార్టీల జెండాలు కట్టి ఉండగా, వాటన్నిం టిని తొలగించారు. జిల్లాలో ఉన్న ఇతర ప్రాంతాల వారిని గుర్తించి పంపేసే పనిలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. హోటళ్ల, లాడ్జీలు, కల్యాణమండపాలను విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు.

• జోరుగా నగదు పంపిణీ

అభ్యర్థుల భవితవ్యం తేలేందు కు మరో 24 గంటలు మాత్రమే సమయం ఉండటంతో చివరి ప్రయత్నంగా ఎవరికివారు వ్యూహా లు రచించుకుంటున్నారు. ఇప్పటి వరకూ ప్రచారంలో బిజీబిజీగా గడిపిన అభ్యర్థులు ఇప్పుడు పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టారు. మనకు పడే ఓట్లేవి? అని లెక్కలు వేసుకుంటూనే ప్రత్యర్థి పార్టీల ఓట్లను ఎలా లాక్కోవాలి? అన్న వ్యూహాలకు పదునుపెట్టారు. అందుకు నగదునే ఆయుధంగా ఎంచుకుంటున్నారు. దీంతో అన్ని నియోజకవర్గాల్లో నగదు పంప కాలు శనివారం రాత్రికి ముగిం చారు. ఇంటింటికి వెళ్లి ఓటరు స్లిప్పులు తీసుకోవడం, అక్కడ ఎంతమంది ఉంటే అంతమందికి డబ్బులు అందజేయడం వంటి పనులను క్షేత్రస్థాయి నాయకులు చేస్తున్నారు. ఒక్కో నియోజక వర్గంలో ఓటుకు రూ.1,500 నుంచి రూ.3 వేల వరకూ పంపిణీ చేస్తున్నారు. శనివారం చాలా ప్రాంతాల్లో బహిరంగంగానే ఓటరు జాబితాలను చేతబట్టి నగదు పంపకాలు చేపట్టారు.

ఎన్నికలకు సర్వం సన్నద్ధం

● కందుకూరు సబ్ కలెక్టరు విద్యాధరి



కందుకూరు, మే 11: కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సబ్ కలెక్టరు జి.విద్యాధరి తెలిపారు. శనివారం స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో 271 పోలింగ్ కేంద్రాలలో 55 పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మకంగా గుర్తించి అక్కడ అదనపు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో గొడవలు జరిగి, అత్యధికశాతం పోలింగ్ జరిగిన పోలింగ్ బూత్‌లను, ప్రస్తుతం సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఫిర్యాదులు అందిన పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి సీఆర్‌పీఎఫ్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే 200కి పైగా పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కామ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశామని, అక్కడ ఏమి జరుగుతున్నా సబ్ కలెక్టరు కార్యాలయం నుంచి మానిటర్‌తో పరిశీలించే సదుపాయం ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్‌లు ఏర్పాటు చేయటంతో పాటు ఓటర్లు వెయిట్ చేసేందుకు కుర్చీలు కూడా ఏర్పా టు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో తాగునీటి వసతి, వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వృద్ధులు, వికలాంగులను పోలింగ్ స్టేషన్ వద్దకు తీసుకొచ్చేందుకు ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక వాహనం ఏర్పాటు చేయడంతో పాటు పోలింగ్ స్టేషన్ వద్ద వీల్‌చైర్‌ను కూడా అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. ఓటర్లంతా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో శేషుబాబు

లింగసముద్రం, మే 11 : మండలంలోని వీఆర్ కోట, విశ్వనాథపురం, మాలకొండరాయునిపాలెం, గంగపాలెం, తిమ్మారెడ్డిపాలెం, వెంగళాపురం, లింగసముద్రంలోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో యు శేషుబాబు శనివారం సందర్శించారు. ఆయా కేంద్రాల్లో వసతులు పరిశీలించారు. అన్ని వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ఆదివారం పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలన్నారు. మండలంలోని మిగిలిన పోలింగ్ కేంద్రాలను కూడా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

30,953 మంది ఓటర్లు

మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో 30,953 మంది ఓటర్లు ఉన్నారని తహసీల్దారు జీ.శ్రీచరణ్ చెప్పారు. అందులో పురుషులు 15,526 మంది, మహిళలు 15,427 మంది ఉన్నారని చెప్పారు. అలాగే మండలంలో 38 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు ఎండ వేడిమి తగలకుండా షామియానాలు ఏర్పాటు చేయించినట్టు చెప్పారు.

మాలకొండ ఆదాయం రూ.12,29,635

వలేటివారిపాలెం, మే 11 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.12,29,635 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్‌ల విక్రయం, కుంకుమార్చన, వివాహములు, తలనీలా సమర్పణ, వాహన పూజలు, ప్రత్యేకదర్శనం, స్థలపురాణం పుస్తకాలు విక్రయం, రూములద్దెలు, కవర్లు విక్రయం, లడ్డూప్రసాదం, అన్నదానం, భక్తుల విరాళముల ద్వారా ఈ ఆదాయం లభించినట్లు ఆలయ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా కూలీ మృతి

కావలి రూరల్, మే 11: గుడ్లూరు మండలం పోట్లూరు, గుడ్లూరు మధ్యలో శనివారం ఆటో బోల్తాపడిన ఘటనలో కావలి పట్టణ వెంగయ్యగారిపాలెంకు చెందిన కోరా శ్రీలత(28) అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామస్థుల కథనం మేరకు.. గుడ్లూరు మండలం మాచవరంలో మిరప కాయల కోతకు వెంగయ్యగారిపాలెం నుంచి కూలీలు ఆటోలో బయలుదేరి వెళ్లారు. మార్గమధ్యంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో శ్రీలత అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త క్రాంతి కుమార్, ఇద్దరు పిల్లలున్నారు. ఈ ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన కోరా సంపూర్ణమ్మ తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

టీడీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయండి

● మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాం

కందుకూరు, మే 11: రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో నడుస్తున్న రాక్షస పాలనను అంతమొందించడమే లక్ష్యంగా తెలుగుదేశం కార్యకర్తలతో పాటు ప్రజాస్వామ్యవాదులంతా టీడీపీ కూటమి అభ్యర్థుల విజయం కోసం అంకితభావంతో సమష్టిగా కృషి చేయాలని కందుకూరు మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాం విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావును, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విజయంలో కీలకభూమిక పోషించాలని విజ్ఞప్తి చేశారు. జగన్ పాలనలో రాష్ట్రం 40 ఏళ్లు వెనుకబడిందని, రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చేశాడని, ఏపీ ఆర్థికవ్యవస్థ మళ్లీ గాడినపడాలంటే కనీసం పదేళ్లపాటు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు ఉన్నం నళినీదేవి, పలువురు ఎన్‌ఆర్‌ఐలు పాల్గొన్నారు.

చేతులెత్తి నమస్కరిస్తున్నా..

● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఇంటూరి

ఒక్క అవకాశం ఇవ్వండి



దివివారిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఇంటూరి, దివి



ఇంటూరి సందీప్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలు

కందుకూరు, మే 11: చేతులెత్తి నమస్కరిస్తున్నా.. ఒక్క అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ఓటర్లను కోరారు. మండలంలోని కొండముడుసుపాలెం, మున్సిపాలిటీ పరిధిలోని దివివారిపాలెంలో శనివారం నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్నందున అభివృద్ధికి పక్కా ప్రణాళిక సిద్ధం చేశానని, ప్రజలు తనకు అవకాశం ఇస్తే అందరికీ మంచి జరిగేలా చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లలో వైసీపీ పాలనలో అమరావతిని నాశనం చేసిన ఘనత జగన్మోహనరెడ్డిదని ధ్వజమెత్తారు. సంపూర్ణ మద్యపాన నిషేధం, సీపీఎస్ రద్దు, ప్రత్యేక హోదా, మెగా జాబ్ క్యాలెండర్, 45 సంవత్సరాలకే పింఛన్ లాంటి హామీలన్నింటినీ గాల్లో కలిపేశాడని విమర్శించారు. ఇసుక, గ్రావెల్ దోచుకోవటం, నకిలీ మద్యం, భూకబ్జాలు, హత్యలు, దాడులు, అక్రమ కేసులు జగన్ పాలనలో నిత్యకృత్యమయ్యాయని విమర్శించారు. మంచి మనసు, సేవాగుణం కలిగిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మనకు ఎంపీ అభ్యర్థి కావటం మన అదృష్టమని, సోమవారం జరగబోయే ఎన్నికల్లో ఇద్దరికీ సైకిల్‌గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. ఈ సందర్భంగా దివివారిపాలెం, కొండముడుసుపాలెం గ్రామాలకు చెందిన దివి వెంకటేశ్వర్లు, దివి బ్రహ్మయ్య, దివి కోటేశ్వరరావు, దివి వసంతరావు, మందలపు మాలకొండయ్య, తదితర వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాం, నియోజకవర్గ పరిశీలకురాలు కుసుమ కుమారి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గుడ్లూరులో పలువురు టీడీపీలో చేరిక

గుడ్లూరు మండలకేంద్రానికి చెందిన వైసీపీ నేతలు షేక్ ఖాసింసాహెబ్, డా.సుధీర్, జవాంగుల వీరాస్వామి, శానం రాము, షేక్ మస్తాన్, పఠాన్ కాలేషా, షేక్ జిలాని తదితర కుటుంబాల వారు ఆ పార్టీని వీడి శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. మండల టీడీపీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు ఆధ్వర్యంలో టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు తనయుడు సందీప్ వారికి టీడీపీ కండువాలు వేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు అన్నంగి చలపతి, తెలుగుమహిళ మండల అధ్యక్షురాలు జొన్నలగడ్డ రమణమ్మ, మాజీసర్పంచ్ పారా జనార్దన్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ చెరుకూరి సూర్యనారాయణ, సింగమనేని పద్మ, పారా విష్ణు, షేక్ మహబూబ్ బాషా, మాబాషా, జావిద్, పఠాన్ కాలేషా తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి : సౌజన్య

లింగసముద్రం : ఈ నెల 13వ తేదీ జరగనున్న ఎన్నికల్లో టీడీపీ కూటమి నుంచి పోటీ చేస్తున్న నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావులకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య అభ్యర్థించారు. మండలంలోని మొగిలిచెర్ల, ఎర్రారెడ్డిపాలెం, వెంగళాపురం గ్రామాల్లో శనివారం ఆమె ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు స్వర్ణ చిన్నా, పల్లపోతు వెంగళరావు, అంగుళూరి చిన కొండయ్య, మాజీ వైస్ ఎంపీపీ గోరంట్ల సింహాద్రి, ఎంపీటీసీ వెన్నపూస కృష్ణారెడ్డి, గంగాడి నరసింహం, యు మాధవ, రాజారపు మాలకొండయ్య, లోమడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని మహిళా ఓటర్లను కోరుతున్న సౌజన్య

ఛాలెంజ్ ఓటు అంటే...?



ఓటర్ల జాబితాలో పేరున్నా... ఓటు వేసేందుకు అనర్హుడని రాజకీయపార్టీల ఏజెంట్లు సవాలు చేయడాన్ని ఛాలెంజ్ ఓటు అంటారు. ఓటేయడానికి వచ్చిన ఎవరినైనా పోలింగ్ కేంద్రంలోని ఏజెంట్లు అనుమానించి, ఆ వ్యక్తి నకిలీ అని అభ్యంతరం ప్రకటిస్తారు. అది తన ఓటే అని ఓటేయడానికి వచ్చినవారు చెబితే, ఫిర్యాదు చేసిన ఏజెంటు నుంచి డిపాజిట్‌గా రూ.5 అక్కడి అధికారి తీసుకుంటారు. ఆ తర్వాత ఈవీఎంలో గాక బ్యాలెట్ పేపర్ ఇచ్చి రహస్య పద్ధతిలోనే ఓటేయమంటారు. దాన్ని జాగ్రత్త పరుస్తారు. ఆ ఓటరు నకిలీనో కాదో స్థానిక సిబ్బందితో ప్రాథమిక విచారణ జరిపిస్తారు. అతని పేరు, వయస్సు, తండ్రి పేరు, చిరునామా, ఫోటో తదితర వివరాలు సక్రమంగా ఉన్నాయని నిర్ధారణ అయితే ఆ ఓటును లెక్కింపులోకి స్వీకరిస్తారు. బోగస్ అని తేలితే మాత్రం అధికారులు అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు.

- నెల్లూరు

ఓటర్ స్లిప్పులు ఏవీ!?

- అందరికీ పంచామంటున్న అధికారులు
- ఎక్కువశాతం మందికి అందని వైనం
- సచివాలయాలు చుట్టూ ప్రదక్షిణలు
- బీఎల్వోల కోసం వెతుకులాట

నెల్లూరు(హరనాథపురం), మే 11 : ఓటరుకు తన ఓటు ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు రూపొందించిన ఓటరు సమాచార స్లిప్పులు జిల్లాలో చాలామందికి అందలేదు. అధికారులు మాత్రం జిల్లాలోని లక్షలాది మంది ఓటర్లకు అందచేశామని ప్రకటనలు గుప్పి స్తున్నారు. జిల్లాలో 20 లక్షల మందికి పైబడి ఓటర్లు ఉన్నారు. వారందరికీ ఈ స్లిప్పులు పంపిణీ చేయాల్సి ఉంది. ఓటరు స్లిప్పులో ఓటరుకు తన ఓటు ఎక్కడ ఉంది. ఏ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించు కోవచ్చు. పోలింగ్ బూత్ నంబరు తదితర వివరాలు ఉంటాయి. ఈ స్లిప్పులు అందచేస్తే ఓటరు సులభంగా తన ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది.

తూతూ మంత్రంగా పంపిణీ

కానీ స్లిప్పులు దాదాపుగా చాలామందికి అందలేదని తెలిసింది. అధికారులు కూడా ఈ స్లిప్పుల పంపిణీ విషయం గురించి పత్రికలకు సమాచారం ఇవ్వటం మానేశారు. జిల్లాలోని నియోజకవర్గాల ఆర్వోలు ఏరోజుకారోజు ఈ ఓటరు స్లిప్పుల పంపిణీ సమాచారాన్ని జిల్లా కేంద్రానికి తెలియచేయాల్సి ఉంది. పత్రికలకు సమాచారం ఇవ్వడానికి మీడియా సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ ద్వారా ఓటరు సమాచార స్లిప్పుల వివరాలు మాత్రం అందటం లేదు. జిల్లాలోని ఎన్నికల విభాగం వారు కూడా ఈ స్లిప్పుల విషయం తెలియచేయటం లేదు. ఈనెల 13న సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నాయి. ఈనెల 12వ తేదీ వరకు ఈ స్లిప్పులను పంపిణీ చేసే అవకాశం ఉంది. కానీ ఎక్కడా ఈ కార్యక్రమం వేగంగా జరగటం లేదనేది సమాచారం. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి జిల్లాలోని ఓటర్లకు ఈ స్లిప్పులను పంపిణీ చేయించాలని ఓటర్లు కోరుతున్నారు.

అందుబాటులో లేని బీఎల్వోలు



ఓటర్ స్లిప్పులు బీఎల్వో దగ్గర అందుబాటులో ఉన్నాయని, అతని నెంబరును సంప్రదించి వాటిని పొందాలని పలువురికి సెల్ ఫోన్‌లో మెసేజ్ వచ్చింది. బీఎల్వోల నెంబరుకి ఫోన్ చేయగా, ఎవరూ ఫోన్లు తీయడం లేదు. ఒకవేళ ఫోన్ లిఫ్ట్ చేసినా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. అంతేకాక కొంతమంది బీఎల్వోలు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఉన్నారు. మరి కొందరు అందుబాటులో లేకుండా పోయారు. దీంతో ఓటరు స్లిప్పుల కోసం పలువురు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కాగా వివిధ పక్షాల నాయకులు ప్రచారంలో ఇంటింటా తిరుగుతూ ఓటర్ స్లిప్పులు ఉన్నవారికే నగదు పంపిణీ చేస్తున్నారు. దీంతో ఓటర్ స్లిప్పులకు ప్రాధాన్యత ఏర్పడింది.కాగా ఓటర్ స్లిప్పులు అందనివారు ఇంకా ఎవరైనా ఉంటే వారు కమాండ్ కంట్రోల్ రూమ్ 0861-2349402కు ఫోన్ చేసి అధికారులను సంప్రదించాలి.

ఎన్నికల సిబ్బంది మెనూ ఇదే..!



ఉదయ గిరి : ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి ఈనెల 12, 13వ తేదీల్లో ఇవ్వాల్సిన మెనూను ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు. ఆదివారం సాయంత్రానికి ఎన్నికల సామగ్రితో సిబ్బంది తమ కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారు. అక్కడికి చేరుకోగానే వారికి బోండా లు, గారెలతో అల్పాహారం, మజ్జిగ లేదా టీ ఇవ్వాలి. రాత్రి 7.30 గంటలకు చపాతీ, అన్నం, ఆకుకూర పప్పు, రోటీ, పచ్చడి, టమోటా ఆలుకూర, రసం, పెరుగు, వడియాలు, అరటి పండు ఇవ్వా లి. పోలింగ్ రోజైన సోమవారం ఉదయం నాలుగు న్నర గంటలకు టీ, ఐదు గంటలకు వేడి ఇడ్లీ, గారెలు రెండు, చట్నీ ఇవ్వాలి. 9 గంటలకు ఫ్రూట్స్, మజ్జిగ లేదా కొబ్బరి నీళ్లు, 11 గంటలకు కేక్, టీ, 12.30 గటలకు వెజిటేబుల్ బిర్యానీ, పెరుగన్నం, నిమ్మదబ్బ, మూడు గంటలకు బిస్కెట్లు, టీ లేదా ఫ్రూట్ సలాడ్, ఆరు గంటలకు బోండా, గారెలు, చట్నీ, టీ, మజ్జిగ ఇస్తారు. ఇవన్నీ స్థానికం గా తయారు చేయిం చి వడ్డించాలి. ఒక్కొక్క పోలింగ్ స్టేషన్ పరిధిలో 15 మంది సిబ్బంది కి మెనూ ప్రకా రం భోజనం, అల్పాహారం అందించాలి.

విద్యుత్ సమస్యలకు టోల్‌ఫ్రీ నంబర్లు

నెల్లూరు (జడ్పీ) : పోలింగ్ రోజున (సోమవారం) విద్యుత్ సమస్యలు ఏర్పడకుండా నియోజకవర్గాల పరిధిలో టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేశామని విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్ ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు సిటీ 9440817470, నెల్లూరు రూరల్ 8919987020, కావలి 7901056437, ఆత్మకూరు 9948817160, కోవూరు 9705200708, సర్వేపల్లి 8919987020, ఉదయగిరి 8341726756 నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

నోట్ల కట్టల్లో తరుగు

కలిగిరి : ఓటర్లకు పంపిణీ చేసేందుకు వస్తున్న నగదు కట్టల్లో తరుగు ఉండటంతో గ్రామస్థాయి నాయకులు తల పట్టుకుంటున్నారు. కలిగిరి మండలంలో ఈ పరిస్థితే తలెత్తింది. పెద్ద తలకాయల నుంచి ప్రత్యేక ప్యాకింగ్‌లో వచ్చిన డబ్బు లెక్క విషయంలో తేడాలు వచ్చేసరికి గ్రామస్థాయి నాయకులు లబోదిబోమంటున్నారు. ఓ నాయకుడు తనకు వచ్చిన రూ.5 లక్షల ప్యాకింగ్ విప్పి లెక్కపెట్టే సరికి ప్రతి రూ.50వేల కట్టలో 3 నుంచి 4వేలు తక్కువగా వచ్చాయని వాపోయారు. మిగిలిన చోట్లా ఇదే పరిస్థితి ఉండటంతో ఏం చేయాలో అర్థంకాక, ఎవరికి చెప్పుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.





ఏలిక ఎన్నిక రేపే !

- అందరం ఓటు హక్కు వినియోగించుకుందాం..
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- ఏర్పాట్లన్నీ పూర్తి..
- విధుల్లో 14,687 మంది సిబ్బంది
- 70 శాతం కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్
- ప్రశాంత ఎన్నికలకు సహకరించండి : ఎస్పీ

నెల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : 'ఓటు గొప్పదనాన్ని, ఆవశ్యకతను ప్రతి పౌరుడూ గుర్తించాలి. సోమవారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొని బాధ్యత నెరవేర్చుకోవాలి' అని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ పిలుపునిచ్చారు. శనివారం నెల్లూరులోని కలెక్టరేట్ ఆవరణలో ఉన్న తిక్కన ప్రాంగణంలో ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌తో కలిసి కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. వెంకటగిరిలోని మూడు మండలాలను కలుపుకొని జిల్లాలో 20,61,822 మంది ఓటర్లు ఉన్నారని, వీరి కోసం 2,470 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కేంద్రాల్లో 14,687 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 12వ తేదీన వీరందరినీ 638 వాహనాల్లో నిర్దేశించిన రూట్లలో పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుస్తామని వివరించారు. ఈ సిబ్బందికి అదనంగా రిజర్వులో మరో 2,873 మంది అందుబాటులో ఉన్నారని చెప్పారు. వేసవి దృష్ట్యా కేంద్రాల వద్ద చలువ పందిళ్ల ఏర్పాటుతోపాటు మంచినీరు, మరుగుదొడ్ల వసతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 70 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 432 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి, అదనపు బలగాలతో ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. కాగా శనివారం సాయంత్రం 6 గంటలతో ప్రచారాల గడువు ముగిసిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఓటరు కాని వ్యక్తులు ఇక్కడ ఉండడానికి వీల్లేదని, వారంతా వెళ్లిపోవాలని సూచించారు. జిల్లాలో 144 సెక్షన్ అమల్లోకి వచ్చిందని, నలుగురు కన్నా ఎక్కువగా గుంపుగా ఉండడానికి వీల్లేదని సూచించారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు డ్రై డే పాటించాల్సి ఉటుందని, ఈ సమయంలో మద్యం దుకాణాలు, బార్లకు సీల్ వేశామని చెప్పారు. ఇక ఇప్పటి వరకూ రూ.5.53 కోట్ల విలువైన నగదు, లిక్కర్, వస్తువులు, ఆభరణాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. అందులో రూ.2.57 కోట్ల నగదు, రూ.1.75 కోట్ల విలువ చేసే 27 వేల లీటర్ల లిక్కర్ ఉన్నాయని వివరించారు. ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంత ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. ఎవరైనా ఓటర్లను ఇబ్బంది పెట్టినట్లు తమ దృష్టికి వస్తే వారిపై తీవ్రచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నారన్న సమాచారంతో ఇప్పటికి మూడు కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మీ బానిసత్వాన్ని మీరే పోగొట్టుకోవాలి. దేవుడి మీద కానీ, మహానుభావులపై కానీ ఆధారపడవద్దు.

- డాక్టర్ బీఆర్ అంబేద్కర్

ప్రజాస్వామ్యం అనేది సామ్యవాదానికి రహదారి

- కార్ల్‌మార్క్స్

అభ్యర్థి ఏపార్టీ వాడు కాదు... ఏ పాటివాడో చూడు. ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు.. ఇప్పటి దాకా ఏం చేశాడో చూడు..పెట్టుకునే టోపీ కాదు పెట్టిన టోపీ చూడు..

- కాళోజీ నారాయణరావు

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు. ఈ హక్కు లేకపోతే సచ్ఛీలురైన పాలకులను ఎన్నుకోలేరు. యువత ఓటు విలువ తెలుసుకోకుంటే గెలిచేది రూ.కోట్లు పోసి ఓట్లుకొనే అవినీతిపరులే. అలాంటివారు చట్టసభలకు వెళ్తే సుపరిపాలన అందదు. అందుకే ఓటు వేసి మంచి నేతలను ఎన్నుకునే సువర్ణావకాశాన్ని జారవిడుచుకోవద్దు. రండి...కదలిరండి...! సోమవారం (ఈనెల 13న) జరిగే ఎన్నికల్లో ఓటు సత్తా చాటుదాం. ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా నిబద్ధతతో పాలకులను ఎన్నుకుందాం..

పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలు

- ర్యాంపు, చక్రాలబండి, వలంటీర్లు, చూపులేని ఓటర్ల కోసం సహాయానికి అనుమతి
- ఓటు వేయడంలో అసామర్థ్యాల వ్యక్తులకు, వయో వృద్ధులకు ప్రాధాన్యం
- ఈవీఎంలపై బ్రెయిలీ సదుపాయం
- పురుషులు, మహిళలకు ప్రత్యేక క్యూలైన్లు
- ఒక పురుష ఓటరు, ఇద్దరు మహిళా ఓటర్లకు పోలింగ్ స్టేషన్‌లోకి ప్రవేశం
- గుర్తించిన ప్రదేశాల్లో మహిళలకు మాత్రమే పోలింగ్ కేంద్రం
- ఓటర్లకు ఫొటో ఓటరు స్లిప్‌లు
- ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు సహాయ బూత్
- పోలింగ్ కేంద్రంలో తాగునీరు, అత్యవసర చికిత్స సదుపాయం, మరుగుదొడ్లు
- అసామర్థ్యాలున్న వ్యక్తులకు ఉచిత రవాణా

ఓటే వజ్రాయుధం!

ఓటుహక్కుపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఎన్నికల సంఘం(ఈసీ) ఆధ్వర్యంలో పనిచేస్తున్న సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(ఎస్‌వీఈఈపీ-స్వీప్) విశేషంగా కృషి చేస్తోంది. ఓటుహక్కు నమోదు నుంచి మార్పు, చేర్పులు, సవరణలు, ఇతర సమస్యలపై క్షేత్రస్థాయిలో వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నది. ఎన్నికల్లో ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. ఎన్నికల కేంద్రాల్లో ఏర్పాట్లు, ఈవీఎంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల కోసం ఈసీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

తలరాతలు మార్చే అస్త్రం

ప్రజలు మెచ్చిన నేతను ఎన్నుకునే సమయం ఆసన్నమైంది.నేతల తలరాతలు మార్చేందుకు ఓటు అనే వజ్రాయిధం మన చేతిలో ఉంది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం ఓటు హక్కు కల్పించింది. దీన్ని సరైన రీతిలో సద్వినియోగం చేసుకోవాలి. ప్రజలు ఓటు వేస్తేనే ఎమ్మెల్యే, ఎంపీ, సీఎం, పీఎంలుగా అవుతారు. అంతటి గొప్ప అవకాశం కల్పించింది మన రాజ్యాంగం. వ్యక్తుల అస్తిత్వానికి, వ్యవస్థల్లో మార్పుకు నాంది పలుకుందని ఓటు. కావున ప్రతి ఓటరూ ఈ విషయాన్ని గుర్తించి నిజాయితీగా ఓటును సద్వినియోగం చేసుకోవాలి..


హక్కు నిలబెట్టుకోండి..

రానున్న ఎన్నికల్లో మీ హక్కును నిలబెట్టుకోండి. సాధారణంగా చాలామంది తమ ఓటు లెక్కలోకి రాదులే అనుకుంటారు. మరికొందరు నేను ఒక్కడినే ఓటు వేయకుంటే ఏమవుతుందిలే.. అంటుంటారు. లేదా ఎన్నికల రోజు సెలవు కాబట్టి కుటుంబంతోనో.. స్నేహితులతోనో కాలక్షేపం చేస్తుంటారు. మరికొంతమంది సరైన అభ్యర్థి లేకపోవడం ఓటు వేయలేదని నిరాశగా చెబుతుంటారు. ఈ కారణాలన్నీ కూడా ఓటరు తమ హక్కును కోల్పోతున్నాడని తెలియచేస్తాయి. ఒక నియోజకవర్గంలో సరాసరిన 54శాతం మంది మాత్రమే ఓటు వేస్తున్నట్లు గణాంకాలు చెబుతు న్నాయి. ఇందులో గెలిచే పార్టీ 16 నుంచి 20శాతం మాత్రమే ఓట్లను పొందుతుంది. ఆ పార్టీ గెలిచే ఓట్ల శాతం 5శాతం కంటే తక్కువే ఉంటుంది. దీనివల్ల గెలిచిన అభ్యర్థికి ఓటర్లపై చులకనభావం ఏర్పడుతుంది. ఈ విధానంలో మార్పు రావాలంటే ప్రతి ఒక్కరూ ఓటుహక్కును కచ్చితంగా వినియోగించుకోవాలి.

తొలి పదిమందిలోనే మనం

ఓటుకు వెళ్లాలని ఉదయాన్నే నిద్రలేవాలి. పోలింగ్ బూత్‌కు వెళ్లి ముందు వరుసలో నిల్చుని హక్కును వినియోగించుకోవాలి. తొలి పది మందిలో మనమే ఉందాం...ఓటు తర్వాతే మిగిలిన పనులు చేసుకుందాం.. అనుకుం దాం... పోలింగ్ శాతం గణనీయంగా పెరగడానికి ఉదయం 7 గంటల నుంచే ఓటు వేసేలా అధికారులు చేసిన ఏర్పాట్లను సద్వినియోగం చేసుకోవాలి.ఓటు వేయడానికి 11 గంటల సమయం ఉంటుంది. ఉదయం ఏడు గంటల నుంచి ఓటు వేయవచ్చు. దీన్ని కూడా కాదని అవకాశం కోల్పోయి అశ్రద్ధ చేయడం, ఇతర కారణాలతో ఆఖరి నిమిషంలో వచ్చి ఓటు వేయడానికి వరుసలో నిల్చోలేని పరిస్థితులు తెచ్చుకోవద్దు.

- నెల్లూరు (విద్య)



ఓటు వేసేముందు జాగ్రత్తలు

చరవాణి సహా ఏ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పోలింగ్ కేంద్రంలోకి అనుమతించరు.. ● వరసలో నిలబడి మీ గుర్తింపు కార్డును, ఓటర్ చీటీని, సిద్ధంగా ఉంచుకోండి. ● ఓటు వేయడానికి ఈవీఎంపై మీట నొక్కండి.అనంతరం బీప్ ధ్వని వినిపిస్తుంది. ఎంపిక చేసుకున్న అభ్యర్థి పేరు, గుర్తుకు ఎదురుగా ఎర్రలైటు వెలుగుతుంది. ● పైన చూపించిన విధంగా ఎంపిక చేసు కున్న అభ్యర్థి క్రమ సంఖ్య, పేరు గుర్తుకు ఎదురుగా ప్రింటర్ ఒక బ్యాలట్ స్లిప్‌ను వీవీప్యాట్ ముద్రిస్తుంది. యం త్రానికి చెందిన అద్దంలో నుంచి ప్రింట్ చూడండి. 7 సెకన్లు ఉంటుంది.(ప్రింట్ ఇవ్వరు).


- నేతల తలరాత మార్చే అస్త్రం
- వ్యవస్థల మార్పునకు పునాది
- యువత మేల్కొనాలి..
- హక్కు వినియోగానికి సిద్ధం కావాలి
- నిజాయతీ గల నేతను ఎన్నుకోవాలి
- రేపు పోలింగ్ బూత్‌కు తరలిరండి !

కావాల్సిన గుర్తింపు పత్రాలు

పాస్‌పోర్టు, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఫొటో ఉన్న సర్వీస్ గుర్తింపు కార్డు(కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా ప్రభుత్వరంగ సంస్థ జారీ చేసిన గుర్తింపు కార్డు), ఫొటో ఉన్న బ్యాంకు లేదా తపాలా ఖాతా పాస్‌బుక్, ఎన్‌పీఆర్ కింద ఆర్‌జీఐ ఇచ్చిన స్మార్ట్‌కార్డు, ఎంఎన్‌ఆర్‌ఈజీఏ జాబ్ కార్డు, కార్మిక మంత్రిత్వశాఖ ఇచ్చిన ఆరోగ్య బీమా కార్డు, ఫొటో ఉన్నపింఛన్ పత్రం, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు జారీ చేసిన గుర్తింపు కార్డు.

మరో చాన్స్ ఎందుకు!?

- ఐదేళ్ల పాలనను మననం చేసుకుంటున్న ప్రజలు
- అన్యాయాలు, అక్రమాలు, అశాంతి పాలనపై ఆగ్రహం
- కూటమి నాయకత్వంపై పెరుగుతున్న నమ్మకం



నెల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా స్వామ్యంలో ఓటన్నది వజ్రాయుధం. పాలకులను నిర్ణయంచే బ్రహ్మాస్త్రం. ఈ పాలకుల ఎన్నిక సందర్భంగా పోటీ చేసే అభ్యర్థుల పుట్టుపూర్వోత్తరాలు, గుణగణాలు ప్రజలకు తెలియాలనే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ పలు చట్టాలు తీసుకొంది. అందులో భాగంగానే కేసులకు సంబంధించి అఫిడవిట్లను ప్రకటనల రూపంలో ప్రజలకు తెలియజేయాలనే నిబంధన పెట్టింది. ఈ కేసులు ఇప్పుడు ప్రజల చర్చల్లో భాగమయ్యాయి. ఆ కేసుల ఆధారంగా, గడచిన ఐదేళ్ల పాలన నడిచిన తీరు ఆధారంగా అధికార వైసీపీ అభ్యర్థులకు ఓటు వేయాలా, ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టాలా అనే చర్చ విస్తృతంగా నడుస్తోంది.

విజయసాయిపై 21 కేసులు

ఒక్క నియోకవర్గం మినహా మిగిలిన జిల్లా అంతటా విస్తరించి ఉన్న నెల్లూరు పార్లమెంట్‌కు ఆ గట్టున ఉన్న నాయకుడు విజయసాయిరెడ్డిపై 21 కేసులు ఉన్నాయి. అందులో 11 సీబీఐ కేసులు, 8 ఈడీ కేసులు. జగన్ అక్రమాస్తులు, ఆర్థిక నేరాలు, మనీ ల్యాండరింగ్ కేసుల్లో జగన్ ఏ1 నిందితుడైతే ఈయన ఏ2 నిందితుడిగా ఉన్నారు. ఈ రోజుకూ సీబీఐ, ఈడీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నాడు. విశాఖలో భారీ ఎత్తున ప్రభుత్వ, ప్రైవేటు భూములు కొల్లగొట్టారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. నెల్లూరు జిల్లా వాసి అయినా, ప్రభుత్వంలో నెం.2గా చలామణి అయినా జిల్లాకు చేసిన మేలంటూ ఏమీ లేదు. దత్తత తీసుకున్న సొంతూరికి కూడా అంతంత మాత్రంగానే సేవలందించారాయన.

● సర్వేపల్లి నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ పడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై 7కేసులు ఉన్నాయి. ఇందులో 2014 ఎన్నికల సమయంలో కల్తీ మద్యం సరఫరా చేసి పలువురి మరణానికి కారణమయ్యారన్న అభియోగాలపై ఈయనపై కేసు నమోదయ్యింది. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన అభియోగాలపై మరో రెండు కేసులు ఉన్నాయి. కోర్టులో కీలక పత్రాల చోరీ కేసులో ఈయన హస్తం ఉందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. సర్వేపల్లి నియోజకవర్గం పరిధిలోని చెరువులను గుల్ల చేసి మట్టి కొల్లగొట్టారని, అక్రమ తవ్వకాలతో వందల కోట్ల విలువైన క్వార్ట్జ్‌ని కొల్లగొట్టారనే అభియోగాలు ఉన్నాయి. దీనికితోడు పోలీసులను గుప్పెట పెట్టుకొని నియోజకవర్గ ప్రజలపై అక్రమ కేసులు బనాయించారని, బెదిరింపులకు, హింసకు గురిచేశారనే విమర్శలు ఉన్నాయి. కరోనా కష్టకాలంలో ప్రజల పేరు చెప్పి దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

● ఆత్మకూరు అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డిపై 8 కేసులు ఉన్నాయి. అన్నీ ఆర్థిక నేరాలకు సంబంధించినవే. కేరళా జాతీయ రహదారి టోల్‌గేట్ వసూళ్లలో అవినీతికి పాల్పడ్డారని సీబీఐ కేసు నమోదు చేసింది. అలాగే ఆర్థిక అంశాలకు సంబంధించి కేరళ, ఉత్తరప్రదేశ్‌లలోనూ విక్రమ్‌పై కేసులు నమోదైనట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

● ఉదయగిరి వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిపై ఆర్థిక లావాదేవీలకు సంబంధించి 5 కేసులు ఉన్నాయి. ● ఇక ఐదేళ్ల పాలన విషయానికి వస్తే ఒక్కటంటే ఒక్క పరిశ్రమను కూడా స్థాపించలేకపోయారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించక యువతను నిర్వీర్యం చేశారు. నామ మాత్రపు అభివృద్ధి కూడా చేయలేక చేతులెత్తేశారు. ● అదే సమయంలో అటు ప్రతిపక్షాల మీద, ఇటు అమాయక ప్రజల మీద, ఇటు సహజ వనరుల మీద నిరంతర దాడి కొనసాగిందనే వాదన ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు భూములు కొల్లగొట్టారు. ప్రజలందరి ఆస్తి అయిన ఇసుకను దోచేశారు. పిడికెడు మట్టి దొరకనివ్వకుండా కొండలను, గుట్టలను, చెరువులను కబళించి వేశారు. క్వారీ గనులను, సిలికా మైన్లపై దురాక్రమణ చేసి స్వాధీనం చేసుకున్నారు. వందల కోట్ల సహజ వనరులను నిర్భీతిగా, నిరాటంకంగా కొల్ల గొట్టారు. అక్రమ మద్యం అమ్మకాలతో లక్షలు గడించారు. ఊరూరా గంజాయి విక్రయాలకు ఆస్కారం కలిగించారు. భూమి కొనాలన్నా, అమ్మాలన్నా వీరికి మామూళ్లు చెల్లించని పరిస్థితి సృష్టించారు. ప్రజలపైకి పోలీసులను ఉసిగొలిపి అక్రమ కేసులు పెట్టించారు. స్వేచ్ఛగా హాయిగా జీవనం సాగించాల్సిన ప్రజలను ఐదేళ్ల పాటు భయం భయంగా బతికే వాతావరణం సృష్టించారనే అభియోగాలు వైసీపీ ఎదుర్కొం టోంది. ఇలాంటి పార్టీకి, నాయకులకు మరో చాన్స్ ఎందుకివ్వాలనే చర్చ జనంలో జోరుగా సాగుతోంది.

● గత మూడు రోజుల వ్యవధిలోనే ప్రజల ట్రెండ్ బట్టబయలవుతోంది. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీపడని నైజం, అభివృద్ధి, సంక్షేమాలను రెండు కళ్లుగా చూసే దృక్పథం, రౌడీయిజం, పోలీస్ జులంకు ఆస్కారమివ్వని అధినాయ కత్వం, టీడీపీ అధినేత చంద్రబాబు పాలనాదక్షతపై విశ్వాసం, జనసేనాని పవన్ కల్యాణ్ నిజాయితీపై నమ్మకం, మోదీ నాయతక్వ బలం మీద నమ్మ కాలపై ప్రజల విశ్వాసం పెరుగుతూ ఉంది. కూటమి గ్రాఫ్ గణనీయంగా పెరుగుతున్నట్లు కనబడుతోంది.

● కావలి వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మీద నమోదైన కేసులు ఐదే అయినా ఆయన చేయించినట్లుగా ప్రజలు భావిస్తున్న నేరాలు చాలానే ఉన్నాయి. అఫిడ విట్ ప్రకారం 2014 ఎన్నికల్లో కల్తీ మద్యం సరఫరా చేసిన కేసులో ఈయన నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులు ప్రస్తుతం సీఐడీ విచారణలో ఉన్నాయి. ఇక కావలిలో ప్రతి పనికి మామూళ్లు తీసుకున్న నాయకుడిగా ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూములను కబ్జా చేశారని, మట్టి, ఇసుక తోలుకుని బతికే సన్న, చిన్న ట్రాన్స్‌పోర్టర్ల పొట్ట కొట్టారని, పేదల ఇళ్ల పేరుతో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని, పోలీసులను ఉసిగొల్పి వ్యాపారులను వేదించారని, పలువురి ఆత్మహత్యలకు పరోక్షంగా కారణమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.